www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 25-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 280 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 8.32 తదుపరి ద్వాదశి; నక్షత్రం: అనూరాధ ఉ. 7.08 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: మ.1.02-2.43; దుర్ముహూర్తం: ఉ.6.52-8.21; అమృతఘడియలు: రా.11.09-12.50; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.02 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సన్యాసినిగా మమతా కులకర్ణి

కిన్నెర అఖాడాలో చేరిన మాజీ హీరోయిన్


శ్రీ యమయ్ మమతా నందగిరిగా పేరు మార్పు

మహా మండలేశ్వర్‌గా నియామకం

కుంభమేళాలో పూజలు నిర్వహించిన మమత

మహాదేవుడి ఆదేశాలతోనే భక్తి మార్గమని వెల్లడి

2



'విశాఖ ఉక్కు' ప్యాకేజీకి థ్యాంక్స్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలతో బాబు భేటీ

కేంద్ర బడ్జెట్‌లో పోలవరం, అమరావతికి నిధులు కేటాయించాలని వినతి

దావోస్ నుంచి నేరుగా ఢిల్లీకి సీఎం



ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

మంచి ప్రభుత్వాన్ని మార్చేస్తే నష్టం

నవ్యాంధ్ర భవితకు నాడు పునాది వేశాం

సర్కారు మారడంతో సున్నాతో ప్రయాణం

రెండోసారీ గెలిస్తే రాష్ట్రం ఎంతో ఎత్తుకెళ్లేది

ఉమ్మడి ఏపీలో వరుసగా పదేళ్లు ఉన్నాం

నాడు మంచి ప్రగతిని చూపించగలిగాం

ప్రభుత్వాలు పదేపదే మారే, మారని రాష్ట్రాల మధ్య ప్రగతిలో చాలా వ్యత్యాసం

దీనిపై నివేదిక ఇవ్వాలని నిర్మలకు చెప్పా

టీడీపీ నేతలకు వివరించిన చంద్రబాబు

దావోస్ పర్యటన పట్ల సంతృప్తి

పాలనాదక్షతపై నమ్మకంతో కంపెనీలు రాబోతున్నాయి.. అధికారులతో సీఎం

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఐదేళ్లకు ఒకసారి మారిపోతుంటే అభివృద్ధికి నష్టం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. "రాష్ట్ర విభజన తర్వాత మనం ఒక పునాది వేశాం. అది ఒక స్థాయికి చేరకముందే ప్రభుత్వం మారిపోయింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం తన విధ్వంస పాలనతో ఆ పునాదిని నేలమట్టం చేసింది. ఇప్పుడు మళ్లీ మనం సున్నా నుంచి మొదలు పెట్టాల్సి వస్తోంది. మన ప్రభుత్వానికి కొనసాగింపు ఉండి ఉంటే ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ చాలా ఎత్తున ఉండేది' అని ఆయన అన్నారు. దావోస్ నుంచి గురువారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి బయలుదేరి శుక్రవారం సాయంత్రం ఉండవల్లి చేరుకున్నారు. తనను కలవడానికి వచ్చిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో ఇంటి వద్ద కొద్దిసేపు మాట్లాడారు. 'ఈ రోజు ఉదయం

మిగతా 13వ పేజీలో...

బ్రాండ్ ఏపీ పునరుద్ధరణే లక్ష్యంగా!

30 మంది పారిశ్రామికవేత్తలతో లోకేశ్ భేటీలు

దావోస్‌లో 8 రౌండ్‌టేబుల్ సమావేశాలు

9 మంది అంతర్జాతీయ నిపుణులతో చర్చలు



రాజకీయాలకు సాయిరెడ్డి సెలవు!



నేడు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా

ఇక ఏ రాజకీయ పార్టీలోనూ చేరను

వ్యవసాయమే నా భవిష్యత్తు

టీడీపీతో రాజకీయ విభేదాలే..

చంద్రబాబుతో వ్యక్తిగత వైరం లేదు

జగన్, భారతి, మోదీ, షాకు కృతజ్ఞతలు

'ఎక్స్' వేదికగా సంచలన ప్రకటన

10న విదేశాలకు..

సీబీఐ ప్రత్యేక కోర్టుకు విన్నపం

సీబీఐ స్పందన కోరిన న్యాయస్థానం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైఎస్ కుటుంబానికి వీర విధేయుడు, అక్రమాస్తుల కేసులో ఏ2, 16నెలలు జగన్‌కు జైలులో సహచరుడు, వైసీపీ కీలక నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకొంటున్నట్లుగా సంచలన ప్రకటన చేశారు. 'ఇక ఏ పార్టీలోనూ చేరను. వ్యవసాయమే నా భవిష్యత్తు' అని ప్రకటించారు. రాజ్యసభ సభ్యుడిగా మరో మూడేళ్ల పదవీకాలం మిగిలి ఉన్నప్పటికీ... శనివారమే దానికి రాజీనామా చేస్తున్నట్లు సాయి రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం 'ఎక్స్' వేదికగా ఆయన ఈ ప్రకటన చేశారు. "రాజకీయాల నుంచి తప్పుకొంటున్నాను. ఏ రాజకీయ పార్టీలోనూ చేరడం లేదు. వేరే పదవులో, ప్రయోజనాలో లేక

మిగతా 13వ పేజీలో...

ఇదీ సాయిరెడ్డి ప్రకటన

"రాజకీయాల నుంచి తప్పుకొంటున్నాను. రాజ్యసభ సభ్యత్వానికి 25వ తేదీ (శనివారం) రాజీనామా చేస్తున్నాను. ఏ రాజకీయ పార్టీలోనూ చేరడం లేదు. వేరే పదవులో, ప్రయోజనాలో లేక డబ్బులో ఆశించి రాజీనామా చేయడం లేదు. ఈ నిర్ణయం పూర్తిగా నా వ్యక్తిగతం. ఎలాంటి ఒత్తిళ్లు లేవు. ఎవరూ ప్రభావితం చేయలేదు. నాలుగు దశాబ్దాలుగా, మూడు తరాలుగా నన్ను నమ్మి ఆదరించిన వైఎస్ కుటుంబానికి రుణపడి

మిగతా 13వ పేజీలో...

'అయోధ్య'దీ అదే దారి!?





హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా యడవల్లి లక్ష్మణరావు, అవధానం హరిహరనాథ శర్మతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా

హరిహరనాథశర్మ, లక్ష్మణరావు

ప్రమాణం

సింగిల్ బెంచ్‌లో కేసుల విచారణ

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా అవధానం హరిహరనాథశర్మ, యడవల్లి లక్ష్మణరావు ప్రమాణం చేశారు. శుక్రవారం హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వారితో ప్రమాణం చేయించారు. అంతకుముందు

మిగతా 14వ పేజీలో...



13

శుక్రవారం విజయవాడ ఐజీఎంఎస్‌లో మ్యూజికల్ నైట్‌కు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న నారా భువనేశ్వరి

తలసేమియా బాధితులకు బాసట

15న విజయవాడలో తమన్ మ్యూజికల్ నైట్

ఏర్పాట్లను పరిశీలించిన నారా భువనేశ్వరి

బంగారం @ 83,000

సరికొత్త రికార్డు స్థాయికి ధర

వరుసగా 8వ రోజూ పైపైకి..



10



అదానీకి శ్రీలంక సర్కారు షాక్!

విద్యుత్ కొనుగోలు ఒప్పందం రద్దు?

అక్రమ వలసదారులపై ట్రంప్ సర్కారు

ఉక్కుపాదం

538 మంది అరెస్టు.. 373 మంది నిర్బంధం

సైనిక విమానాల్లో వందల మంది డీపోర్టేషన్

జన్మతః పౌరసత్వ హక్కు రద్దును నిలిపివేస్తూ కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలు చేస్తాం: ట్రంప్

అమెరికా డీపోర్ట్ చేసే భారతీయులను వెనక్కి తీసుకునేందుకు రెడీ: భారత విదేశాంగ శాఖ



తాను అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే అక్రమ వలసదారులను దేశం నుంచి వెళ్లగొడతానంటూ ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్.. పగ్గాలు చేపట్టిన మూడోరోజునే ఆ పని మొదలుపెట్టారు! ట్రంప్ యంత్రాంగం ఒక్క జనవరి 23నే.. అమెరికాకు అక్రమంగా వలసవచ్చిన నేరగాళ్లలో 538 మందిని అరెస్టు చేసినట్టు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కారొలిన్ లెవిట్ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. అరెస్టై అయినవాళ్లలో ఒక అనుమానిత ఉగ్రవాది, వెనిజులాకు చెందిన 'ట్రెన్ డి అరాగ్వా' అనే నేరగాళ్ల ముఠాలోని నలుగురు ప్రముఖ సభ్యులు, మైనర్లపై లైంగికదాడులకు పాల్పడిన పలువురు నేరగాళ్లు ఉన్నట్టు ఆమె వివరించారు. అంతేకాదు.. వందలాది మంది అక్రమ వలసదారులను సైనిక విమానాల్లో దేశం నుంచి డీపోర్ట్ చేసినట్టు (దేశ బహిష్కరణ) పేర్కొన్నారు. "చరిత్రలోనే అతి పెద్ద బహిష్కరణ ప్రక్రియ ప్రస్తుతం అమెరికాలో జరుగుతోంది. హామీ ఇచ్చాం. హామీని నిలబెట్టుకుంటున్నాం" అని ఆమె తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తే పర్యవసానాలను

మిగతా 2వ పేజీలో...



దేశంలోనే అత్యంత ఖరీదైన

రిఫైనరీ ఏపీలో

ప్రాథమిక అంచనా 95 వేల కోట్లు

కోస్తా తీరంలో ఏర్పాటుకు బీపీసీఎల్ నిర్ణయం

ఏటా 9 మిలియన్ టన్నుల సామర్థ్యం

ఆరు వేల ఎకరాల భూమి అవసరం

భూసేకరణ, డీపీఆర్‌కు రూ.6,100 కోట్లు

6 నుంచి 9 నెలల్లో డీపీఆర్ సిద్ధం

బీపీసీఎల్ డైరెక్టర్ రామకృష్ణ గుప్తా వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) దేశంలోనే అత్యంత ఖరీదైన ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నిర్మాణానికి సుమారు రూ.95 వేల కోట్ల వ్యయం అవసరమని

మిగతా 14వ పేజీలో...

జగన్ హయాంలో ఆంధ్ర విలవిల!

ఆర్థికంగా కునారిల్లిందంటూ నీతి ఆయోగ్ నివేదిక వెల్లడి

తీవ్ర ఆర్థిక లోటు.. భారీగా అప్పులు

అతి తక్కువ మూలధన వ్యయం

ఘోరంగా దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్

ఆర్థిక ఆరోగ్య సూచీలో 17వ స్థానం

అప్పుల చెల్లింపు సామర్థ్యం సున్నా

రాష్ట్రానికి ఆర్థిక చేయూత అవసరం

ఇప్పటికైనా మూలధన వ్యయ సామర్థ్యాన్ని ఏపీ పెంచుకోవాలి

ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచన

ఆర్థికంగా బలమైన రాష్ట్రాల్లో ఒడిశా ఫస్ట్.. తెలంగాణకు 8వ స్థానం



NITI Aayog

న్యూఢిల్లీ/అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లలో తీవ్రమైన ఆర్థిక లోటు, అతి తక్కువ మూలధన వ్యయం, భారీ అప్పుల మూలంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా కునారిల్లిందని నీతి ఆయోగ్ 'ఆర్థిక ఆరోగ్య సూచిక-2025' వెల్లడించింది. 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అర్వింద్ పనగాడియా శుక్రవారం ఢిల్లీలో ఈ నివేదిక విడుదల చేశారు. ఇప్పటికైనా మూలధన వ్యయ సామర్థ్యాన్ని రాష్ట్రం పెంచుకోవాలని, ఖర్చులు సమర్థంగా నిర్వహించాలని, కట్టుదిట్టమైన ఆర్థిక క్రమశిక్షణతో వనరులను పెంచుకోవాలని నీతి ఆయోగ్ అందులో సూచించింది. 'ఆంధ్రప్రదేశ్‌లో

మిగతా 13వ పేజీలో...

మావోయిస్టు నేత చలపతి అంత్యక్రియలు పూర్తి

అత్తగారి ఊరు శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడులో నిర్వహణ

14

ప్రజాసంఘ నాయకుల నివాళి

శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడులో చలపతి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ ప్రజా సంఘాల నేతలు, అభిమానులు



దిల్‌రాజు, మరికొందరి వాంగ్మూలాల నమోదు

ఆదాయం, పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసాల గుర్తింపు

కీలక పత్రాలు, సాంకేతిక ఆధారాలు స్వాధీనం

వరుసగా నాలుగో రోజూ కొనసాగిన ఐటీ సోదాలు

దిల్‌రాజును వెంట తీసుకెళ్లి మరీ పత్రాలు పరిశీలించిన ప్రత్యేక బృందం

12



పేలుడుతో నామరూపాల్లేకుండా పోయిన ఫ్యాక్టరీ

2

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పేలుడు

8 మంది మృతి.. ఏడుగురికి గాయాలు

మహారాష్ట్ర భండారా జిల్లాలో ఘటన



సన్యాసినిగా మమతా కులకర్ణి

» కిన్నెర అఖాడాలో చేరిన మాజీ హీరోయిన్

వారణాసి, జనవరి 24: బాలీవుడ్ మాజీ హీరోయిన్ మమతా కులకర్ణి ఆధ్యాత్మిక మార్గంలోకి మళ్లారు. వారణాసిలోని కుంభమేళాలో కిన్నెర అఖాడాలో చేరి.. తన పేరును శ్రీ యమయ్ మమతా నందగిరిగా మార్చుకున్నారు. శుక్రవారం ఉదయం రుద్రాక్ష మాలలు, కాషాయ వస్త్రాలు ధరించి కుంభమేళాకు వచ్చిన మమత.. కిన్నెర అఖాడా ఆచార్య మహా మండలేశ్వర్ డాక్టర్ లక్ష్మీనారాయణ్ త్రిపాఠిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం మమతతో లక్ష్మీనారాయణ్ గంగానదిలో పూజలు నిర్వహింపజేశారు. నదిలో మమత మూడుసార్లు మునక వేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ్ మీడియాతో మాట్లాడుతూ, కిన్నెర అఖాడాతో మమత ఏడాదిన్నరగా సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. ఆమెను మహా మండలేశ్వర్‌గా నియమిస్తున్నట్లు వెల్లడించారు. ఇకపై తనను శ్రీ యమయ్ మమతా నందగిరిగా పిలుస్తామన్నారు. మమత సినిమాల్లో నటించటంపై నిషేధం ఉంటుందా అన్న ప్రశ్నకు బదులిస్తూ.. కిన్నెర అఖాడాలో చేరిన వారు చేసే పనిపై ఎటువంటి నిషేధాలు ఉండవని, ఆమె కావాలనుకుంటే ఆధ్యాత్మిక పాత్రల్లో నటించవచ్చన్నారు. మమత మాట్లాడుతూ.. మహాదేవుడు, మహాకాళి, తన గురువు ఇచ్చిన ఆదేశాల ప్రకారమే తాను సన్యాసినిగా మారానని చెప్పారు.

ట్రాన్స్‌జెండర్లకు గౌరవం కోసం..

2015లో లక్ష్మీనారాయణ్ త్రిపాఠి కిన్నెర అఖడాను ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్లకు (లింగమార్పిడి చేసుకున్న వ్యక్తులకు) సమాజంలో గౌరవం తీసుకువచ్చే లక్ష్యంతో దీనిని నెలకొల్పారు. ట్రాన్స్‌జెండర్లను అఖాడాలో చేర్చుకున్నారు. కాగా, మమతా కులకర్ణి 1990లలో బాలీవుడ్‌లో ప్రముఖ గ్లామర్ హీరోయిన్‌గా వెలుగొందారు. కరణ్ అర్జున్, క్రాంతివీర్, ఆషిక్ అవారా, సబ్‌సే బడా కిలాడీ, చైనా గేట్ తదితర హిట్ సినిమాల్లో ఆమె నటించారు. 2002 అనంతరం ఆమె సినిమాలు చేయటం మానేశారు. విదేశాల్లో స్థిరపడిన మమతా కులకర్ణి చాలా కాలం అనంతరం గత ఏడాది డిసెంబరులో స్వదేశానికి తిరిగి వచ్చారు.

17 ఆధ్యాత్మిక నగరాల్లో మద్యం షాపులు క్లోజ్

» కీలక నిర్ణయం తీసుకున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వం

భోపాల్, జనవరి 24: మధ్యప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన పుణ్యక్షేత్రాలు ఉన్న 17 పట్టణాలలోని మద్యం దుకాణాలను మూసి వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం భోపాల్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో సీఎం మోహన్ యాదవ్ మీడియాకు తెలిపారు. "ప్రధాన పుణ్యక్షేత్రాలు ఉన్న 17 పట్టణాలలోని మద్యం షాపులను పూర్తిగా మూసివేస్తున్నాం. వాటిని ఇతర ప్రాంతాలకు తరలించడం లేదు. ఉజ్జయిని నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు బంద్ అవుతాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రజలకు మంచి పాలన అందించడానికి ప్రయత్నిస్తున్నాం. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుంది" అని సీఎం మోహన్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధ లక్ష్యానికి ఇది తొలిఅడుగని బీజేపీ నేతలు కొనియాడారు. మద్యం షాపులు బంద్ కానున్న ఆధ్యాత్మిక నగరాలు.... లింగా, పన్నా, ధటియా, మాండ్లా, ముల్తాయి, ఓంకారేశ్వర్, మహేశ్వర్, మండలేశ్వర్, చిత్రకూట్, అమర్‌కంటక్, కుండల్‌పూర్, మంద్‌సౌర్, బర్మన్ కలా, ఓర్చా, మైహర్, బందక్ పూర్, బర్మన్ ఖర్ద్.

బద్దాల్ నుంచి 200 మంది రాజౌరీ ఆస్పత్రికి

» కశ్మీర్‌లో మరణాల మిస్టరీ..మృతదేహాల్లో విషపు ఆనవాళ్లు

జమ్మూ, జనవరి 24: జమ్మూ రాజౌరీ సమీపంలోని బద్దాల్ గ్రామంలో మిస్టరీ మరణాలపై అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది. నిరుడు డిసెంబరు నుంచి గ్రామంలోని మూడు కుటుంబాల్లో 17 మంది అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం, నలుగురు ఆస్పత్రిపాలవడం చర్చనీయాంశమైంది. ఈ మరణాలకు కారణాలు తెలియరాలేదు. తాజాగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మైనర్లు జ్వరం, వాంతులతో బాధపడుతుండటంతో వారిని రాజౌరీలోని ఆస్పత్రిలో చేర్పించారు. బద్దాల్ నుంచి 200 మందిని రాజౌరీలోని ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ప్రత్యేక వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. అనుమానాస్పద వ్యక్తులు లోపలికి వెళ్లకుండా ఆస్పత్రి వద్ద ప్రత్యేకంగా పోలీసులను పెట్టారు. గ్రామంలో పరిస్థితిని, అక్కడి ప్రజల కదలికలను నిశితంగా పర్యవేక్షించడం కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే గ్రామానికి నీళ్ల సరఫరా చేసే ట్యాంకులో పురుగుల మందు ఆనవాళ్లున్నాయని అనుమానాలు వ్యక్తం చేయడం ఆందోళన కలిగించింది. కాగా మృతదేహాల పోస్టుమార్టం రిపోర్టుల్లో విషపు ఆనవాళ్లు లభ్యమైనట్లు లఖ్‌నవులోని శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన (సీఎస్ఐఆర్) టాక్సికాలజీ లాబొరేటరీ కౌన్సిల్ ప్రాథమికంగా నిర్ధారించినట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఇక ఆ విషపదార్థాలను పరీక్షిస్తారని, త్వరలోనే మరణాల వెనుక మిస్టరీ వీడుతుందని చెప్పారు.

అక్రమ వలసదారులపై ట్రంప్ ఉక్కుపాదం



(మొదటి పేజీ తరువాయి)

అనుభవించక తప్పదనే బలమైన, స్పష్టమైన సందేశాన్ని ట్రంప్ ఇస్తున్నారని వెల్లడించారు. ఈ ఆపరేషన్ చేపట్టిన అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) కూడా జనవరి 23న అమెరికాలో 538మంది అక్ర మ వలసదారులను అరెస్టు చేశామని, మరో 373మందిని నిర్బంధించామని ట్వీట్ చేసింది. వివిధ దేశాల నుంచి పలు మార్గాల్లో అమెరికాకు వచ్చి అనుమతులు లేకుండా అక్కడ నివసిస్తున్న అక్రమ వలసదారుల సంఖ్య దాదాపు 1.1కోట్ల దాకా ఉంటుందని అంచనా. ఇక అమెరికా డీపోర్ట్ చేసే మెక్సికన్లను ఆదుకోవడానికి ఆ దేశ ప్రభుత్వం 'మెక్సికో మిమ్మల్ని ఆదుకుంటుంది' అనే పథకం కింద తమ దేశ సరిహద్దుల్లో 9అత్యవసర షెల్టర్లను ఏర్పాటుచేసింది. అమెరికా తమ దేశానికి పంపే విదేశీయులకు సైతం తాము ఆశ్రయమిస్తామని పేర్కొంది. భారతదేశం కూడా ఈ మాస్ డీపోర్టేషన్ ఆపరేషన్‌పై స్పందించింది. "అక్రమ వలసలకు మేం వ్యతిరేకం. అమెరికాలో ఉన్న భారతీయులనే కాదు.. వారు ఏ దేశంలోనైనా ఉండాల్సిన కాలపరిమితికి మించి ఉన్నా, సరైన పత్రాలు లేకుండా నివసిస్తున్నా వారిని వెనక్కి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. వారు భారతీయులని నిర్ధారణ అయితే తిరిగి భారత్‌కు రావడానికి సహకారం అందిస్తాం" అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు.

అప్పీలు చేస్తాం

జన్మతః పౌరసత్వ హక్కును రద్దుచేస్తూ తాను ఇచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఇచ్చిన తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. దానిపై తమ యంత్రాంగం అప్పీలు చేస్తుందని గురువారం వైట్‌హౌస్‌లో మీడియాతో అన్నారు. తన ఉత్తర్వుపై డెమొక్రాట్ పాలిత రాష్ట్రాల అటార్నీ జనరళ్లు సియాటెల్‌లో ఒక నిర్ణీత జడ్జి వద్దకు వచ్చేలా వ్యాజ్యం వేసి ఉంటారని, ఆ జడ్జి విషయంలో తనకు ఎలాంటి ఆశ్చర్యమూ లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీ నెరవేర్చే దిశగా కూడా ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెన్నెడీ, ఆయన సోదరుడు, సెనెటర్ రాబర్ట్ ఎఫ్.కెన్నెడీ, పౌర హక్కుల ఉద్యమనేత మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యలకు సంబంధించిన ఫైళ్లను బయటపెట్టాల్సిందిగా జాతీయ నిఘా సంస్థ డైరెక్టర్, అటార్నీ జనరల్‌ను ఆదేశిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేశారు. దాని ప్రకారం 15రోజుల్లోగా జాన్ ఎఫ్.కెన్నెడీ హత్యకు సంబంధించిన పత్రాల విడుదలకు సంబంధించిన ప్రణాళికను రూపొందించాలి. 45రోజుల్లోగా మిగతా ఇద్దరి హత్యలకు సంబంధించిన పత్రాల విడుదల ప్రణాళికను రూపొందించాలి. ఈ పత్రాల కోసం ఎంతోమంది ప్రజలు ఎన్నో ఏళ్లుగా, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారని ట్రంప్ పేర్కొన్నారు. ఉత్తర్వుపై సంతకం చేశాక ఆ పెన్నును రాబర్ట్ ఎఫ్.కెన్నెడీ కుమారుడు రాబర్ట్ ఎఫ్.కెన్నెడీ జూనియర్‌కు జ్ఞాపికగా ఇచ్చారు.

ట్రంపే అధ్యక్షుడై ఉంటే..

"డొనాల్డ్ ట్రంపే గనక 2020ఎన్నికల్లో గెలిచి అధ్యక్షుడై ఉంటే.. అప్పట్లో మోసపూరితంగా ఆయన్నుంచి విజయాన్ని లాగేసుకోకుండా ఉండి ఉంటే.. ఉక్రెయిన్‌లో బహుశా 2022లో సంక్షోభం తలెత్తి ఉండేది కాదు" అని రష్యా అధ్యక్షుడు పుతిన్ తాజాగా వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం విషయంలో చర్చలకు తానెప్పుడూ సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. రష్యన్ ప్రభుత్వ రంగ మీడియాతో మాట్లాడిన పుతిన్.. అమెరికాకు కొత్తగా అధ్యక్షుడైన ట్రంప్‌ను తెలివైనవాడు, కార్యసాధకుడుగా అభివర్ణించారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించే ఒప్పందం కుదుర్చుకోకుంటే రష్యాపై అధిక పన్నులు, సుంకాలు, ఆంక్షలు విధిస్తానంటూ బుధవారం ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు.. ఉత్తర అమెరికా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌ను కలిసే ఆలోచన ఉన్నట్టు ట్రంప్ గురువారం వెల్లడించారు. 2019లో ట్రంప్ ఉత్తరకొరియాకు వెళ్లి మరీ కిమ్‌ను కలిసిన సంగతి తెలిసిందే.

వంద లక్షల కోట్లు!

ట్రంప్ సర్కారు చేపట్టిన అక్రమ వలసదారుల మాస్ డీపోర్టేషన్ భారీ ఖర్చుతో కూడుకున్న పని అని 'అమెరికన్ ఇమ్మిగ్రేషన్ కౌన్సిల్' 2022లో ఓ నివేదిక విడుదల చేసింది. దాని ప్రకారం 2022లోనే అందుకు అయ్యే ఖర్చు 1.1 ట్రిలియన్ డాలర్ల నుంచి 1.7 ట్రిలియన్ డాలర్ల దాకా ఉంటుందని అందులో పేర్కొంది. ఇప్పటి లెక్కల ప్రకారం ఆ మొత్తం.. దాదాపు రూ.వంద లక్షల కోట్లకు సమానం.

ట్రంప్ ఈవెంట్‌లో పన్నూ

డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం సందర్భంగా నిర్వహించిన 'ద లిబర్టీ బాల్' ఈవెంట్‌కు ఖలిస్థానీ ఉగ్రవాది గుర్‌పత్వంత్‌సింగ్ పన్నూ హాజరు కావడం సంచలనం సృష్టించింది. ఆ కార్యక్రమానికి హాజరైనవారంతా 'యూఎస్ఏ యూఎస్ఏ' అంటూ నినాదాలు చేస్తుండగా.. పన్నూ మాత్రం కెమెరా వైపు తిరిగి 'ఖలిస్థాన్ జిందాబాద్' అంటూ నినదించిన వీడియో వైరల్ అవుతోంది. దీనిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పందిస్తూ.. భారత వ్యతిరేక కార్యకలాపాలు ఏవి జరిగినా ఆ విషయాన్ని తాము అమెరికా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. భారత వ్యతిరేక ఎజెండాతో సాగించే కార్యకలాపాలకు సంబంధించిన, దేశ భద్రతపై ప్రభావం చూపే అంశాలను అమెరికా వద్ద లేవనెత్తడాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.

లోకం తీరు



ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పేలుడు

» 8 మంది మృతి, ఏడుగురికి గాయాలు

ముంబై, జనవరి 24 : మహారాష్ట్రలోని భండారా జిల్లా జవహర్ నగర్ ప్రాంతంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో శుక్రవారం ఉదయం జరిగిన పేలుడు వల్ల 8 మంది కార్మికులు మృతి చెందారు. మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ నిర్ధారించారు. పేలుడు వల్ల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని ఒక యూనిట్ పైకప్పు కూలడంతో కార్మికులు దాని కింద చిక్కుకున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. జిల్లా అధికారులు అక్కడికి చేరుకున్నారని, మహారాష్ట్ర విపత్తుల స్పందన దళం సిబ్బంది కూడా వెళుతున్నారని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

లీటర్ అమూల్ పాలపై రూ.1 తగ్గింపు

న్యూఢిల్లీ, జనవరి 24: అమూల్ బ్రాండ్ కింద డెయిరీ ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్న గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) దేశవ్యాప్తంగా లీటరు పాల ధరలను రూ.1 మేర తగ్గించింది. ఒక లీటరు ప్యాక్‌లపై మాత్రమే ఈ ధరలు తగ్గాయి. పెద్ద పాల ప్యాక్‌లను వినియోగదారులు కొనేలా ప్రోత్సహించేందుకు ధరలను తగ్గించినట్టు జీసీఎంఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ జయెన్ మెహతా తెలిపారు. ఢిల్లీలో లీటరు అమూల్ గోల్డ్ పాల ధర రూ.68 నుంచి 67కు, అమూల్ తాజా పాల ధర రూ.56 నుంచి రూ.55కు తగ్గించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీసీఎంఎంఎఫ్ టర్నోవర్ 8 శాతం మేర పెరిగి రూ.59,445 కోట్లకు చేరుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధిని ఆశిస్తున్నట్టు మెహతా ఇంతకు ముందు పేర్కొన్నారు.

'వక్ఫ్' జేపీసీ భేటీలో రచ్చ

ఒవైసీ, రాజా, బెనర్జీ సహా 10 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చకు ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశంలో శుక్రవారం పెద్దఎత్తున గందరగోళం చెలరేగింది. చైర్మన్ జగదంబికాపాల్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విపక్ష సభ్యులు ఆరోపించారు. అరుపులు, నినాదాల నడుమే జమ్మూకశ్మీరుకు చెందిన మీర్వాయిజ్ ఒమర్ ఫరూక్ సవరణ బిల్లుపై తన అభిప్రాయం తెలియజేశారు. దీంతో చైర్మన్ తీరును నిరసిస్తూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. దీంతో ఆయన కాసేపు సమావేశాన్ని వాయిదావేశారు. తర్వాత కూడా ఇదే కొనసాగడంతో జేపీసీలో బీజేపీ సభ్యుడు నిశికాంత్ దూబే. 10 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్‌కు తీర్మానం ప్రవేశపెట్టారు. కమిటీ ఆమోదించింది. దీంతో విపక్ష సభ్యులు కల్యాణ్ బెనర్జీ, నదీమ్ ఉల్ హక్ (టీఎంసీ), అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), ఎ.రాజా, ఎం.అబ్దుల్లా (డీఎంకే), మహ్మద్ జావేద్, ఇమ్రాన్ మసూద్, నసీర్ హుస్సేన్ (కాంగ్రెస్), అరవింద్ సావంత్ (ఉద్ధవ్ శివసేన), మొహిబుల్లా (ఎస్పీ)లను సమావేశం నుంచి ఒక్క రోజు సస్పెండ్ చేస్తున్నట్లు పాల్ ప్రకటించారు. దీనిపై వారంతా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. 'శుక్రవారం సమావేశంలో విపక్ష సభ్యులు ఎంతో హుందాగా తమ వాదన వినిపించారు. అయితే చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరించారు. ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడి, హఠాత్తుగా అరుస్తూ మమ్మల్ని సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. మేం బయటకు రాగానే.. ఈ నెల 29న బిల్లుకు సంబంధించిన ముసాయిదా నివేదిక అందిస్తామని ఆయన మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. కమిటీ సభ్యులను సస్పెండ్ చేసే అధికారం జేపీసీ చైర్మన్‌కు లేదు. తదుపరి జేపీసీ సమావేశాన్ని వాయిదా వేయాలని ఆదేశించండి' అని లేఖలో కోరారు.

సివిల్స్ అభ్యర్థులకు యూపీఎస్సీ కొత్త నిబంధన

» ప్రిలిమ్స్ దరఖాస్తుతో పాటే వయసు, రిజర్వేషన్ల నిర్ధారణ పత్రాలు తప్పనిసరి

» గతంలో ప్రిలిమినరీ అర్హత సాధించాకే సమర్పించాల్సి ఉండేది

న్యూఢిల్లీ, జనవరి24: సివిల్ సర్వీసుల ప్రిలిమినరీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఇకపై ఆన్‌లైన్ అప్లికేషన్‌తో పాటు వయసు, రిజర్వేషన్‌లను నిర్ధారించే పత్రాలను కూడా అప్‌లోడ్ చేయాలని యూపీఎస్సీ సూచించింది. గతంలో ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించాక ఈ పత్రాలను సమర్పించాల్సి ఉండేది. ఇటీవల ఓ ఐఏఎస్ ప్రొబేషనర్ పూజా ఖేడ్కర్ తప్పుడు పత్రాలతో ఓబీసీగా ప్రకటించుకోవడంతో పాటు అంగవైకల్యానికి సంబంధించి తప్పుడు పత్రాలు సమర్పించినట్లు ఆరోపణలు రావడంతో యూపీఎస్సీ అధికారులు ఈ నిబంధన పెట్టారు. మరోవైపు యూపీఎస్సీ సివిల్స్- 2025 నోటిఫికేషన్ ఈ నెల 22న విడుదలయింది. అఖిల భారత సర్వీసుల్లో 23 విభాగాల్లోని 979 ఖాళీల భర్తీకి యూపీఎస్సీ ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దరఖాస్తుల దాఖలుకు ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు అవకాశం కల్పించింది. మే 25న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురంలో ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

'ఫిట్జీ' కోచింగ్ సెంటర్ల మూత

» ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో..

» కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో టీచర్ల మూకుమ్మడి రాజీనామాలు

» బోర్డు, ప్రవేశ పరీక్షల ముందు మూతతో ఆందోళనలో వేలాది మంది విద్యార్థులు

» ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న సంస్థ



న్యూఢిల్లీ, జనవరి 24: ఇంజినీరింగ్, నీట్ వంటి ప్రవేశ పరీక్షల కోచింగ్, విద్యార్థుల ఫౌండేషన్ ప్రోగ్రామ్స్‌లలో పేరొందిన ఎఫ్ఐఐటీజేఈఈ(ఫోరం ఫర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్- ఫిట్జీ) సెంటర్లు దేశవ్యాప్తంగా పలు నగరాల్లో మూతపడ్డాయి. ఢిల్లీ, మేరట్, ఘజియాబాద్, లఖ్‌నవూ, వారాణసీ, ఇండోర్, భోపాల్, పాట్నా, పుణేతో పాటు తాజాగా నోయిడాలో ఆ సంస్థ కోచింగ్ సెంటర్లను మూసివేశారు. ఆర్థిక, పాలనాపరమైన సవాళ్లు, గత కొన్ని నెలలుగా టీచర్లకు జీతాలు చెల్లించలేకపోవడమే ఇందుకు కారణం! సరిగ్గా కీలకమైన బోర్డు, ప్రవేశ పరీక్షల సమయంలో కోచింగ్ కేంద్రాలను మూసివేయడంపై వేలాది మంది విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది ఫిట్జీ సెంటర్ల ముందు ధర్నాలు చేశారు. నోయిడాలో పోలీసు ఫిర్యాదు చేశారు. 100 మందికి పైగా విద్యార్థుల ఫిర్యాదు మేరకు భోపాల్‌లో ఫిట్జీ సెంటర్‌పై కేసు నమోదైంది. దీంతో కోచింగ్ సెంటర్ లైసెన్స్‌ను జిల్లా యంత్రాంగం రద్దు చేసింది. గత ఏడాది జూన్‌లో తాను రెండేళ్లకు సంబంధించి రూ.4 లక్షల ఫీజును చెల్లించానని, ఇప్పుడు కోచింగ్ సెంటర్‌ను మూసివేయడంతో ఇంజినీర్ కావాలనే తన కుమార్తె కలపై ప్రభావం పడుందని ఓ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. తాము కష్టపడి సంపాదించి కట్టిన ఫీజును తిరిగివ్వాలని లేదా మిగిలిన కోర్సును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ల ప్రోగ్రామ్ ఫీజును ఒకేసారి చెల్లించామని, అందులో ఇంకా రెండేళ్లు ఉందని రాజీవ్ కుమార్ అనే మరో విద్యార్థి తండ్రి తెలిపారు.

నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు..

గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో చాలా మంది టీచర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారని, దీని వలనే కోచింగ్ సెంటర్లు అకస్మాత్తుగా మూతపడ్డాయని హిందుస్థాన్ టైమ్స్ పేర్కొంది. 'నేను నాలుగేళ్లకు పైగా అక్కడ బోధన చేస్తున్నాను. గత ఏడాది జూలై నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో.. నేను నవంబర్‌లో పాట్నా కోచింగ్ సెంటర్ నుంచి బయటకు వచ్చేశాను' అని ఒక టీచర్ పేర్కొన్నారు. అధ్యాపకులకు ఇతర కోచింగ్ సెంటర్ల నుంచి మంచి ఆఫర్లు రావడంతో వెళ్లిపోతున్నారని, దీంతో టీచర్లు లేకపోవడంతో మేరట్ సెంటర్‌ను మూసివేయాల్సి వచ్చిందని సిబ్బంది ఒకరు తెలిపారు.

నిధులు మళ్లింపు ఆరోపణలూ..

ఫిట్జీ సంస్థపై నిధులు మళ్లింపు ఆరోపణలు కూడా ఉన్నాయి. కోచింగ్ కార్యకలాపాల నిధులను ఇతర మార్గాలకు మళ్లించడంతో ఆ సంస్థ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందని, దీని వలన ఇన్వెస్టర్లు, టీచర్లు గుడ్‌బై చెబుతున్నారనే చర్చ నడుస్తోంది. లైసెన్స్, ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించినందుకు అధికారులు చర్యలు కూడా తీసుకున్నారని ఎన్డీటీవీ పేర్కొంది. మరోవైపు ఫిజిక్స్ వాలా, అన్‌అకాడమీ వంటి కొత్త సంస్థల నుంచి కూడా ఫిట్జీ విపరీతమైన పోటీ ఎదుర్కొంటోంది. ఐఐటీ ఢిల్లీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన డీకే గోయల్ అనే వ్యక్తి మూడు దశాబ్దాల క్రితం ఎఫ్ఐఐటీజేఈఈ సంస్థను స్థాపించారు. ఫిట్జీ సంస్థకు దేశవ్యాప్తంగా 41 నగరాల్లో 72 కోచింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 300 మంది సిబ్బంది ఉన్నారు.

ఇనుప యుగం తమిళనేలపైనే ఆరంభం!

» 5,300 ఏళ్ల కిత్రమే ఇనుప వస్తువుల వినియోగం

» శివకళై తవ్వకాల్లో బయల్పడిన ఇనుప పనిముట్లు

» పరిశోధనల్లో క్రీ.పూ.3,345 ఏళ్ల నాటివిగా గుర్తింపు

» పురావస్తు పరిశోధనల్లో సరికొత్త మలుపు





చెన్నై, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పురాతన నాగరికతకు నిలయమైన భారతదేశంలో ఇనుప యుగం.. శాస్త్రవేత్తలు అంచనా వేసిన దానికంటే రెండు వేల ఏళ్ల ముందే ప్రారంభమైందా..? క్రీస్తుపూర్వం 3,345 ఏళ్ల క్రితమే తమిళనాడులో ఇనుప లోహాన్ని వినియోగించారా...? ప్రపంచంలోనే ఇనుప యుగం తమిళనేలపైనే ఆరంభమైందా..? అంటే తాజా అధ్యయనాలు అవుననే చెబుతున్నాయి. తమిళనాట 5,300 సంవత్సరాల క్రితమే ఇనుపయుగం ఆరంభమైనట్లు పురావస్తు శాఖ జరిపిన అధ్యయనంలో తేలింది. తమిళనాడులోని మాంగాడు (సేలం), కీళ్‌నమండి (తిరువణ్ణామలై), మయిలాండుంపారై (కృష్ణగిరి), ఆదిచ్చనల్లూరు, శివకళై (తూత్తుకుడి) తదితర ప్రాంతాల్లోని శ్మశానవాటికల్లో జరిపిన తవ్వకాల్లో పలు ఇనుప వస్తువులు లభించాయి. వీటిలో శివకళై వద్ద లభించిన ఇనుప ఆయుధం 5,300 సంవత్సరాల నాటిదని భారత్‌తోపాటు అమెరికాలో జరిపిన పరీక్షల్లో నిర్ధారణ అయింది. శివకళై వద్ద సుమారు 2,000 ఎకరాల స్థలంలో ఇనుప వ్యర్థాలు పరచుకుని ఉండటాన్ని ఆ ప్రాంతానికి చెందిన మాణిక్యం అనే ఉపాధ్యాయుడు గమనించి అక్కడ పురావస్తు తవ్వకాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు తమిళనాడు ప్రభుత్వం 2020లో తవ్వకాలు ప్రారంభించింది. ఆ తవ్వకాల్లో మట్టి కుండలు, ధాన్యపు గింజలు, మనిషి దవడ ఎముకలు, దంతాలు, బూడిద బయల్పడ్డాయి. ఆ తర్వాతి ఏడాది జరిపిన తవ్వకాల్లో ఇనుముతో తయారైన కత్తులు, బాణపు కొనలు, ఉంగరాలు, కొడవళ్లు సహా 85కు పైగా ఇనుప పనిముట్లు లభించాయి. వాటిని పరీక్షించగా క్రీ.పూ. 3,345 ఏళ్ల నాటివని స్పష్టమైంది. దీంతో ఆ విషయాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం అధికారికంగా ప్రకటించారు. రాష్ట్ర పురావస్తు పరిశోధన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 'ఇనుము ప్రాచీనత' (యాంటిక్విటీ ఆఫ్ ఐరన్) అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ.. సుమారు 5,300 ఏళ్ల క్రితమే తమిళనాడులో ఇనుముతో చేసిన వస్తువులను వినియోగించినట్టు శాస్త్రీయంగా నిరూపితమైందని అన్నారు. శివకళై వద్ద జరిపిన తవ్వకాలలో తమిళ లిపి అక్షరాలు కలిగిన మట్టి కుండ క్రీ.పూ. 685 ఏళ్లనాటిదని నిర్ధారణ అయిందని, అక్కడ లభించిన మూడు ఇనుప పరికరాలు క్రీ.పూ 2953, క్రీ.పూ 3256, క్రీ.పూ 3345 ఏళ్ల నాటివని పేర్కొన్నారు. ఈ ఫలితాల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా తొలుత తమిళనాడులోనే ఇనుప యుగం ప్రారంభమైందని ఎలుగెత్తి చాటుతున్నామని చెప్పారు.

చరిత్ర ఏం చెబుతుందంటే..!

చారిత్రక ఆధారాల ప్రకారం ప్రపంచంలో ఇనుప యుగం క్రీ.పూ.1300లో మొదలైందని కొంతమంది పురావస్తు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భారత్‌లో క్రీ.పూ. 1,500-200 మధ్యలో ఇనుప యుగం కొనసాగింది అనేది చరిత్రకారుల వాదన. అయితే ఇప్పుడు తమిళనాడులో బయటపడిన ఇనుప వస్తువలను పరీక్షించగా అవి క్రీ.పూ. 3345-3259 సంవత్సరాల నాటివని తేలింది. అంటే ఈ ప్రాంతంలో వాడిన ఇనుప వస్తువులు ప్రపంచంలోనే అత్యంత పురాతనమైనవని భావించాలి.



శివకళై తవ్వకాల్లో బయల్పడిన ఇనుప ఈటెలు, బాణపు కొసలు, ఇనుప కత్తులు, ఇనుప వస్తువులు, ఈటెల కొసలు

మార్కెట్ నుంచి 'పతంజలి' కారం వెనక్కి..

» పురుగు పట్టకుండా వాడే మందు పరిమితికి మించడంతో 4 టన్నుల ఉత్పత్తి ఉపసంహరణ

న్యూఢిల్లీ, జనవరి 24: యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు చెందిన పతంజలి ఆయుర్వేద సంస్థకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భారత ఆహార భద్రతా, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆదేశాలతో మార్కెట్ నుంచి 4 టన్నుల కారం పొడిని వెనక్కు తీసుకుంది. ఆహార భద్రతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉండటంతో ఓ బ్యాచ్‌కు చెందిన 200 గ్రాముల కారం పొడి ప్యాకెట్లను వెనక్కి తీసుకోవాలని పతంజలి సంస్థకు ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించింది. దీనిపై పతంజలి సంస్థ సీఈవో సంజీవ్ అస్థానా ప్రకటన విడుదల చేశారు. 'మా ఉత్పత్తి నమూనాలను పరీక్షించినప్పుడు కారానికి పురుగు పట్టకుండా వాడే మందును పరిమితికి మించి వినియోగించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తించింది. దీంతో మార్కెట్ నుంచి 200 గ్రాముల కారం పొడి ప్యాకెట్లను వెనక్కి తీసుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాం. మా సరఫరాదారుల్ని సంప్రదించి సదరు బ్యాచ్‌కు సంబంధించిన కారం పొడి ప్యాకెట్లను వెనక్కి పంపించాలని కోరాం. ఇప్పటికే ఆ ప్యాకెట్లను ఎవరైనా కొనుగోలు చేస్తే.. వాటిని తిరిగిచ్చి డబ్బులు తీసుకోవాలని ప్రకటనలు కూడా ఇచ్చాం. మా ఉత్పత్తుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదు' అని వెల్లడించారు.



జీపీడీ భవనాల నిర్మాణ స్థలం వద్ద పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ప్రపంచ టాప్-5 నగరాల్లో అమరావతి

కోటి 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐకానిక్ భవనాలు

- నెల రోజుల్లో నిర్మాణ పనులు పరుగులు
- మూడేళ్లలో రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తాం
- 250 అడుగుల ఎత్తులో వ్యూ పాయింట్ ఉండేలా అసెంబ్లీ
- గత ప్రభుత్వ కక్షసాధింపుతో అడవిలా మారిన అమరావతి
- చంద్రబాబు, లోకేశ్‌ల సారథ్యంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు
- రాజధానిలో మున్సిపల్ మంత్రి నారాయణ పర్యటన
- జీపీడీ టవర్ల వద్ద నీటి తోడకం పరిశీలన

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచంలో టాప్-5 నగరాల్లో ఒకటిగా అమరావతిని నిర్మిస్తాం. మరో నెల రోజుల్లో రాజధానిలో నిర్మాణ పనులు పరుగులు పెట్టబోతున్నాయి. కోటి 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐకానిక్ భవనాలు నిర్మిస్తున్నాం. 250 అడుగుల ఎత్తులో వ్యూ పాయింట్ ఉండేలా అసెంబ్లీని నిర్మిస్తున్నాం. నవ నగర శౌరభాన్ని వీక్షించే అవకాశాన్ని సామాన్య ప్రజలకు కూడా కల్పించబోతున్నాం. మరో మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తాం' అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టంచేశారు. నేలపాడులో జరుగుతున్న పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమై, వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన అడ్మినిస్ట్రేటివ్(జీపీడీ టవర్‌తో పాటు మరో నాలుగు) టవర్లు, హైకోర్టు రాఫ్ట్ ఫౌండేషన్ల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. నెల రోజులుగా నీటిని తోడుతుండగా, భవనాల పునాదులు ఇటీవల బయటపడిన విషయం తెలిసిందే. నారాయణ మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి అమరావతిని అడవిగా మార్చిందన్నారు. అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలో నిర్మించే అసెంబ్లీ, అడ్మినిస్ట్రేటివ్ టవర్లు, హైకోర్టు భవనాలను ఐకానిక్ బిల్డింగ్‌లుగా నిర్మించాలని నిర్ణయించామన్నారు. జీఏడీ టవర్‌ను 48 అంతస్తులతో 17,03,433 చదరపు అడుగుల విస్తీర్ణంలో, టవర్-1, టవర్-2లను 40 అంతస్తులతో 28.41 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో, టవర్-3, 4లను 40 అంతస్తుల్లో 23 లక్షల 42,956 చదరపు అడుగుల్లో నిర్మించేలా డిజైన్ చేశామని చెప్పారు. హైకోర్టును 8 అంతస్తుల్లో 20.32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో, అసెంబ్లీని 11.22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 250 మీటర్ల ఎత్తులో వ్యూపాయింట్ వచ్చేలా డిజైన్ చేశామని వివరించారు. అసెంబ్లీ లేని రోజుల్లో టూరిజం ప్రాంతంగా ఉండేలా పక్కా ప్రణాళికతో నిర్మాణాలను రూపొందించామని మంత్రి చెప్పారు. వీటితో పాటు మరో కోటి 24 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు సంబంధించిన 4,053 అపార్ట్‌మెంట్ల నిర్మాణం కూడా గతంలోనే ప్రారంభించామని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమపై కక్షతో ఈ నిర్మాణాలన్నీ నిలిపివేసిందని ఆరోపించారు. ఐకానిక్ భవనాల పునాదులు ఏళ్ల తరబడి నీటిలోనే ఉండిపోవడంతో.. ఐఐటీ నిపుణుల నివేదిక ఆధారంగా కొనసాగిస్తున్నామని తెలిపారు.

న్యాయపర సమస్యలతోనే పనులు జాప్యం

గత ప్రభుత్వ అస్తవ్యస్థ పాలనతో రాజధానికి అనేక న్యాయపరమైన సమస్యలు వచ్చాయని మంత్రి అన్నారు. సీఎం చంద్రబాబు అమరావతిలో పర్యటించే నాటికి అంతా అడవిగా ఉందని, వెంటనే జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించారని తెలిపారు. తనకు రెండోసారీ మున్సిపల్ శాఖ బాధ్యతలు అప్పగించి, అమరావతి నిర్మాణంపై కీలక ఆదేశాలు ఇచ్చారన్నారు. న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం కమిటీలు వేసి ముందుకెళ్లామన్నారు. రైతులకు గత ప్రభుత్వం బకాయి పెట్టిన రెండు విడతల కౌలు కూడా జమ చేశామన్నారు. ఇప్పటివరకు అమరావతి నిర్మాణానికి రూ.38,571 కోట్ల విలువైన 40 పనులకు టెండర్లు పిలిచామని చెప్పారు. ఈ నెలాఖరుకి అన్ని పనులకు టెండర్లను పిలిచి ఫిబ్రవరి రెండో వారం నుంచి పనులను వేగవంతం చేస్తామన్నారు.

వైసీపీ అరాచక పాలనతో ప్రజల్లో భయభ్రాంతులు

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎప్పుడు ఎవరిని అరెస్టు చేస్తారో తెలియక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని మంత్రి అన్నారు. కనీసం స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం కూడా ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగుంటేనే పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు. వైసీపీ పాలనతో విసిగిన ప్రజలు ఎన్నికల్లో ఆ పార్టీని 11 సీట్లకు పరిమితం చేసి బుద్ధి చెప్పారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని నారాయణ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం నాశనం కాగా.. సీఎం చంద్రబాబు తన అపార అనుభవంతో మళ్లీ వ్యవస్థలను గాడిలో పెడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ రూ.లక్ష కోట్ల మేరకు పెట్టుబడులకు అంగీకారం కుదిరిందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, లోకేశ్‌ల దావోస్ పర్యటనలో పారిశ్రామికవేత్తలు వేల కోట్ల పెట్టుబడులకు ఆసక్తి చూపారని మంత్రి చెప్పారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

- ప్రతి గ్రామంలో ఆదర్శ పాఠశాల: పాఠశాలల విద్యాశాఖ కమిషనర్



విజయరామరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాల కేంద్రంగా అమలవుతున్న విద్యావిధానాలు క్షేత్ర స్థాయిలో ఆచరణాత్మకంగా సత్ఫలితాలు సాధించాలని పాఠశాలల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు పేర్కొన్నారు. పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు, ప్రధానోపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలు నగరంలోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జీవో నం.117 ఉపసంహరణ, అనంతరం పరిణామాలు, ప్రత్యామ్నాయ పరిస్థితులపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాల అవసరం ఉందన్నారు. పాఠశాలల్లో పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న చోట రెండు గ్రామాలకు కలిపి ఒకే చోట ప్రాథమిక ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో 80 మంది విద్యార్థుల సంఖ్య తగ్గకుండా పాఠశాలను ఏర్పాటు చేసి, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. కర్నూలు జిల్లాలోని కొన్ని మండలాల్లో బోగస్ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంటు సంఖ్య 2వేలకు పైగానే ఉందని, ఈ విషయంలో సంబంధిత అధికారులను, పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై వేటు తప్పదని కమిషనర్ హెచ్చరించారు.

కష్టపడి కాదు ఇష్టపడి చదవండి

- విద్యార్థులకు సర్వేశ్వరశర్మ సూచన



కోనసీమ సైన్స్‌పరిషత్ మహాసభలో మాట్లాడుతున్న డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ

అమలాపురం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై భయాన్ని పూర్తిగా వీడాలని కోనసీమ సైన్స్‌పరిషత్ అధ్యక్షుడు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ విద్యార్థులకు సూచించారు. పరీక్షలకు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ర్యాంకులు వాటంతట అవే వస్తాయన్నారు. పరీక్షల సమయంలో ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం ఎంతో శ్రేయస్కరమని వివరించారు. పదో తరగతి విద్యార్థుల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రవీంద్ర విద్యాసంస్థల ప్రాంగణంలో కోనసీమ సైన్స్ పరిషత్ 2897 మహాసభ విద్యాసంస్థల అధినేత గిడుగు నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన సర్వేశ్వరశర్మ మాట్లాడుతూ పరీక్షల పట్ల విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవరుచుకోవాలన్నారు. మార్కులు పరీక్షాధికారి దయతో ప్రసాదించేవి కాదని కఠోర శ్రమచేసి ఏకాగ్రతతో చదివి సాధించుకునేవని విద్యార్థులకు గుర్తు చేశారు. పబ్లిక్ పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున సబ్జెక్టులలో సందేహాలుంటే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో అకడమిక్ డైరెక్టర్ ఎ.భార్గవి, విశ్రాంత తెలుగు పండితుడు మండలీక ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో రథసప్తమికి పటిష్ఠ ఏర్పాట్లు

- టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమలలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సూర్య జయంతి సందర్భంగా తిరుమలలో ఫిబ్రవరి 4వ తేదీన జరుగనున్న రథసప్తమికి పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సాల్‌తో కలిసి వివిధ విభాగాల అధికారులతో ఈవో సమీక్షించారు. భక్తులు గ్యాలరీల్లో ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. గ్యాలరీల్లో ఉండే భక్తులకు సకాలంలో అన్నప్రసాదాలు, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మాడవీధుల్లో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. తర్వాత ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఆ రోజు ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనంతో వాహనసేవలు మొదలై రాత్రి 9 గంటలకు చంద్రప్రభ వాహనంతో ముగుస్తాయన్నారు. మొత్తం ఏడు వాహనాలపై శ్రీవారు దర్శనమిస్తారని తెలిపారు. పుష్కరిణిలో జరిగే చక్రస్నానం కార్యక్రమానికి కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కాగా.. రథసప్తమి రోజున అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలతో పాటు వీఐపీ బ్రేక్, ఎన్ఆర్ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల ప్రత్యేక దర్శనాలు రద్దు చేశామని ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలో ఫిబ్రవరి 3, 4, 5వ తేదీలకు సంబంధించిన స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్ల జారీని కూడా రద్దు చేశామన్నారు.

పరిటాల రవీంద్ర ఆశయాలను కొనసాగిస్తాం

- ఈ నేల ఉన్నంతవరకు పరిటాల రవి పేరు ఉంటుంది
- ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్



శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలోని పరిటాల రవి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ, కుటుంబ సభ్యులు

ధర్మవరం/రామగిరి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం పరితపించిన నాయకుడు పరిటాల రవీంద్ర అని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని అనంతపురం జిల్లా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయుడు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రామగిరి మండలం వెంకటాపురంలో మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 20వ వర్ధంతిని వేలాది మంది అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. రవి ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు, అభిమానులు నివాళులు అర్పించారు. ప్రతి సంవత్సరం జనవరి వస్తే తమ గుండెల్లో తెలియని వెలితి కనిపిస్తుందని పరిటాల సునీత అన్నారు. ఈ నేల ఉన్నంతవరకు పరిటాల రవిని ఎవరూ మరువరని అన్నారు. ఆయన స్ఫూర్తితో త్వరలో ఉచిత వివాహాలు, మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. రాజకీయంగా, ప్రజా ఉద్యమాలలో పరిటాల రవి చేసిన పోరాటాలు ఎప్పటికీ మరువలేమని పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆయన కలలు, ఆశయాల సాధన కోసం పనిచేస్తామని తెలిపారు. కాగా.. పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద నివాళులు అర్పించిన వారిలో మంత్రి సవిత, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పల్లె సింధూరారెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హనుమంతరాయచౌదరి, ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి ఉన్నారు.

అఖరి శ్వాస వరకూ ప్రజల కోసం పోరాడారు: చంద్రబాబు

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): "అఖరి శ్వాస వరకూ పేద ప్రజల కోసం పోరాడిన ధీరుడు పరిటాల రవీంద్ర" అని ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు ఎక్స్ వేదికగా చంద్రబాబు నివాళి అర్పించారు. "టీడీపీ నాయకుడిగా, మంత్రిగా పరిటాల.. ప్రజలకు చేసిన సేవలు మరువలేనివి. అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి. ఆ ప్రజా నాయకుడికి మరొక్కమారు నా ఘననివాళి" అని ఆయన పేర్కొన్నారు.

కృష్ణయ్య లాంటి వారు ఉన్నంత కాలం బీసీలు బాగుపడరు: కేఏ పాల్

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్.కృష్ణయ్యలాంటి వారు ఉన్నంత కాలం బీసీలు బాగుపడరని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. విశాఖపట్నంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాగుపడే సూచనలు కనిపించడం లేదన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మధ్య అప్పుడే విభేదాలు ప్రారంభమయ్యాయన్నారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ తన వల్లే ఆగిందని ఆయన చెప్పారు. కేంద్రం రూ.11 వేల కోట్లు ఇస్తామని చెబుతోందని, రూ.11 కోట్లు కూడా ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. అదానీ పోర్టుకు ఇచ్చిన స్టీల్‌ప్లాంటు భూములు తిరిగి వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. దావోస్ వెళ్లిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి ఫొటోలకు పోజులు ఇచ్చి వచ్చారన్నారు. షర్మిల, పవన్ కల్యాణ్ ప్యాకేజీ స్టార్లుగా మారిపోయారని విమర్శించారు.

జైళ్ల డీఐజీ జులుం!

అధికారులు, సిబ్బందిపై బెదిరింపుల పర్వం

- ఏం జరిగినా.. ముందు నాకే చెప్పాలి
- మీడియాకు సమాచారం చేరవేస్తే కఠిన చర్యలు
- కోస్తాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ మెమో
- 21న జీవిత ఖైదీతో ఇంట్లో ఏసీకి మరమ్మతు
- బ్యారక్‌లోనే ఉన్నట్లు చూపించిన అధికారులు



సెంట్రల్ జైలు మెయిన్ గేట్ లోపల సంచరిస్తున్న జీవిత ఖైదీ షద్రక్ (ఫొటోలో ఖైదీల యూనిఫాంలో నిక్కరుతో ఉన్న వ్యక్తి)

రాజమహేంద్రవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కోస్తాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ వైఖరి వివాదాస్పదంగా మారింది. ఆయన తీరుతో ఖైదీలతో పాటు అధికారులు, ఉద్యోగులు కూడా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికే అనేక వివాదాల్లో ఇరుకున్న డీఐజీ.. తాజాగా తన పరిధిలోని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్లు, జిల్లా జైళ్ల అధికారులకు శుక్రవారం ఓ మెమో జారీ చేశారు. జైళ్లలో అసాధారణ, అవాంఛనీయ సంఘటనలు ఏం జరిగినా ముందుగా తన దృష్టికి తీసుకురావాలని, లేకపోతే కనికరం లేకుండా చర్యలు తీసుకుంటానని అందులో బెదిరించారు. తనకు తెలియకుండా పేపర్లలోనూ, ఎలక్ట్రానిక్ మీడియాలో పలు ఘటనలు ప్రచారం కావడం వల్ల తాను ప్రభుత్వానికి వివరణ ఇవ్వాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు, ఉద్యోగుల్లో మరింత ఆందోళన మొదలైంది. ఇదిలాఉండగా, రాజమండ్రి సెంట్రల్ జైలు గోదావరి బ్యారక్‌లోని లాకప్‌లో ఉండాల్సిన షద్రక్ అనే ఖైదీతో ఈ నెల 21న డీఐజీ తన ఇంట్లో ఏసీ మరమ్మతు చేయించుకున్నారు. అయితే అదే సమయంలో సదరు ఖైదీ బ్యారక్‌లోనే ఉన్నట్టు అధికారులు చూపించడం గమనార్హం. ఆ రోజు రాత్రి 8.30 గంటలకు సెంట్రల్ జైలు మెయిన్ గేటు నుంచి షద్రక్ బయటకు వెళుతున్నట్టు సీసీ కెమెరా ఫుటేజ్‌లో రికార్డయింది. దీనికి సంబంధించిన వీడియో బయటకు రావడంతో డీఐజీ తాజా ఆదేశాలు జారీ చేశారని తెలుస్తోంది. కొద్ది నెలల కిందట సుభానీ అనే ఖైదీతో తన ఇంట్లో పని చేయించుకోవడంతో పాటు, అతడిని చితకబాదిన విషయం బయటకు వచ్చింది. అప్పట్లో జైలు అధికారులు, డాక్టర్లతో పాటు దెబ్బలు తిన్న ఖైదీని కూడా భయపెట్టి తప్పుడు రిపోర్టు వచ్చేలా చేసుకున్నారు. విశాఖ సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు కూడా ఆయన వైఖరి వివాదాస్పదమైంది.



దీప్తి జివాంజీకి చెక్కు అందజేస్తున్న ఎస్ఆర్ఎం ప్రతినిధులు

ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సహకారం మరువలేను

- అర్జున అవార్డు గ్రహీత దీప్తి జివాంజీ
- వర్సిటీ తరపున రూ.40 లక్షలు అందజేత

మంగళగిరి సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబంలో పుట్టి ఆర్థిక ఇబ్బందులతో ఇక్కట్లు పడుతున్న తనకు, అంతర్జాతీయ స్థాయిలో విద్య అందిస్తున్న ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ సహకారం ఎన్నటికీ మరువలేనని ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, అర్జున అవార్డు గ్రహీత దీప్తి జివాంజీ అన్నారు. గత సంవత్సరమే తాను ఏపీ రాజధాని అమరావతి పరిధిలోని నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో అడ్మిషన్ పొందానని, అప్పటి నుంచి వర్సిటీ తనకు తోడ్పాటునందిస్తోందని చెప్పారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యం శుక్రవారం దీప్తి జివాంజీని సత్కరించి రూ.40లక్షల నగదు పారితోషకాన్ని అందించింది. అర్జున అవార్డు సాధించినందుకు రూ.15 లక్షలు, పారాలింపిక్స్‌లో దేశానికి కాంస్య పతకం సాధించినందుకు రూ.25 లక్షల చెక్కులను వేర్వేరుగా అందజేశారు. ఈ సందర్భంగా దీప్తి వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణన్, వీసీ మనోజ్‌కుమార్ అరోరా, డైరెక్టర్ అనూప్‌సింగ్ సూర్యవంశీతోపాటు తనను గైడ్ చేసిన శ్రీపతి, సుస్మిత ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా మాట్లాడుతూ తమ యూనివర్సిటీ విద్యార్థిని ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించి, అర్జున అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. స్పోర్ట్స్ డైరెక్టర్ అనూప్ సింగ్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి స్పోర్ట్స్ కోటాలో అడ్మిషన్లు పొందిన 13 మంది విద్యార్థులకు ఈ ఏడాది రూ.70 లక్షల నగదు అవార్డులను అందిస్తున్నామని తెలిపారు.

'వంద'కు ముహూర్తం ఖరారు

- 29న శ్రీహరికోటలో వందో రాకెట్ ప్రయోగం
- జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌లో నింగిలోకి ఎన్‌వీఎస్-02

సూళ్లూరుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శ్రీహరికోటలో వందో ప్రయోగానికి ముహూర్తం ఖరారు చేసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ నెల 29వ తేదీ ఉదయం 6:23 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ప్రయోగం చేపట్టనుంది. ఈ రాకెట్ ద్వారా దేశ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (నావిక్)లో భాగమైన ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనుంది. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక వద్దనున్న వ్యాబ్‌లో మూడు దశల అనుసంధాన ప్రక్రియను పూర్తిచేసిన శాస్త్రవేత్తలు రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలించారు. శిఖర భాగాన ఉన్న ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని ఉష్ణకవచంలో అమర్చే ప్రక్రియను కూడా పూర్తిచేసి ప్రయోగానికి సిద్ధం చేశారు. శ్రీహరికోటలో ఇస్రోకిది వందో రాకెట్ ప్రయోగం కావడంతో షార్‌లో వివిధ కార్యక్రమాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నావిక్ అనేది స్వదేశీ ప్రాంతీయ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. ఇది భారత విమానయాన, నౌకాయాన మార్గాలకు, సైనిక అవసరాలకు ఉపయోగపడుతుంది. భారత భూభాగం వెలుపల కూడా 1500 కి.మీ. వరకూ కచ్చితమైన సమాచారాన్ని వేగంగా అందిస్తుంది.

'ఆ వార్త నన్ను మనస్తాపానికి గురిచేసింది'

- జంగారెడ్డిగూడెం జడ్పీ స్కూల్లో పుట్టిన రోజు వేడుకలపై మంత్రి లోకేశ్ సీరియస్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులతో తన పుట్టిన రోజు వేడుకలు నిర్వహించినట్లుగా వచ్చిన వార్త తనను మనస్తాపానికి గురిచేసిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇందుకు బాధ్యులైనవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నానని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని పాఠశాలలు, విశ్వవిద్యాలయాలను రాజకీయాలకు అతీతంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని లోకేశ్ అన్నారు.

సాంకేతికతతో నేరాల నియంత్రణ: డీజీపీ

- చీరాలలో కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభం

చీరాలటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. శుక్రవారం బాపట్ల జిల్లా చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రమంతా మార్చి నాటికి సుమారు లక్ష కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇటీవల విజయవాడలో 1,100 కెమెరాలు ఏర్పాటు చేయడం వలన ఓ చిన్నారి కిడ్నాప్ కేసును వేగవంతంగా ఛేదించినట్టు డీజీపీ వివరించారు. అలాగే డ్రోన్స్ సహాయంతో బాపట్ల జిల్లా సూర్యలంక సముద్రతీరంలో గల్లంతవుతున్న ముగ్గురు వ్యక్తులను సురక్షితంగా కాపాడామని చెప్పారు. ఈ క్రమంలోనే చీరాల పట్టణం, సముద్ర తీరాన్ని అనుసంధానం చేస్తూ పెద్దమొత్తంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఏఐఎంటీసీ సౌత్‌జోన్ ఉపాధ్యక్షుడిగా ఈశ్వరరావు బాధ్యతల స్వీకరణ

విజయవాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఏఐఎంటీసీ) సౌత్‌జోన్ ఉపాధ్యక్షుడిగా రాష్ట్రానికి చెందిన వైవీ ఈశ్వరరావు శుక్రవారం ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈశ్వరరావు గత రెండు దశాబ్దాలుగా ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి.. తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ ఆయన ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నారు. జాతీయ స్థాయిలో ఈశ్వరరావు సేవలు అవసరమని భావించిన అగ్రనాయకత్వం ఆయన్ను ఏఐఎంటీసీలోకి ఏకగ్రీవంగా ఎంపిక చేసింది.

వారాణసి-తమిళనాడు మధ్య పది ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు ఫిబ్రవరి 13 నుంచి 24 వరకు తమిళనాడు-వారాణసి మధ్య పది ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరి 13న చెన్నై సెంట్రల్-బనారస్(06193), 19న బనారస్-చెన్నై సెంట్రల్(06194), 13న కన్యాకుమారి-బనారస్(06195), 20న బనారస్-కన్యాకుమారి(06196), 16న కోయంబత్తూర్-బనారస్(06187), 22న బనారస్-కోయంబత్తూర్(06188), 17న కన్యాకుమారి-బనారస్(06163), 23న బనారస్-కన్యాకుమారి(06164), 19న చెన్నై సెంట్రల్-బనారస్(06153), 24న బనారస్-చెన్నై సెంట్రల్ (06154) ప్రత్యేక రైళ్లు నడుస్తాయని పేర్కొంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తటస్థ తీర్పరి

జమ్మూకశ్మీర్‌లో నిర్మిస్తున్న కిషన్‌గంగ, రాట్లే జలవిద్యుత్ కేంద్రాలకు సంబంధించి భారత్ పాకిస్థాన్ మధ్య విభేదాలను పరిష్కరించే అధికారం తనకు ఉన్నదని ప్రపంచబ్యాంకు నియమించిన తటస్థనిపుణుడు ఇటీవల చేసిన నిర్ధారణ భారతదేశానికి పెద్ద ఉపశమనం. తటస్థ నిపుణుడు మైఖేల్ లీనో తీసుకున్న ఈ నిర్ణయం అనాదిగా భారత్ వాదనను సమర్థించిందని మనదేశం ప్రకటించింది. సింధునదీ జలాల ఒప్పందం ప్రకారం ఉభయదేశాల మధ్యా రేగిన ఈ విభేదాలను పరిష్కరించే అధికారం, సామర్థ్యం తటస్థ నిపుణుడికి మాత్రమే ఉన్నదని భారతదేశం వాదిస్తున్న విషయం తెలిసిందే. అయితే, 1960లో ఉభయదేశాలూ చేసుకున్న ఈ నదీజలాల ఒప్పందాన్ని మారిన పరిస్థితుల నేపథ్యంలో సమీక్షించి, సవరించుకోవాలంటూ భారతదేశం రెండేళ్ళుగా పాకిస్థాన్‌ను పోరుతున్న అంశానికీ, ఈ సరికొత్త పరిణామానికీ సంబంధం లేదు. దీనికితోడు, తీర్పరి ఎవరంటూ ఎంతోకాలంగా రెండుదేశాల మధ్యా సాగుతున్న వివాదాన్ని ఈ నిర్ణయం కొత్తమలుపు తిప్పిన మాట నిజం.

సింధునదికి ఉపనదులైన జీలం, చినాబ్‌మీద భారతదేశం జలవిద్యుత్ కేంద్రాలను నిర్మిస్తూండటం పాకిస్థాన్ వ్యతిరేకిస్తోంది. ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంలో, రెండుదేశాలమధ్యా ఆరుదశాబ్దాల క్రితం కుదిరిన ఈ ఒప్పందానికి లోబడి ఈ ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని, నీటి స్వేచ్ఛా ప్రవాహాన్ని ఈ నిర్మాణాలు ఏమీ అడ్డుకోవడం లేదని భారతదేశం అంటోంది. అయినా, ఈ రెండు ప్రాజెక్టులమీద పాకిస్థాన్ అభ్యంతరం లేవనెత్తి ఆర్బిట్రేషన్ కోర్టును ఏర్పాటుచేయవలసిందిగా ప్రపంచ బ్యాంకును డిమాండ్ చేసింది. వివాద పరిష్కారానికి తటస్థ నిపుణుడి నియామకాన్ని ఒప్పందం నిర్దేశిస్తున్నదని భారతదేశం గుర్తుచేసింది. తగువు ఎవరు తీర్చాలన్న అంశంమీద ఈ రెండుదేశాల తగువుతో తలపట్టుకున్న ప్రపంచబ్యాంకు ఉభయులవాదనలకూ లొంగింది. భారత్ కోరినమేరకు మైఖేల్ లీనోను తటస్థనిపుణుడిగా, పాక్ కోరినప్రకారం షాన్ మర్ఫీ అధ్యక్షతన మధ్యవర్తిత్వకోర్టునూ 2022లో నియమించింది. ఇలా రెండు వివాద పరిష్కార వ్యవస్థలు ఉండటం సమస్యను మరింత జటిలం చేస్తుందని, ఒకే సమస్యకు రెండు పరిష్కారాలు ముందుకు వస్తే ఆచరణలో సమస్యలు తలెత్తుతాయని భారత్ స్పష్టంచేస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో, తానే తీర్పరినంటూ తటస్థనిపుణుడు చేసిన ప్రకటనను భారత్ స్వాగతించడం సహజం.

రెండుదేశాలూ కూడా మొదట తటస్థనిపుణుడి విషయంలో ఏకాభిప్రాయంతోనే ఉన్నప్పటికీ, 2016లో పాకిస్థాన్ మనసు మార్చుకొని ఆర్బిట్రేషన్ కోర్టును డిమాండ్ చేయడం, ఆ ప్రతిపాదనను ఆదిలో తిరస్కరించిన ప్రపంచబ్యాంకు ఆఖరుకు లొంగిరావడం భారత్‌కు ఆగ్రహం కలిగించింది. హేగ్‌లో ఈ కోర్టులో జరిగేవాదోపవాదాలకు హాజరుకాకుండా తన నిరసనను తెలియచేస్తూ వచ్చింది. వివాదాన్ని పరిష్కరించే అధికారం తటస్థ నిపుణుడికి ఉన్నదని ఈ కొత్త పరిణామం తేల్చినప్పటికీ, ఆర్బిట్రేషన్ కోర్టుకు ఏ అధికారాలూ ఉండబోవని కాదు. సాంకేతికాంశాలను నిగ్గుతేల్చి న్యాయం చెప్పే అధికారం నిపుణుడికి ఉన్నప్పటికీ, కోర్టు పరిధిలోకి వచ్చే మిగతా కొన్ని అంశాలు అలాగే ఉంటాయన్నది సదరు ప్రకటన సారాంశం. కిషన్‌గంగ, రాట్లే జలవిద్యుత్ ప్రాజెక్టుల సాంకేతిక, నిర్మాణ అంశాలమీద రాబోయే రోజుల్లో ఈ తటస్థనిపుణుడి సమక్షంలో ఉభయదేశాలూ తమ వాదనలను వినిపించవచ్చు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి పాకిస్థాన్ లేవనెత్తిన ఏడు అభ్యంతరాలూ ఈ నిపుణుడి పరిధిలోకి రాబోతూండటం, ఆర్బిట్రేషన్‌కోర్టు ఈ అంశాల జోలికి రాకపోవడం భారతదేశానికి మేలుచేస్తుందని విశ్లేషకుల అభిప్రాయం. తటస్థ నిపుణుడి నిర్ణయానికి ఉభయపక్షాలూ కట్టుబడటం గతంలో జరిగినప్పటికీ, మూడు దశల పరిష్కార వ్యవస్థలో పైస్థాయిలో కోర్టు కూడా ఉన్నందున పాకిస్థాన్ కొత్త మెలికలు పెట్టవచ్చునన్న అనుమానాలూ ఉన్నాయి. నెహ్రూ–అయూబ్‌ఖాన్ సంతకాలు చేసిన ఈ సింధునదీజలాల ఒప్పందం తొమ్మిదేళ్ళ సుదీర్ఘచర్చల అనంతరం ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంలో అత్యంత పటిష్ఠంగా రూపుదిద్దుకుంది. అనంతరకాలంలో అనేక దేశాలమధ్య ఈ తరహా ఒప్పందాలకు ఇది ఆదర్శంగా నిలిచింది. భారత్–పాకిస్థాన్ మధ్య కించిత్తు సయోధ్య లేకున్నా ఆరుదశాబ్దాలుగా నిలిచిన ఈ ఒప్పందాన్ని వివాదాల్లోకి లాగకుండా జాగ్రత్తపడటం ఇరువురికీ మంచిది.

వెలుగు బాటలో వైరుధ్యాల భారతం!

నిజానికి, ఈ కొత్త రాజ్యాంగచట్టం కింద ఏదైనా పొరపాటు జరగడమే కనుక సంభవిస్తే, అందుకు కారణం అది దుష్టమైన రాజ్యాంగమవటం వల్ల మాత్రం కాదు. మనం చెప్పగలిగేదేమంటే, మనిషి దుష్టుడని.

— బి. ఆర్. అంబేద్కర్
4 నవంబర్ 1948న రాజ్యాంగ సభలో



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఈ నెల 26న మనం భారత రాజ్యాంగ 75వ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నాం. ప్రస్తుతం అధికారంలో ఉన్న రాజకీయవేత్తలకు, అట్టహాసంగా వేడుకలు నిర్వహించేందుకు అదొక సందర్భమవుతుంది. తమ పాలన గురించి ఘనంగా చెప్పుకునేందుకు వారు ఆ శుభ దినాన్ని ఒక అవకాశంగా ఉపయోగించుకుంటారు. రాజ్యాంగాన్ని ఆమోదించే ముందు నాటి న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ చేసిన హెచ్చరికలను గుర్తుచేస్తూ దేశ పాలకుల ఉల్లాసోత్సాహాల మనస్థితిని నిగ్రహించదలుచుకున్నాను.

రాజ్యాంగ స్వరూప స్వభావాలు, నియమ నిబంధనల గురించి మూడు సంవత్సరాల పాటు జరిగిన చర్చలలో అంబేడ్కర్ పలుమార్లు జోక్యం చేసుకుంటూ ఆ చర్చలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేశారు. 4 నవంబర్ 1948న

> '1950 జనవరి 26న మనం మన వైరుధ్యాల జీవనంలోకి ప్రవేశించనున్నాం. రాజకీయంగా మనకు సమానత్వం ఉంటుంది కానీ, సామాజిక ఆర్థిక జీవనంలో అసమానతలు ఉంటాయి. ఒక మనిషికి ఒక వోటు, ఒక వోటుకు ఒక విలువ అన్న సూత్రాన్ని మనం రాజకీయాల్లో గుర్తిస్తాం. మన సామాజిక ఆర్థిక నిర్మాణం కారణంగా ఒక మనిషికి ఒక విలువ ఇచ్చే సూత్రాన్ని పాటించడం జరగదు. మన సామాజిక, ఆర్థిక జీవనంలో ఎంతకాలం సమానత్వ తిరస్కరణ కొనసాగుతుంది?' డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ 75 సంవత్సరాల క్రితమే వర్తమాన భారతదేశానికి సంధించిన ప్రశ్న అది!

రాజ్యాంగ ముసాయిదాను సమర్పిస్తూ ఒక అసాధారణ ప్రసంగం చేశారు. ఒక ఏడాది అనంతరం రాజ్యాంగం తుది ప్రతిని సభకు నివేదిస్తూ మరో చరిత్రాత్మక ప్రసంగం వెలువరించారు. రెండో సందర్భంలో వెలువరించిన ప్రసంగంలోని పలు భాగాలు సుప్రసిద్ధమైనవే అయినా మళ్లీ మళ్లీ గుర్తు చేసుకోవలసిన ప్రాధాన్యమున్నవి. అవి భారతీయుల వీరారాధన ప్రవృత్తికి సంబంధించినవి. "ప్రజాస్వామ్యాన్ని రూపంలోనే కాక, వాస్తవంగా కూడా పరిరక్షించుకోవాలంటే మనం చెయ్యవల్సిందేమిటి? జాన్ స్టువర్ట్ మిల్ చేసిన హెచ్చరికను ఎప్పుడూ మనసులో ఉంచుకోవడం. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఆసక్తి ఉన్న వారందరూ కూడా 'ఓ గొప్ప మనిషి' కాళ్ల ముందు మన స్వేచ్ఛను సమర్పించటం గానీ, అతడికి అధికారాలను అప్పగించటం గానీ జరిగితే, వారి వ్యవస్థలన్నింటినీ విధ్వంసం చేయగల అవకాశం అతడికి లభిస్తుంది కనుక, అలాంటి పని చేయకూడదు" అని మిల్ హెచ్చరించారు. అంబేడ్కర్ ఇంకా ఇలా అన్నారు: 'మిల్ హెచ్చరిక మన దేశంలో మరింతగా అవసరం. ఎందుకంటే ఇక్కడ భక్తి, లేక నాయకుడి పట్ల అతి గౌరవం చెప్పలేని పరిమాణంలో రాజకీయాల్లో పాత్ర వహిస్తుంది; ప్రపంచంలోని మరే దేశంలోనూ ఈ నాయకత్వ పూజ ఇంతగా రాజకీయాల్లో జోక్యం చేసుకోదు. మత పరంగా భక్తి పరుడైతే అది మోక్ష మార్గమువవచ్చు, ఆత్మకు విముక్తి కలగవచ్చు. అయితే రాజకీయంలో భక్తి లేక నాయక పూజ పతనానికీ, అంతిమంగా నియంతృత్వానికీ దారితీసే నిశ్చయమైన మార్గం'.

1970ల్లో ఇందిరాగాంధీ వ్యక్తి పూజ, ఇప్పుడు నరేంద్ర మోదీ వీరారాధనను గమనిస్తే అంబేడ్కర్ వ్యాఖ్యలు ఎంతో ముందు తెలివిడితో చేసినవిగా లేవూ? ఇందిర, మోదీ వ్యక్తి పూజలు వేర్వేరు తీరుల్లో భారత ప్రజాస్వామ్యాన్ని దిగజార్చివేశాయి. ఈ గుడ్డి ఆరాధనా ప్రవృత్తి రాజకీయేతర రంగాలలోని ప్రముఖులు– క్రికెటర్లు, సినిమా తారలు, వ్యాపార సమ్రాట్‌లు– తదితరుల పట్ల కూడా విపరీతంగా వ్యక్తమవడం అంబేడ్కర్‌ను విస్మయపరిచి ఉండేది కాదు. అయితే ఈ నాటి తన సొంత అనుయాయులు సైతం తనపట్ల అమిత భక్తి ప్రపత్తులు చూపడం బహుశా అంబేడ్కర్‌ను ఇబ్బందికి లోను చేసి ఉండేది.

రాజ్యాంగ సభలో తన చివరి ప్రసంగంలో అంబేడ్కర్ హెచ్చరిక కూడా వర్తమానానికి ఎంతో ప్రాసంగికత ఉన్నదే అనటంలో సందేహం లేదు. 'మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ఒక సామాజిక ప్రజాస్వామ్యంగా రూపొందించుకోవాలని' ఆయన నొక్కి చెప్పారు. ఆయన ఇలా అన్నారు: '1950 జనవరి 26న మనం మన వైరుధ్యాల జీవనంలోకి ప్రవేశించబోతున్నాం. రాజకీయంగా మనకు సమానత్వం ఉంటుంది కానీ, సామాజిక ఆర్థిక జీవనంలో అసమానత్వం ఉంటుంది. ఒక మనిషికి ఒక వోటు, ఒక వోటుకు ఒక విలువ అన్న సూత్రాన్ని మనం రాజకీయాల్లో గుర్తిస్తాం. సామాజిక, ఆర్థిక జీవితంలో మన సామాజిక ఆర్థిక నిర్మాణం కారణంగా ఒక మనిషికి ఒక విలువ ఇచ్చే సూత్రాన్ని పాటించడం జరగదు. ఎంత కాలం మనం ఈ వైరుధ్యాల జీవితాన్ని గడపాలి? మన సామాజిక, ఆర్థిక జీవనంలో ఎంతకాలం సమానత్వ తిరస్కరణ కొనసాగుతుంది?'


కుల పరమైన అసమానతలు భారతీయ సమాజాన్ని ఎంతగా వికృతం చేశాయో వ్యక్తిగత అనుభవం, విద్వత్ పరిశోధన ద్వారా అంబేడ్కర్‌కు పరిపూర్ణ అవగాహన ఉంది. జెండర్ అసమానతలపై కూడా తన సమకాలీన పురుష రాజకీయవేత్తల కంటే ఆయనే ఎంతో జాగరూకత చూపేవారు. దళితులు, మహిళలతో సహా వయోజనులు అందరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా ఒక వ్యక్తి ఒక వోటు అనే సూత్రాన్ని రాజ్యాంగం స్థిరపరిచింది. అయితే ఆ సంవిధానం అమలులోకి వచ్చిన 75 సంవత్సరాల తరువాత కూడా ఒక మనిషి ఒక విలువ అనే సూత్రం ఆమోదం పొందనే లేదు.

రాజకీయాలలో సమానత్వం, సామాజిక ఆర్థిక జీవనంలో అసమానతలు అనే మన జాతి జీవన వాస్తవాన్ని నిరసించడంలో దళితుల, మహిళల హక్కులే ప్రధానంగా ఆయన దృష్టిలో ఉన్నాయి. మన సమాజంలో ఉన్న మరో రెండు దుర్బల వర్గాల వారి పట్ల అంబేడ్కర్ స్వల్ప శ్రద్ధ మాత్రమే చూపారు. ఆ సామాజిక వర్గాలు ఆదివాసీలు, మత మైనారిటీలు. 75 సంవత్సరాల 'రాజ్యాంగ బద్ధ' ప్రజాస్వామ్యంలో మధ్య భారతంలోని గిరిజన సముదాయాలు పొందిన లబ్ధి స్వల్పాతి స్వల్పమని, కోల్పోయింది అపారమని వర్జినియస్ క్సాక్సా, నందినీ సుందర్, ఫెలిక్స్ పాడెల్ మొదలైన మానవ శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు.

మత మైనారిటీల విషయానికి వస్తే ముస్లింలు తాము దగా పడ్డామని భావిస్తున్నారు. స్వాతంత్ర్య ఆగమన సమయంలో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదని వారు వాపోతున్నారు. పాకిస్థాన్ ఆవిర్భవించిన తరువాత కోట్లాది ముస్లింలు భారత్‌లోనే ఉండిపోయారు. ఇతర మతస్థులతో పాటు ముస్లింలకు కూడా సంపూర్ణ పౌరసత్వ హక్కులు ఉంటాయనే విషయమై ఆ నాటి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీ నెరవేరకపోవడం పట్ల వారు అమితంగా బాధపడుతున్నారు. దశాబ్దాలుగా, మరీ ముఖ్యంగా 2014 నుంచి ముస్లింలకు పౌరసత్వ హక్కులను క్రమంగా నిరాకరిస్తున్నారు. ఆ మతస్థులను పలు విధాల వేధింపులకు గురిచేస్తున్నారు. వారి దేశభక్తిని శంకిస్తున్నారు. వివిధ కళంకాలను వారికి ఆపాదిస్తున్నారు. సామాజిక అసమానతలు, వీరారాధన ప్రవృత్తి విషయమై అంబేడ్కర్ రాజ్యాంగ సభలో చేసిన హెచ్చరికలు ప్రస్తుతం మన దేశం, భారతీయులు ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సూటిగా చేసినవిగా లేవూ?!

అంతకు ఒక సంవత్సరం ముందు రాజ్యాంగ సభలోనే ఆయన ఎంతో దూర దృష్టితోనే చేసిన హెచ్చరికలను కూడా మనం తప్పక గుర్తు చేసుకోవాలి. ముఖ్యంగా 'రాజ్యాంగ నైతికత'ను మనం పెంపొందించుకోవల్సిన అవసరముందని ఆయన నొక్కి చెప్పడాన్ని మనం తప్పక జ్ఞాపకం చేసుకోవాలి. రాజ్యాంగ నైతికత గురించి 19వ శతాబ్ది గ్రీస్ చరిత్రకారుడు జార్జి గ్రోట్ చెప్పిన దాన్ని అంబేడ్కర్ తన ప్రసంగంలో ఉటంకించారు. గ్రోట్ ఇలా చెప్పారు: 'రాజ్యాంగ రూపాల పట్ల అత్యున్నత గౌరవం చూపాలి. రాజ్యాంగ వ్యవస్థల లోపల పనిచేస్తూ అధికారం పట్ల విధేయత చూపిస్తూ, స్వేచ్ఛగా మాట్లాడాలి. పార్టీల మధ్య విభేదాలు ఎంతగా ఉన్నప్పటికీ అన్ని రాజ్యాంగ రూపాల పట్ల తన ప్రత్యర్థులకు ఉండే గౌరవం తనకు ఉన్న గౌరవం కంటే ఏ మాత్రం తక్కువ కాదన్న సంపూర్ణ విశ్వాసం ప్రతి పౌరుని హృదయంలోనూ నెలకొని ఉండాలి'.

ఇటీవలి దశాబ్దాలలో మన రాజకీయాలలో ప్రబలిన పాక్షిక ధోరణులు, జాతీయ రాజకీయ పక్షాల మధ్య పరస్పర అపనమ్మకం చూస్తుంటే ఆ సమున్నత ప్రజాస్వామిక ఆదర్శానికి మన దేశం ఎంత దూరంలో ఉన్నదో స్పష్టమవుతుంది. ఈ పరిణామానికి అంబేడ్కర్ పూర్తిగా విస్తుబోయేవారు కాదేమో? నవంబర్ 4, 1948న రాజ్యాంగ సభలో వెలువరించిన ప్రసంగంలో ఆయన ఇలా అన్నారు: 'రాజ్యాంగ నైతికత సహజ భావన కాదు; దాన్ని అలవాటు చేసుకోవాలి. దాన్ని మన ప్రజలు ఇంకా నేర్చుకోలేదని మనం తెలుసుకోవాలి. సారభూతంగా అప్రజాస్వామికమైన భారతదేశపు జన



జీవనంలో ప్రజాస్వామ్యమన్నది పై మెరుగు దిద్దడమే అవుతుంది'. ఆయన ఇంకా ఇలా అన్నారు: 'రాజ్యాంగపు రూపాన్ని మార్చకుండా, పాలనా వ్యవస్థ రూపాన్ని మాత్రమే మారుస్తూ, దాన్ని రాజ్యాంగ స్ఫూర్తికి పొసగని, వ్యతిరేక రూపంగా చేసి రాజ్యాంగాన్ని పథ భ్రష్టం చేయటానికి ఎంతో అవకాశమున్నది'. ఈ హెచ్చరిక కూడా విషాదకరంగా వాస్తవమవలేదూ? 'నిబద్ధ ఉద్యోగస్వామ్యం', 'నిబద్ధ న్యాయవ్యవస్థ'ను ప్రోత్సహించడం ద్వారా ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ అందుకొక ఉదాహరణ నెలకొల్పింది. ఈ ప్రమాదకర భావాలను 2014 తరువాత మోదీ ప్రభుత్వం మరింత ముందుకు తీసుకువెళ్లింది.

రాజ్యాంగ సభలో అంబేడ్కర్ ప్రసంగంలోని చివరి వ్యాఖ్యలతో ఈ కాలమ్‌ను ముగించదలుచుకున్నాను: 'స్వాతంత్ర్యం మనపై బాధ్యతలు మోపిందని మాత్రం మనం మరువకూడదు. స్వతంత్రం రావటం వల్ల, ఏ తప్పు జరిగినా బ్రిటిష్ వారిని నెపమెన్నే అవకాశం మనకు లేదు. ఇంక, ఈ తర్వాత తప్పులు దొర్లితే మరెవరినీ నిందించలేం, మనల్ని మనం తప్ప'. 75 సంవత్సరాల తరువాత మన సమస్యలకు ఇతరులను తప్పు పట్టే ధోరణి మనలో, అంబేడ్కర్ కాలంలో కంటే, మరింతగా ప్రబలిపోయింది. ప్రస్తుత పాలకుల హయాంలో మన వైఫల్యాలకు ఇతరులను బాధ్యులను చేసే ధోరణి మరింత విపరీత పోకడలు పోతోంది. తమది స్వదేశీ, ఆత్మ నిర్భర్ ప్రభుత్వమని చెప్పుకునే పాలకులు తమ వైఫల్యాలు, అసమర్థతకు శతాబ్దాల నాటి మొగల్ చక్రవర్తులు, 1947లో మన దేశం నుంచి నిష్క్రమించిన బ్రిటిష్‌వారు; 1964లో కీర్తిశేషుడు అయిన జవహర్‌లాల్ నెహ్రూను బాధ్యులను చేస్తున్నారు!

(వ్యాసకర్త చరిత్రకారుడు)

గత 75 సంవత్సరాలుగా రాజ్యాంగం మన దేశానికి సమర్థమైన, ప్రభావశీలమైన మార్గదర్శకత్వాన్ని అందించింది. యావద్భారతీయులూ ముఖ్యంగా మన సమాజంలోని సామాజిక దుర్బల వర్గాలు, మత మైనారిటీలు తమ హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంరక్షించే శక్తిగా రాజ్యాంగాన్ని విశ్వసిస్తున్నారు. గత ఏడు దశాబ్దాలుగా ఆసేతు హిమాచలం ఒకే జాతి–ఒకే ప్రజ అన్న స్ఫూర్తిని పెంపొందించడంలో మన రాజ్యాంగం విజయవంతమయింది.

ప్రజాస్వామ్య హృదయం భారత రాజ్యాంగం

భారత రాజ్యాంగ ప్రస్థానానికి ఈ జనవరి 26న 75 ఏళ్లు పూర్తవుతాయి. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఏడాది పొడుగునా 'హమారా సంవిధాన్–హమారా స్వాభిమాన్' అనే ఉద్ఘోషతో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నది. నవంబర్ 26, 2024న పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన రాజ్యాంగ అమృతోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో 'మన దేశ పవిత్ర గ్రంథం'గా రాజ్యాంగాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభివర్ణించారు. భారత రాజ్యాంగ నిర్మాణ చరిత్ర ప్రతి భారతీయునికీ గర్వకారణమైనది. మనకొక సొంత రాజ్యాంగాన్ని రూపొందించుకునే ప్రయత్నాలు రాజ్యాంగ సభ ఏర్పాటుకు కనీసం 25 సంవత్సరాల ముందే ప్రారంభమయ్యాయి. ప్రప్రథమ భారత ప్రభుత్వ చట్టం–1858 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం (1857) పర్యవసానంగా వచ్చింది. ఆ చట్ట రూపకల్పనలో భారతీయులు ఎవరికీ భాగస్వామ్యం లేదు. ఆరు దశాబ్దాల అనంతరం కొత్త భారత ప్రభుత్వ చట్టం–1919 అమలులోకి వచ్చింది. అప్పటికే భారత జాతీయ కాంగ్రెస్ ఛత్రం కింద జాతీయవాదులు ఏకమై స్వాతంత్ర్య సాధనకు పోరాడుతున్నారు. ఈ కొత్త చట్టాన్ని కాంగ్రెస్ నిరసించింది. బ్రిటిష్ ప్రభుత్వం కాకుండా భారతీయ చట్ట సభే భారతదేశ సొంత రాజ్యాంగాన్ని రచించాలని జాతీయవాదులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ విభాగం అయిన స్వరాజ్ పార్టీ ఈ అంశాన్ని కేంద్ర లెజిస్లేటివ్ అసెంబ్లీలో లేవనెత్తింది. రాజ్యాంగ సంస్కరణల గురించి చర్చించేందుకు ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించాలని స్వరాజ్ పార్టీ డిమాండ్ చేసింది. అయితే వలసపాలకులు ఈ డిమాండ్‌ను ఉపేక్షించారు. భారత ప్రజలు అందరూ ఏకీభవించే, ఆమోదించే ఒక రాజ్యాంగాన్ని రూపొందించాలని భారత జాతీయోద్యమ నాయకులను లార్డ్ బిర్కెన్ హెడ్ సవాల్ చేశారు. దేశానికి అవసరమైన రాజ్యాంగబద్ధమైన చర్యలను సూచించేందుకు పూర్తిగా బ్రిటిష్ నాయకులు, అధికారులతో ఒక కమిషన్‌ను కూడా ఆయన నియమించారు. ఇదే సైమన్ కమిషన్‌గా సుప్రసిద్ధమైనది. లార్డ్ బిర్కెన్ హెడ్ సవాల్‌ను కాంగ్రెస్ అంగీకరించింది. రాజ్యాంగ ముసాయిదాను రూపొందించేందుకు డిసెంబర్ 1927లో మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన ఒక కమిటీనేర్పాటు చేసింది. సుభాస్ బోస్, అనీబీసెంట్, ఎమ్ఆర్ జయకర్, జవహర్‌లాల్ నెహ్రూతో పాటు ముస్లింలీగ్ ప్రతినిధులు ఇరువురు ఆ కమిటీలో సభ్యులు. 1928లో ఆ కమిటీ ఒక ముసాయిదా రాజ్యాంగాన్ని దేశ ప్రజలకు నివేదించింది. ఇదే 'నెహ్రూ నివేదిక'గా సుప్రసిద్ధమైనది. ప్రాథమిక హక్కులు, ద్విసభీయ పార్లమెంటు, అధికారాల విభజన, న్యాయ వ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తి, కేంద్ర–రాష్ట్ర సంబంధాలు మొదలైన అంశాలపై 22 అధ్యాయాలు, 188 అధికరణలు నెహ్రూ రిపోర్ట్‌లో ఉన్నాయి. 21 సంవత్సరాల వయసు నిండిన ప్రతి భారతీయ పౌరుడికీ ఓటు హక్కు కల్పించాలని ఆ నివేదిక సూచించింది. బిర్కెన్‌హెడ్ సవాల్‌కు నెహ్రూ నివేదిక ఒక దీటైన సమాధానమని వ్యాఖ్యానిస్తూ 'మనం మన స్వాతంత్ర్య మాగ్నాకార్టాను రచించుకున్నామని' ఒక ప్రముఖ దినపత్రిక వ్యాఖ్యానించింది. జనవరి 26, 1930ని 'స్వాతంత్ర్య దినం'గా పాటించాలని డిసెంబర్ 1929లో లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభ పిలుపునిచ్చింది. ఆ చరిత్రాత్మక సందర్భాన్ని శాశ్వతంగా గుర్తుంచుకునేందుకే స్వతంత్ర భారత రాజ్యాంగాన్ని జనవరి 26, 1950 నుంచి అమలుచేయాలని రాజ్యాంగ సభ నిర్ణయించింది.

భారతీయులకు 'ఆమోదయోగ్యమైన రాజ్యాంగం' రూపొందించేందుకు రాజ్యాంగ సభని ఏర్పాటు చేయాలని మే 1924లో స్వరాజ్ పార్టీ తీర్మానం చేసింది. భారతీయులు రాజ్యాంగ సభ గురించి వినడం అదే మొదటిసారి. ఆ తరువాత కాలంలో కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య పోరాటాన్ని ముమ్మరం చేసింది. భారత స్వాతంత్ర్య చట్టం–1947ను తీసుకురావడం ద్వారా భారతదేశ చట్టాల నిర్మాణంలో తమకు ఇంకెంత మాత్రం ఎలాంటి పాత్ర ఉండబోదని బ్రిటిష్ ప్రభుత్వం ఎట్టకేలకు అంగీకరించింది. రాజ్యాంగ నిర్మాణ బాధ్యతలను పూర్తిగా భారతీయులకే అప్పగించింది.

రాజ్యాంగ సభ తొలి సమావేశం డిసెంబర్ 9, 1946న జరిగింది. ముసాయిదా రాజ్యాంగాన్ని ఫిబ్రవరి 21, 1948న సభకు సమర్పించారు. మార్పులు చేర్పులతో కూడిన కొత్త ముసాయిదాను నవంబర్ 4, 1948న రాజ్యాంగ సభకు సమర్పించారు. కొత్త ముసాయిదాలోని ప్రతి అధికరణను, ప్రతి అధికరణలోని ప్రతి నిబంధనను సభ్యులు కూలంకషంగా చర్చించారు. ఆ చర్చల ఫలితంగా రూపొందిన తుది ముసాయిదాను నవంబర్ 26, 1949న ఆమోదించారు. ముసాయిదాపై చర్చల్లో రాజ్యాంగ సభ సభ్యుల ప్రసంగాలు, వాదోపవాదాలు మొత్తం 3.6 మిలియన్ పదాలుగా రికార్డయ్యాయి. 3,675 సవరణలను ప్రతిపాదించారు. వాటిలో 2,473 సవరణలను విపులంగా చర్చించారు. ఈ మహోన్నత కృషి ఫలితంగా రూపొందిన భారత రాజ్యాంగంలో 395 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి. రాజ్యాంగ ముసాయిదా రచనా భారాన్ని చాలావరకు డాక్టర్ అంబేడ్కరే స్వయంగా వహించారు. 'ముసాయిదా కమిటీ సభ్యులు ఎంత అంకితభావంతో కృషి చేశారో నేను గ్రహించాను. ముఖ్యంగా ఆ కమిటీ చైర్మన్ డాక్టర్ అంబేడ్కర్, తన ఆరోగ్యపరిస్థితి బాగా లేనప్పటికీ రాజ్యాంగ నిర్మాణానికి పూర్తిగా అంకితమయ్యారు' అని రాజ్యాంగసభ చైర్మన్ రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యానించారు.

డిసెంబర్ 1946లో రాజ్యాంగ లక్ష్యాల తీర్మానాన్ని రాజ్యాంగ సభలో ప్రతిపాదిస్తూ అది కేవలం ఒక తీర్మానం మాత్రమే కాదని, అది ఒక 'ప్రకటన', ఒక 'దృఢసంకల్పం', ఒక 'ప్రతిజ్ఞ', అంతిమంగా అది ఒక 'అంకితం' అని జవహర్‌లాల్ నెహ్రూ భావోద్వేగంతో ఉద్ఘాటించారు. రాజ్యాంగ సభలోని 299 మంది సభ్యులు 35 నెలల పాటు ఆ మహా సంకల్పంతో కృషి చేసి మన మహోన్నత సంవిధానాన్ని రూపొందించారు.

75 సంవత్సరాల భారత రాజ్యాంగ ప్రస్థానంలో జాతి జీవనాన్ని మౌలికంగా ప్రభావితం చేసిన హిందూ కోడ్ బిల్లు, మౌలిక విధులు, పంచాయతీరాజ్ వ్యవస్థ వికేంద్రీకరణ, కేంద్రీకృత ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాలకు స్వస్తి, అధికరణ 370 రద్దు మొదలైన రాజ్యాంగ సంస్కరణలు ఆ మహోన్నత గ్రంథం స్ఫూర్తితో అమలులోకి వచ్చాయి. భారత రాజ్యాంగాన్ని 'వలసవాద రాజ్యాంగం'గా కొంత మంది విమర్శిస్తున్నారు. అయితే, 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ రూపొందించిన నెహ్రూ నివేదికలోని అనేక అంశాలు స్వతంత్ర భారత రాజ్యాంగంలో ఉన్నాయి. గత 75 సంవత్సరాలుగా రాజ్యాంగం మన దేశానికి సమర్థమైన, ప్రభావశీలమైన మార్గదర్శకత్వాన్ని అందించింది. యావద్భారతీయులూ ముఖ్యంగా మన సమాజంలోని సామాజిక దుర్బల వర్గాలు, మత మైనారిటీలు తమ హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంరక్షించే శక్తిగా రాజ్యాంగాన్ని విశ్వసిస్తున్నారు. గత ఏడు దశాబ్దాలుగా ఆసేతు హిమాచలం ఒకే జాతి–ఒకే ప్రజ అన్న స్ఫూర్తిని పెంపొందించడంలో మన రాజ్యాంగం విజయవంతమయింది. అంతిమంగా రాజ్యాంగం ఒక సంకల్ప పత్రం మాత్రమే. ఆ మౌలిక శాసనాన్ని అమలు పరుస్తున్నవారి రాజ్యాంగ నైతికత – ఆ సంవిధాన స్ఫూర్తి– చాలా ప్రధానమైనది. 'రాజ్యాంగ నైతికత అనేది సహజ భావన కాదు. దాన్ని అలవాటు చేసుకోవాలి' డాక్టర్ అంబేడ్కర్ హెచ్చరించారు. గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోనున్న శుభసందర్భంలో రాజ్యాంగ నైతికతను పెంపొందించుకునేందుకు జాతి తనకు తాను అంకితమవ్వాలి.



● రామ్ మాధవ్
బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి


దావోస్‌లో ఏపీ బ్రాండ్ ధగ ధగ!

ప్రపంచ దేశాలకు చెందిన వ్యాపార దిగ్గజాలు, వివిధ దేశాల అధినేతలు పాల్గొనే దావోస్ ఆర్థిక సదస్సు పెట్టుబడులు ఆకర్షించేందుకు అద్భుతమైన అవకాశమున్న చోటు. ఇది ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచానికి ప్రమోట్ చేసే అద్భుతమైన వేదిక కూడా. మేధావులు, సామాజిక కార్యకర్తలు, ఆర్థిక నిపుణులు, పాత్రికేయులు పాల్గొనే అతి కీలకమైన సమావేశం అది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం రాష్ట్రంలో పెట్టుబడులు సాధనే లక్ష్యంగా దావోస్‌లో వివిధ వ్యాపార దిగ్గజాలతో వరుస భేటీలయ్యారు ముఖ్యమంత్రి చంద్రబాబు. రాష్ట్రానికి వీలైనన్ని పరిశ్రమలు తీసుకురావడమే లక్ష్యంగా, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచానికి ప్రమోట్ చేసి రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరించారు. భారీ పెట్టుబడులను ఆకర్షించి పారిశ్రామికీకరణను కొత్త పుంతలు తొక్కించేందుకు, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక, వ్యాపార దిగ్గజాలను ఒప్పించి రాష్ట్రానికి రప్పించడానికి భగీరథ ప్రయత్నం చేశారు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేష్.

రాష్ట్రం పెట్టుబడులకు అత్యంత అనుకూల ప్రదేశమని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు ప్రతిష్ఠాత్మకమైన ప్రపంచ ఆర్థిక ఫోరాన్ని చంద్రబాబు వేదికగా చేసుకున్నారు. ఏపీ అపారమైన అవకాశాల గని అని, వ్యవసాయ ఉత్పత్తులు, 1,053 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం, విశాలమైన రోడ్లు, విమాన సదుపాయాలు, పోర్టులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని, దేశంలో మరెక్కడా లేని విధంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని తెలియజేశారు. రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలకు 15 రోజుల్లో అన్ని అనుమతులు మంజూరు చేసేందుకు ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేస్తామని పెట్టుబడిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం ఇటీవల తీసుకొచ్చిన పది పాలసీలను దావోస్ వేదికగా ఆయన తెలియజేసారు. 74 ఏళ్ల వయస్సులో దావోస్‌లో గడ్డ కట్టే చలిలోనూ పర్యటించి దేశాధినేతలతోను, బిల్‌గేట్స్ నుంచి టాటా గ్రూపు చంద్రశేఖరన్, తదితర వ్యాపార దిగ్గజాలతో సమావేశమవుతూ ఐటీ నుంచి ఏఐ వరకు, విస్తృతంగా పెట్టుబడుల వేట సాగించారు చంద్రబాబు.

మాజీ సీఎం జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో దావోస్ సదస్సులో ఆంధ్రప్రదేశ్ అడ్రస్ గల్లంతు అయి రాష్ట్రం నుంచి దావోస్‌లో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడం మాట దేవుడెరుగు. ఉన్న కంపెనీలను

> రాష్ట్రం అపారమైన అవకాశాలకు గని అని, సుదూర తీరప్రాంతం, విశాలమైన రోడ్లు, విమాన సదుపాయాలు, పోర్టులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని దావోస్ సదస్సులో చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో ఇటీవల తీసుకొచ్చిన పది పాలసీలను ఆయన తెలియజేసారు.




వెళ్లగొట్టడమే పనిగా జగన్ ప్రభుత్వం అనుసరించిన నిరంకుశ విధానాలు, కొత్త పెట్టుబడులకు ఉన్న అవకాశాలను దూరం చేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి దావోస్ సదస్సులో మళ్లీ ఏపీ బ్రాండ్ ధగ ధగ లాడింది. రాష్ట్రానికి పెట్టుబడులను, కంపెనీలను ఆకర్షించే లక్ష్యంతో దావోస్ పెవిలియన్లలో వరస సమావేశాలతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ విరామం లేకుండా గడిపారు. గ్రీన్, క్లీన్ ఎనర్జీకి ఏపీ గమ్యస్థానంగా మారిన తీరును దిగ్గజ కంపెనీలకు చెప్పి, సానుకూల స్పందనను రాబట్టారు. హైడ్రోజన్ హబ్, డేటా సెంటర్లు, గూగుల్ క్లౌడ్ విస్తరణ, వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిశ్రమ హోదా, ఇలా రాష్ట్రాభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తున్న విధానాన్ని దావోస్ వేదికపై ప్రపంచ ప్రతినిధులకు పరిచయం చేశారు. స్విస్‌మెన్, ఓర్లికాన్, ఆంగ్స్ ఫిస్టర్, స్విస్ టెక్స్‌టైల్స్ యాజమాన్యాలతో చంద్రబాబు బృందం వరుస సమావేశాలు నిర్వహించింది. రాష్ట్రంలో రీసైక్లి సెంటర్ ఏర్పాటుకు స్విస్‌మెన్ సంస్థ ముందుకొచ్చింది. ఇన్నోవేషన్ హబ్‌లు, ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అడ్వాన్స్‌డ్ కోటింగ్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు ఓర్లికాన్ మొగ్గుచూపింది. ఏఐ సెంటర్ల ఏర్పాటుపైనా ఆసక్తిని చూపింది.

అడ్వాన్స్‌డ్ సీలింగ్ సొల్యూషన్ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలని ఆంగ్స్ ఫిస్టర్ సంస్థను చంద్రబాబు కోరగా, ఆ సంస్థ సానుకూలత వ్యక్తం చేసింది. రీసైక్లి టెక్స్‌టైల్ యూనిట్ ఏర్పాటుకు స్విస్ టెక్స్‌టైల్స్ కంపెనీ ముందుకొచ్చింది. ప్రపంచంలోనే అదిపెద్ద సముద్రయాన రంగ సంస్థ మార్స్క్.. ఏపీలోని సముద్రతీరం పట్ల ఆసక్తి చూపి త్వరలోనే పర్యటనకు వస్తామని హామీ ఇచ్చింది. విశాఖ, తిరుపతిలో కార్యకలాపాలను ప్రారంభించాలన్న చంద్రబాబు ఆహ్వానానికి సిస్కో సానుకూలంగా స్పందించింది. తిరుపతి, విశాఖలో సెమికండక్టర్ యూనిట్లను స్థాపించే విషయమై త్వరలో నిర్ణయం తెలుపుతామని దక్షిణ కొరియాకు చెందిన ఎల్జీ కెమ్ సంస్థ సీఈవో పిన్‌హక్ చియోట్ తెలిపారు. కార్ల్స్‌బెర్గ్ గ్రూప్ రాష్ట్రంలో పండ్ల రసాలు, శీతల పానీయాలు, బీర్లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు సానుకూలత ప్రదర్శించింది. విశాఖ, అమరావతిలో గూగుల్ డిజైన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరగా, గూగుల్ క్లౌడ్ సీఈవో కురియన్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రాన్ని పెట్రోలియం హబ్‌గా మార్చే దిశలో భాగస్వాములమవుతామని పెట్రోనాస్ సంస్థ తెలిపింది. రాష్ట్రంలో పెప్సికో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చైర్మన్ స్టీవెన్ కెహో సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆరోగ్య, విద్యారంగాల్లో కొత్త ఆవిష్కరణలకు ఏపీని కేంద్రంగా మార్చే అంశాన్ని మిలిండా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌ను కలిసి చంద్రబాబు చర్చించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్ డయాగ్నోస్టిక్స్‌ను నెలకొల్పేందుకూ, ఏఐ వర్సిటీ ఏర్పాటు చేసేందుకు బిల్‌గేట్స్ సమ్మతి తెలిపారు.

యువతకు బంగారు బాటలు వెయ్యాలని దావోస్‌లో పెట్టుబడుల కోసం వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస భేటీలయ్యారు ఐటీ మంత్రి లోకేష్. యువతకు ఉపాధి అవకాశాల్ని మెరుగుపరచాలనే లక్ష్యంతో నాలుగు రోజులు విరామం లేకుండా దావోస్‌లో పర్యటించి పలువురు పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులు, సీఈఓలతో వరుసగా సమావేశమయ్యారు. కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్‌తో మంత్రి లోకేష్ సమావేశం అయి ఏపీని ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన రంగంలో డీప్ టెక్ హబ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించాం అనే విషయాన్ని స్పష్టం చేశారు. విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాల్లో 22 లక్షల చదరపు అడుగుల కోవర్కింగ్ స్థలం అందుబాటులో ఉంది. కాగ్నిజెంట్ వృద్ధి వ్యూహాలు, ప్రాంతీయ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా విశాఖపట్నం లాంటి ద్వితీయశ్రేణి నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభించమని లోకేష్ కోరగా, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు రవికుమార్. సంస్థలో పనిచేస్తున్న 80వేల మంది ఉద్యోగులను టైర్–1, టైర్–2 నగరాలకు మార్చేందుకు ప్రణాళికలు ప్రకటించాం. గ్లోబల్ స్కిల్ ఇనీషియేటివ్‌లో భాగంగా జెనరేటివ్ ఏఐ అధునాతన సాంకేతిక నైపుణ్యాల్లో 10 లక్షల మందికి సాధికారత కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అట్లాగే విద్యారంగంలో ప్రపంచస్థాయి శిక్షణకు సహకరించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరం న్యూఎకానమీ, సొసైటీ విభాగం ఎంగేజ్‌మెంట్, ఆపరేషన్స్ విభాగాధిపతి రవి గుత్తాను మంత్రి లోకేశ్ కోరారు. ఏపీలో విద్యారంగంలో గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించేందుకు సహకరించాలని, పరిశ్రమల పరంగా అధునాతన శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేయమని కోరారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఛాంపియన్‌గా నిలపాలని లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు కాలంతో పోటీ పడుతున్నారు.

■ నీరుకొండ ప్రసాద్



గుడిమెట్ల ప్రాంతానికి పూర్వవైభవం

అఖండ-2 సినిమా షూటింగ్ కోసం పరిశీలన

- దర్శకుడు బోయపాటి రాకతో వార్తల్లోకి..
- శతాబ్దాల చరిత్ర కలిగిన పర్యాటక ప్రాంతం
- కృష్ణానది ఒంపుసొంపులు ప్రత్యేక ఆకర్షణ
- నిత్యం నిండుకుండలా కృష్ణమ్మ ప్రవాహం

కథనం 6లో



ఆ ప్రాంతం.. చరిత్ర తెలిపే ఏడు కోటలకు ఎత్తయిన నిదర్శనం.. ఏడు పేటల ప్రజల ఆరాధ్య నిలయం.. ఇక్కడి శివకేశవ ఆలయాలు ఆధ్యాత్మికతకు ఆలవాలం.. కృష్ణమ్మ ఒంపుసొంపులకు, కనువిందు చేసే ప్రకృతి రమణీయతకు ఇది అందాల కేంద్రం.. శతాబ్దాల చరిత్ర కలిగి, అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయిన చందర్లపాడు మండలంలోని గుడిమెట్ల క్షేత్రానికి పూర్వవైభవం రానుందా? నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా అఖండ-2 చిత్ర నిర్మాణ నేపథ్యంలో దర్శకుడు బోయపాటి శ్రీనివాసరావు దృష్టి గుడిమెట్ల ప్రాంతంపై పడటంతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటకంగా పేరు తేవాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోంది.

ఎలా? క్రిటికల్

విద్యుత్ బస్సుల కోసం విద్యాధరపురం బస్టాండా..?

భారీ వర్షం కురిస్తే చెరువే.. వరదొస్తే ముంపే..

- ఎలక్ట్రికల్ బస్టాండ్ ఏర్పాటుపై విమర్శలు
- ప్రస్తుత సీఎన్జీ ప్లాంట్‌కే తరచూ అవాంతరాలు



భారీ వర్షాలు కురిస్తే విద్యాధరపురం డిపోలో పరిస్థితి ఇదీ..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎలక్ట్రికల్ బస్సుల కోసం విద్యాధరపురం బస్‌డిపోను ఎంపిక చేయటంలో ఆర్టీసీ ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి గట్టిగా వర్షం కురిస్తే ముంపునకు గురయ్యే విద్యాధరపురం డిపోను ఎలా ఎంపిక చేస్తారనే ప్రశ్నలు వస్తున్నాయి. విజయవాడ సిటీ సబర్బన్ పరిధిలో త్వరలో 100 ఎలక్ట్రికల్ బస్సులు తిరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఫేమ్-2 పథకంలో భాగంగా అద్దెప్రాతిపదికన ఈ బస్సులను తీసుకుంటున్నారని సమాచారం. దీనికోసం నెల కిందటే ఆర్టీసీ అధికారులు విద్యాధరపురం డిపోను ఎలక్ట్రికల్ బస్టాండ్‌గా మార్చాలని మిగతా 6లో..

అదృశ్యం వెనుక..

సాంకేతి కథలు

నగరంలో మైనర్ల మిస్సింగ్ కేసులు

● మిస్సింగ్ మిస్టోరీలు

● పాఠశాల పూర్తయ్యాక కూడా ఓ బాలిక ఇంటికి రాలేదు. ఎంత వెతికినా తల్లిదండ్రులకు ఆచూకీ తెలియలేదు. తోటి విద్యార్థులను విచారిస్తే స్నేహితులతో కలిసి బయటకు వెళ్లినట్టు తేలింది. నగరంలో కొద్దిరోజుల క్రితం జరిగిన ఘటన ఇది.

● మదర్సాలో చదువుకున్న బాలిక కొద్దికాలంగా ఇంటి వద్ద ఉంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ యువకుడికి చెందిన మరో ఇద్దరు స్నేహితులు, ఆ బాలికకు చెందిన మరో ఇద్దరు స్నేహితురాళ్లకు పరిచయం ఏర్పడింది. ఆ యువకుల మాటలు నమ్మిన ఈ ముగ్గురు అమ్మాయిలు నగరం దాటేశారు. తాజాగా జరిగిన ఘటన ఇది.

.. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటున్న అమ్మాయిలు ఇలా విపరీత పోకడలకు వెళ్తున్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను అడియాసలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల మోజులో పడి ఉజ్వల భవిష్యత్తును రోడ్డున పడేసుకుంటున్నారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఉత్తర మండలంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఈ మండలంలో సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్లు ఉండగా, నెలకు 50కు పైగా మిస్సింగ్ కేసులు నమోదవుతుండటం గమనార్హం.

- సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడిగా చాటింగ్‌లు
- రీల్స్ పిచ్చిలో అమ్మాయిల వింత పోకడలు
- వల వేసి లాగుతున్న పక్క రాష్ట్ర యువకులు
- ఇంట్లో వారికి తెలియకుండా బయటి ప్రాంతాలకు..
- అజిత్‌సింగ్‌నగర్, నున్న పీఎస్‌ల్లోనే ఎక్కువ
- నెలకు 50కి పైగా ఈ తరహా మిస్సింగ్ కేసులే..
- తాజాగా ముగ్గురు మైనర్లు అదృశ్యం
- బెంగళూరు వెళ్తుండగా తెనాలిలో పట్టుకున్న పోలీసులు

విజయవాడ, ఆంధ్రజ్యోతి/అజిత్‌సింగ్‌నగర్ : 'పాఠశాలకు వెళ్లిన మా అమ్మాయి ఇంకా ఇంటికి తిరిగిరాలేదు.', 'స్నేహితురాళ్లతో బయటకు వెళ్లిన అమ్మాయి కనిపించడం లేదు.' అజిత్‌సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్లకు ఎక్కువగా అందుతున్న ఫిర్యాదులివి. ఈ తరహా ఘటనలకు సంబంధించి ఈ రెండు పోలీస్‌స్టేషన్లకు నెలకు 50కి పైగా ఫిర్యాదులు వస్తున్నాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అజిత్‌సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రజల జీవన స్వరూపం భిన్నంగా ఉంటుంది. ఈ రెండు పీఎస్‌ల పరిధిలో విలాసవంతమైన కాలనీలు పెద్దగా ఉండవు. మిగిలిన కాలనీలన్నీ కూలీలు,



మధ్యతరగతి వర్గాలకు చెందినవే. ప్రతి కుటుంబం నుంచి తల్లిదండ్రులు నిత్యం ఉదయం ఇంటి నుంచి ఏదో ఒక పనికి బయల్దేరి వెళ్తారు. కొంతమంది పిల్లలను ఇళ్ల వద్దే వదులుతారు. ఇంకొంతమంది పిల్లలను పాఠశాలలకు పంపుతుంటారు. ఈ పిల్లలకు స్మార్ట్‌ఫోన్లను ఇచ్చి తల్లిదండ్రులు ఉపాధికి వెళ్తుంటారు. ఆండ్రాయిడ్ ఫోన్లు అరచేతిలో ఉండటంతో వారు సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, స్నాప్‌చాట్, షేర్‌చాట్ వంటి యాప్‌ల్లో వీడియోలను పోస్టు చేస్తున్నారు. ప్రతి పనినీ రీల్స్ చేసి ఇన్‌స్టా, స్నాప్‌చాట్‌ల్లో పోస్టు చేస్తున్నారు. అందులో ఉన్న లైక్‌లను చూసి మురిసిపోతున్నారు. నెటిజన్లు చేసిన కామెంట్లతో మరిన్ని రీల్స్ చేస్తున్నారు. రీల్స్ మాయలో అవతలి వ్యక్తులు పంపిన రిక్వెస్టులను అంగీకరిస్తున్నారు. వారిని ఫాలో అవుతున్నారు. రిక్వెస్టులు పంపిన వ్యక్తులు ఎవరో తెలియకపోయినా ఫాలో అవుతున్నారు. ఆ తర్వాత చాటింగ్‌లు చేసుకుంటున్నారు.

ఎక్కడి నుంచో నియంత్రణ

న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన బాలికలు అజిత్‌సింగ్‌నగర్‌లోని మదర్సాలో చదివి ఇంటి వద్దే ఉంటున్నారు. మూడు నెలల క్రితం బెంగళూరుకు మిగతా 6లో..

మోటెల్ రగడ

ఏపీటీడీసీ వర్సెస్ చాంపియన్స్

- కృష్ణవేణి మోటెల్ లీజును రద్దు చేయాలని కొందరు అధికారుల వాదన
- లీజు పొందాక గోడలు కూల్చటం, చెట్ల నరికివేతపై ఆగ్రహం
- అభివృద్ధి కోసమే అలా చేశామంటున్న చాంపియన్స్ నిర్వాహకులు
- ఏపీటీడీసీ ఛైర్మన్ సమావేశంలో హాట్‌హాట్‌గా చర్చ
- లీజు నిబంధనలను అతిక్రమించటంపై విమర్శలు



కృష్ణవేణి మోటెల్‌లో నిర్వాహకులు చేపట్టిన పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో కృష్ణవేణి మోటెల్ రగడ పెద్దదవుతోంది. ప్రకాశం బ్యారేజీ దగ్గర ఉన్న కృష్ణవేణి మోటెల్‌ను 'చాంపియన్స్ యాచ్ క్లబ్' అనే సంస్థకు ఏడు నెలల కిందట లీజుకిచ్చారు. వైసీపీ హయాంలో పనిచేసిన అధికారులు చాంపియన్స్ సంస్థకు కారుచౌకగా దీనిని కట్టబెట్టారని ఏపీటీడీసీలోని కొంతమంది అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వానికి పూర్తిగా తెలియకుండా హడావిడిగా ఈ పని చేశారని వాదిస్తున్నారు. ఇటీవల ఏపీటీడీసీ బోర్డు ఛైర్మన్ నూకసాని బాలాజీ నిర్వహించిన సమావేశంలో కృష్ణవేణి మోటెల్ అంశం హాట్ టాపిక్‌గా మారింది. చాంపియన్ యాచ్ క్లబ్‌కు ఇచ్చిన లీజు రద్దు చేయాలని ఓ వర్గం వాదించగా, మరోవర్గం సమర్థించింది. దీంతో ఛైర్మన్ నూకసాని ఈ ఫైల్‌ను పరిశీలించారు. అక్కడి నిర్మాణాలను కూల్చటంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఏపీటీడీసీ భవనం గోడలను, ఇతర నిర్మాణాలను కూల్చటం, చుట్టూ గోడల ఎత్తు పెంచటం, కృష్ణానది ఒడ్డున ఆహ్లాదకరంగా ఉండే వాతావరణాన్ని దెబ్బతీసేలా చెట్లను నరకటం వంటివి క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్వాహకులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లీజు ఒప్పందాలకు భిన్నంగా వ్యవహరించారని మండిపడ్డారు. దీనిపై కొందరు ఉద్యోగులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. చాంపియన్స్ సంస్థ లీజు రద్దు చేయాలని కోరారు. నెలకు కేవలం రూ.లక్షన్నరకే లీజుకివ్వడం ద్వారా వచ్చే లాభమేమీ ఉండదని ఛైర్మన్‌కు విన్నవించారు. ఏపీటీడీసీ నిర్వహించినా అంతకుమించి ఆదాయం వస్తుందని చెప్పారు. కాగా, ఈ మోటెల్‌ను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా, నిర్మాణాల మార్పు చేర్పుల దృశ్యాలు కనిపించాయి. చాంపియన్స్ యాచ్ క్లబ్ నిర్వాహకుల వాదన మరోలా ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేయటానికే విస్తరణ పనులు చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు. చిన్నపాటి నిర్మాణాలను కూల్చడం వల్ల విశాలమైన ఓపెన్ కన్వెన్షన్ ఏరియా వస్తుందంటున్నారు. ఇంజనీరింగ్ అధికారుల సూచన మేరకు గోడల ఎత్తు పెంచుతున్నామని చెబుతున్నారు. తుప్పుపట్టిన నిర్మాణాలను తొలగించి కొత్తగా అభివృద్ధి చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు.

నగరం గజగజ



కనిపించని నగరం



సీడ్ యాక్సెస్ రోడ్డులో..

పొగమంచు నగరాన్ని కమ్మేసింది. బారెడు పొద్దెక్కినా, ఉదయం 10 గంటలవుతున్నా మంచు దుప్పటి తొలగట్లేదు. రెండు, మూడు రోజులుగా పరిస్థితి మరింత భయంకరంగా మారింది. పాఠశాలలు, కళాశాలలు, ఆఫీసులకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరకు వచ్చే వరకు ఎదుటి వాహనాలు కనిపించకపోవటంతో అవస్థలు పడుతున్నారు. ఇక తెల్లవారుజామున మంచు వర్షంలా కురుస్తోంది. ఓవైపు వాహనదారులు దారి కనిపించక అవస్థలు పడుతుంటే, మరోవైపు ప్రకృతి ప్రేమికులు కొత్త అందాలను ఆశ్వాదిస్తున్నారు.

గణతంత్ర వేడుకలకు సర్వంసిద్ధం

ఇందిరాగాంధీ స్టేడియంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు, ప్రభుత్వ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా పరిశీలన 6లో



ప్రజారోగ్య సంరక్షణ ప్రభుత్వ లక్ష్యం

మంత్రి సత్య కుమార్‌యాదవ్ 6లో

సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం

విమానాశ్రయంలో స్వాగతం పలికిన అధికారులు, నాయకులు 6లో



జంప్ డిపాజిట్.. ఖాతాలు ఖాళీ

సైబర్ నేరాల్లో తాజా ట్రెండ్

- జంప్ డిపాజిట్ పేరుతో టోకరా
- తొలుత గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా డబ్బు జమ
- పొరపాటున వచ్చిందంటూ ఖాతాదారులకు ఫోన్లు
- లింక్ ద్వారా వెనక్కి పంపాలంటూ విజ్ఞప్తులు
- ఆ క్రమంలో ఖాతాల వివరాల సేకరణ.. దోపిడీ

సైబర్ నేరగాళ్లు సరికొత్త దారులు వెతుకుతున్నారు. నిన్నటివరకు 'డిజిటల్ అరెస్టు'తో అటు పోలీసులను, ఇటు ప్రజలను హడలెత్తించిన నేరగాళ్లు.. తాజాగా 'జంప్ డిపాజిట్' పేరుతో ఖాతాలు ఖాళీ చేసేస్తున్నారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ కేసులు నమోదు కాకపోయినా.. హైదరాబాద్‌లో ఈ తరహా నేరాలు జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రజల్లో వస్తున్న చైతన్యం, పోలీసుల అప్రమత్తతతో డిజిటల్ అరెస్టులకు బ్రేక్ పడి సైబర్ నేరగాళ్లకు ఆదాయం పడిపోయింది. దీంతో జంప్ డిపాజిట్ పేరుతో మరో మార్గాన్ని ఎంచుకున్నారు. ఈ తరహా కేసులు ఇప్పటికే హైదరాబాద్‌లో నమోదయ్యాయి. మన నగరంలో ఇప్పటి నుంచే మేల్కొనకపోతే భవిష్యత్తులో దారుణాలు వెలుగుచూసే అవకాశముంది.

జంప్ డిపాజిట్ అంటే..

ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం అనేక విషయాలను చాలా సులభతరం చేసింది. ఇందులో ప్రధానమైనది డిజిటల్ పేమెంట్స్. ఒకప్పుడు ఏదైనా వస్తువు కొనాలంటే డబ్బు ఇచ్చుకునేవారు. ఇప్పుడు ఈ పరిస్థితి ఉన్నప్పటికీ డిజిటల్ చెల్లింపులే ఎక్కువగా జరుగుతున్నాయి. ఎంత చిన్న మొత్తం అయినా.. చెల్లింపులన్నీ డిజిటల్‌గానే మిగతా 6లో..

సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం

గన్నవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటనను ముగించుకుని గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న సీఎం చంద్రబాబునాయుడుకు ఘనస్వాగతం లభించింది. శుక్రవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఇక్కడికి ఆయన విచ్చేశారు. మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్‌యాదవ్, కందుల దుర్గేష్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు తదితరులు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీఎం హెలికాప్టర్‌లో ఉండవల్లి వెళ్లారు.



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ కేశినేని చిన్ని

ఉండవల్లి నివాసంలో స్వాగతం పలికిన ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్: హెలికాప్టర్‌లో ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

మర్యాదపూర్వకంగా..

వన్‌టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ పాలకమండలి సభ్యుడు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను శుక్రవారం గురునానక్‌నగర్‌లోని కార్యాలయంలో ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మాధవానందకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. వారిద్దరూ ఎయిమ్స్ అభివృద్ధి పై మాట్లాడుకున్నారు. డిప్యూటీ డైరెక్టర్(పరిపాలన)కల్నల్ తుమ్మ శశికాంత్‌పాల్గొన్నారు.



ఎంపీ కేశినేని చిన్నిని కలిసిన ఎయిమ్స్ డైరెక్టర్ మాధవానందకర్

ఎంపీ కేశినేని చిన్నికి మామిడి రైతుల కృతజ్ఞతలు

50 శాతం సబ్సిడీపై పండ్ల కవర్లు లభించేలా కృషి చేసినందుకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)కి శుక్రవారం రెడ్డిగూడెం మండలం రెడ్డిగుంట మామిడి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డిగూడెం రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు చేబ్రోలు శ్రీనివాసరావు, రాజు ఆధ్వర్యంలో రైతులు విజయవాడలోని కార్యాలయంలో ఎంపీని కలిశారు. పండ్ల కవర్లలో మామిడి కాయలను పెట్టి చూపించారు. ఎంఐడీహెచ్ స్కీం కింద 800 హెక్టార్లకు ఒక్కో హెక్టార్‌కు పదివేలు చొప్పున 50 శాతం సబ్సిడీపై కవర్లు అందుతున్నాయని తెలిపారు. నాణ్యతగల మామిడికాయలను పండిస్తున్నందుకు మామిడి ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ చే బ్రోలు శ్రీనివాసరావును సత్కరించి, సంఘానికి అండగా ఉంటానని ఎంపీ తెలిపారు. కృపారాజు, సాంబశివరావు, రాజు, నాగప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణ ప్రభుత్వ లక్ష్యం

▸ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రభుత్వాసుపత్రి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రధాన లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను చేపట్టినట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసి న ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ) మొబైల్ వాహనాలను శుక్రవారం సిద్ధార్థ మెడికల్ కళాశాల ఆవరణలో మంత్రి ప్రారంభించారు. హెచ్‌ఐవీని సమూలంగా రూపుమాపేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి పూర్తి వైద్యసహాయం అందించేందుకే ఒక్కొక్కటి రూ.3.60 కోట్లతో 10 ఐసీటీసీ మొబైల్ వ్యాన్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. దేశంలో సుమారు 25 లక్షల హెచ్‌ఐవీ కేసులుంటే ఏపీలో 2.22 లక్షల మంది వ్యాధి బారిన పడ్డారన్నారు. రాష్ట్రంలో 42 వేలమంది వ్యాధిగ్రస్తులు పింఛన్ పొందుతున్నారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఏసీఎస్‌పీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.సిరి, కలెక్టర్ లక్ష్మీశ, డాక్టర్లు సరస్వతి, కామేశ్వరప్రసాద్, మంజుల, భాగ్యలక్ష్మి, శిరీష, డీఎంహెచ్‌వో సుహాసిని, ఎయిడ్స్ కంట్రోల్ జిల్లా అధికారి డాక్టర్ జె.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



ఐసీటీసీ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

దక్షిణానికి పావన్..

నిఘాకు కిరణ్

▸ కమిషనరేట్‌కు కొత్త ఏసీపీలు

విజయవాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు ఇద్దరు నూతన ఏసీపీలు వచ్చారు. శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయంలో డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.కిరణ్‌కుమార్‌ను విజయవాడ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా బదిలీ చేశారు. గ్రూపు-1 ద్వారా డీఎస్పీగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న డి.పావన్‌కుమార్‌కు దక్షిణ మండలం ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. ఈ అధికారులు ఇద్దరూ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ ఎస్వీ రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.



కిరణ్‌కుమార్



పావన్‌కుమార్

గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

వన్‌టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుకు ఉద్యోగుల సంఘ నాయకులు విన్నవించారు. మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం కోటే శ్వరరావును కలిసి నాయకులు, కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచాలని, ఖాళీ పోస్టుల భర్తీ, శాశ్వత ఉద్యోగులకు 010 ద్వారా వేతనాలు ఇవ్వాలని, గ్రంథాలయ సెస్సు నేరుగా గ్రంథాలయాలకే జమయ్యేలా చూడాలని, దివ్యాంగ ఉద్యోగులకు ఏడు సాధారణ సెలవులు ఇవ్వాలని, ఉదయం 8 గంటల నుంచి 11 గం టలు, సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు పనివేళలను అమలు చేయాలని, రోజుకు రెండు సార్లు ఫేస్ రికగ్నిజషన్ హాజరు చేసేలా చూడాలని ఆయనను కోరారు. అనంతరం ఎమ్మెల్సీ పరుచూరిఅశోక్‌బాబును కలిసి సమస్యలను తెలిపారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బీరం వెంకట రమణ సారథ్యంలో గౌరవ అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదన రాజు, నాయకులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా జాతీయ క్రీడలు ప్రారంభం

లబ్బీపేట, జనవరి(ఆంధ్రజ్యోతి): 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-14 సెపక్ తక్రా బాల, బాలికల జాతీయస్థాయి పోటీలను సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పటమట జడ్పీ హైస్కూల్‌లో ప్రారంభించారు. క్రీడా కరికులంను పాఠ్యాంశాల్లో త్వరలో ప్రవేశపెడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ రాష్ట్ర సెక్రటరీ భానుమూర్తిరాజు, జిల్లా పాఠశాల విద్యాధికారి యువి.సుబ్బారావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ యలమంచిలి రవి, జేడి దేవానందరెడ్డి పాల్గొన్నారు. మొదటి రోజు బాలుర విభాగంలో తెలంగాణపై 15-9,15-4,15-11 స్కోర్ తేడాతో తమిళనాడు, మహారాష్ట్రపై 15-12,15-05,15-11 స్కోర్ తేడాతో మణిపూర్, బాలికల విభాగంలో మహారాష్ట్రపై 11-15, 15-12, 17-14 తేడాతో ఢిల్లీ, తెలంగాణపై 15-12,15-5,15-11 తేడాతో తమిళనాడు విజయం సాధించాయి.



పురాతన ద్వారకా వేంకటేశ్వరస్వామి ఆలయం

అందం.. అఖండం

అఖండ-2 సినిమా కోసం గుడిమెట్లలో లోకేషన్ల పరిశీలన

చుట్టూ కొండలు..మధ్యలో కృష్ణమ ఒంపుసొంపులు

- కనువిందు చేసే గ్రామ అందాలు
- ఏడు కోటలు..ఏడు పేటలు..ఆలయాలు.. రాచరికపు పాలనతో వెలుగొందిన గ్రామం
- ప్రకాశం బ్యారేజీలో నీరు తగ్గినా..ఇక్కడ పుష్కలం

ఏడు కోటలు..ఏడు పేటలు..ఆలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు.. రాజులు.. రాచరికపు పాలనతో కృష్ణానది ఒడ్డున ఒక వెలుగు వెలిగిన గుడిమెట్ల గ్రామానికి అలనాటి వైభవం మళ్లీ తిరిగి రానుందా.. కృష్ణానది ఎండని ప్రాంతంగా..సహజ ప్రకృతి సౌందర్యంతో పర్యాటక స్వర్గధామమైన గుడిమెట్లకు మళ్లీ తగిన గుర్తింపు, పునర్వైభవం రాబోతోందా..అఖండ-2 సినిమా షూటింగ్ కోసం ఇక్కడి అందమైన లోకేషన్లను పరిశీలిస్తుండటంతో పర్యాటకంగా, సాంస్కృతికంగా, చారిత్రకంగా ఎంతో ప్రాశస్త్యం కలిగిన గుడిమెట్ల మళ్లీ ప్రాభవానికి నోచుకోబోతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నటుడు నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న అఖండ-2 చిత్రీకరణ ఇక్కడ జరిగే అవకాశం ఉండటంతో గుడిమెట్ల ప్రాశస్త్యానికి మళ్లీ జీవం రాబోతోందనిపిస్తోంది. శతాబ్దాల చరిత్ర కలిగిన గుడిమెట్ల గురించి తెలుసుకుందాం..!

(చందర్లపాడు, ఆంధ్రజ్యోతి)

చుట్టూ కొండలు, వాటి మధ్య ఒంపులు తిరుగుతూ ప్రవహించే కృష్ణానది అందాలతో కనువిందు చేసే గుడిమెట్ల గ్రామానికి శతాబ్దాల చరిత్ర ఉంది. పదకొండో శతాబ్దంలో గుడిమెట్ల కొండలపై ఏడుకోటలు ఉండేవి. ఆ కోటల్లో రాజులు ఉండేవారు. ఏడుపేటల్లో ప్రజలు నివసించేవారు. అప్పట్లో రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఆ కొండలపై శివ, కేశవులకు ఆలయాలను నిర్మించారు. భారీగా బంగారు ఆభరణాలను, బంగారు విగ్రహాలను ఆలయాల్లో ఏర్పాటు చేశారు. కాలక్రమేణా కలరా, మశూచి, ప్లేగు, అంటువ్యాధులు తరచూ సోకుతుండడంతో చాలామంది ప్రజలు మరణించారు. అంటువ్యాధులకు అడ్డుకట్ట వేసే క్రమంలో కొండలపై నుంచి ప్రజలను దూరంగా తీసుకొచ్చి కొత్తగా ఒక గ్రామాన్ని నిర్మించారు. ఆ గ్రామమే నేడు రామన్నపేట(గుడిమెట్ల)గా పిలవబడుతోంది. రాజులు, రాజ్యాలు పోవడంతో పాటు కాలక్రమేణా కోటలు, పేటలూ కనుమరుగయ్యాయి. రాజులు నిర్మించిన ఆలయాలు కావడంతో గుప్తనిధులు ఉంటాయన్న ఆలోచనతో దొంగలు ఆ ఆలయాలను కొల్లగొట్టారు. భారీగా బంగారం, విగ్రహాలను ఎత్తుకెళ్లిపోయారు. ఊరికి దూరంగా ఉండడంతో పూజారులు కూడా నిత్య నైవేద్యాలు పెట్టకుండా వదిలేశారు. శతాబ్దాలపాటు ఆలయాలను ఆలనాపాలనా ఎవరూ పట్టించుకోలేదు.

అఖండ-2తో అభివృద్ధికి అడుగులు


అఖండ-2 సినిమా చిత్రీకరణ ద్వారా గుడిమెట్ల గ్రామం మరోమారు ప్రచారంలోకి వచ్చింది. సహజవనరులకు నెలవైన ఈ ప్రాంతం తిరిగి గత వైభవాన్ని చాటుకొనేందుకు ఈ చిత్రం బాటలు వేస్తుందని ప్రజలు భావిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం అమరావతి నుంచి ముక్త్యాల వరకూ ట్రెంచ్ ఏర్పాటు చేసి బోట్‌షికార్, జలరవాణా ఏర్పాటు చేయాలని భావించింది. ఆమేర కొంత పనులు కూడా జరిగాయి. ఈ దశలో వైసీపీ అధికారంలో రావడంతో పనులు నిలిచిపోయాయి. తిరిగి కూటమి ప్రభుత్వం వచ్చింది. టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు బోట్‌షికార్‌కు ట్రెంచ్ ఏర్పాటు చేయడంతో పాటు అలకనంద ప్రాజెక్ట్ పనులు కూడా పూర్తయితే ఈప్రాంతం పూర్తిస్థాయి అభివృద్ధి జరగనుంది. అఖండ-2 చిత్రంతో పాటు పలు చిత్ర నిర్మాణాలకు ఈ ప్రాంతం కేంద్రం కానుందని ప్రజలు సంబరపడుతున్నారు. తమ అభిమాన నటుడు నందమూరి బాలకృష్ణ రాక కోసం వేచి చూస్తున్నారు.

పుష్కరాల పుణ్యమా..

2004లో కృష్ణా పుష్కరాల సందర్భంగా శివకేశవుల ఆలయాలకు జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. అప్పటి నుంచి ఆ ఆలయాలు భక్తులతో కళకళలాడున్నాయి. ఆ సమయంలోనే ఆలయాలకు దిగువన ఒక రైతు పొలంలో శ్రీమహాలక్ష్మి అపురూప విగ్రహం బయటపడింది. చారిత్రక నేపథ్యం కలిగిన ఆ విగ్రహం విలువ వంద కోట్ల వరకూ ఉంటుందని అంచనాలు ఉన్నాయి. ఆ విగ్రహాన్ని గ్రామస్థులు ప్రభుత్వానికి అందజేశారు. ఆ ప్రాంతంలో రాజులు అనేక గుప్తనిధులు దాచి ఉంటారని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు. రాచరికపు పాలనలో వజ్ర, వైఢూర్యాలకు కొదవలేదని కొన్ని ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. తొలకరి వర్షాలు పడిన ప్రతిమారు ఆ ప్రాంతంలో వజ్రాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. పరిసర గ్రామాల ప్రజలతో పాటు గుంటూరు జిల్లాకు చెందిన ప్రజలు కూడా ఇక్కడ వజ్రాలు వెతుకుతుంటారు.

అందాల కొండలు..కృష్ణమ్మ పరవళ్లు

ఈ ప్రాంత చారిత్రక ప్రాధాన్యం తెలిసే దర్శకుడు బోయపాటి అఖండ-2 చిత్రం చిత్రీకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందమైన గుడిమెట్ల కొండలపై నుంచి కృష్ణానది వైపు చూస్తే కొండల మధ్య ఒంపుసొంపులతో పరవళ్లు తొక్కే కృష్ణమ్మ కనువిందు చేస్తుంది. గుడిమెట్ల నుంచి ఇరవై కిలోమీటర్ల మేర నది అత్యంత లోతుగా ఉంటుంది. చరిత్రలో ఎన్నడూ ఈ ప్రాంతంలో ఏరు ఎండిన దాఖలాలు లేవు. ప్రకాశం బ్యారేజ్‌లో బ్యాక్‌వాటర్ తగ్గినా ఈ ప్రాంతంలో నీరు ఉంటుంది. అందుకే షూటింగ్‌కు ఈ ప్రాంతాన్ని ఎన్నుకున్నట్టు తెలుస్తోంది.



అందమైన ప్రకృతి రమణీయ దృశ్యాలతో కనువిందు చేస్తున్న కృష్ణానది

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

▸ ఏర్పాట్లు పర్యవేక్షించిన అధికారులు

కృష్ణలంక, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 76వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లను చేశామని, వేడుకలకు సిద్ధంగా ఉన్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఫుల్‌డ్రెస్ రిహార్సల్స్‌ను ప్రభుత్వ కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా, డీజీపీ ద్వారకా తిరుమలరావు, డీఐజీ బి.రాజకుమారి, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు పరిశీలించారు. స్టేడియంలో రాష్ట్రస్థాయిలో గణతంత్ర దినోత్సవం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్టు వారికి కలెక్టర్ వివరించారు. గణతంత్ర వేడుకలకు ఉదయం 8.51 గంటలకు డీజీపీ ద్వారకా తిరుమలరావు, 8.55కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ 8.56కు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్‌ఠాగూర్, 8.57కు ముఖ్యమంత్రి చంద్రబాబు, 8.58కి గవర్నర్ అబ్దుల్ నజీర్ స్టేడియం ప్రాంగణానికి చేరుకుంటారన్నారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, అనంతరం పోలీసు పరేడ్ తర్వాత గవర్నర్ గణతంత్ర దినోత్సవ సందేశం ఇస్తారన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల శకటాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.



వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా, డీజీపీ ద్వారకా తిరుమలరావు, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

ఓటర్ల చైతన్యం.. పోస్టర్ ఆవిష్కరణ

కృష్ణలంక: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాన్ని కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం ప్రారంభించారు. ఓటర్ల చైతన్య కోసం వివిధ రకాల స్లోగన్లను తయారుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగా జోషిని అభినందించారు. ఓటర్ల చైతన్యం కోసం రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఏపీ జెన్‌కో ఈఈ ఎం.సుందరరావు పాల్గొన్నారు.

గీత కార్మికులకు 11 మద్యం షాపులు

కృష్ణలంక: అత్యంత పారదర్శకంగా గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ చేపడుతున్నామని, ఈనెల 27న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో 11 మద్యం దుకాణాలను గీత కార్మికులు, ఉపకులాలకు కేటాయించేందుకు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, గీత కార్మికుల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో డ్రా నిర్వహించారు. విజయవాడ నగరం, జగ్గయ్యపేట మున్సిపాలిటీ, వీరులపాడు, తిరువూరు, ఎ.కొండూరు, నందిగామ, జగ్గయ్యపేట రూరల్ మండలాలకు ఒక్కొక్కటి చొప్పున ఏడు మద్యం దుకాణాలను గౌడ కులస్థులకు డ్రా ద్వారా కేటాయించామన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ, వత్సవాయి, రెడ్డిగూడెం మండలాలకు ఒక్కొక్కటి చొప్పున మూడు మద్యం దుకాణాలను గౌడలకు, విసన్నపేట మండలం దుకాణాన్ని శెట్టి బలిజలకు డ్రా ద్వారా కేటాయించినట్టు తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్వీ రామశివ హాజరయ్యారు.

లింగ వివక్ష రహిత సమాజ స్థాపనలో భాగస్వాములవుదాం

▸ కలెక్టర్ లక్ష్మీశ పిలుపు

కృష్ణలంక: బాలికా సాధికారతకు ప్రతిఒక్కరూ చేయీ చేయీ కలపాలని, మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదిగేందుకు తోడ్పాటునందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చైల్డ్‌రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ (సీఆర్ఏఎఫ్) మహిళా, శిశు సంక్షేమశాఖ భాగస్వామ్యంతో కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, సంస్థల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. 'బాలికలు బంగారం- వారి బాల్యం కాపాడటం అందరి బాధ్యత' అనే శీర్షికతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బాలికను రక్షిద్దాం.. బాలికను చదివిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్, ఐసీడీఎస్ నోడల్ అధికారి సాయిగీత, సీఆర్ఏఎఫ్ డైరెక్టర్ పి.ఫ్రాన్సిస్ తంబి, శిశు సంక్షేమ కమిటీ సభ్యులు భార్గవ్‌కుమార్, డీసీపీవో ఎం.రాజేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇందుమతి, విద్యాశాఖ ప్రతినిధి జీవీ రమణ, సీడీపీవో మంగమ్మ పాల్గొన్నారు.

ఏ ఒక్క క్లెయిమ్ పెండింగ్ ఉండకూడదు

కృష్ణలంక: వరద ప్రభావిత ప్రాంత ప్రజల వాహనాలు, ఆస్తి నష్టాలకు సంబంధించి క్లెయిమ్‌ల పరిష్కారంలో బీమా సంస్థల చొరవ ప్రశంసనీయమని, ఇప్పటికి 98.82శాతం క్లెయిమ్‌ల పరిష్కారం పూర్తయిందని, మిగిలినవి నెలాఖరులోగా త్వరితగతిన పరిష్కరించాలని బీమా సంస్థలకు కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బీమా సంస్థ ప్రతినిధులతో లక్ష్మీశ సమావేశం నిర్వహించారు. మొత్తం రూ.148.58 కోట్ల చెల్లింపులతో 98.82 శాతం సెటిల్‌మెంట్ జరిగిందని, మిగిలిన ఒక శాతం క్లెయిమ్‌ల పరిష్కారంలో ఉన్న అడ్డంకులను తొలగించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆయన సూచించారు.

నేడు 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం

▸ 'తుమ్మలపల్లి'లో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక

విజయవాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పదిహేనవ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ప్రతి ఏడాది ఒక థీమ్‌తో నిర్వహించే విధంగా ఈ ఏడాది కూడా 'ఓటింగ్ లాంటిది ఏమీ లేదు.. నేను కచ్చితంగా ఓటు వేస్తాను(నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్) అన్న నినాదంతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లను సన్మానించనున్నట్టు తెలిపారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల అవగాహన, ఓటర్ల జాబితా నిర్వహణ వంటి అంశాలలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్ర, జిల్లా, పోలింగ్ బూత్ స్థాయి అధికారులకు అవార్డులను ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు.

మైనార్టీలకు రూ.326 కోట్ల సబ్సిడీ రుణాలు

▸ అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్

లబ్బీపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'మైనార్టీల్లో 49,218 మందికి రూ.326 కోట్ల సబ్సిడీ రుణాలను నాలుగు స్లాబ్‌లలో అందిస్తాం. మొదటి స్లాబ్ రూ.లక్ష వరకు, రెండో స్లాబ్ రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు, మూడో స్లాబ్ రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు, నాలుగో స్లాబ్ రూ.5లక్షలు వరకు ఉంటుంది. లబ్ధిదారులు చెల్లించాల్సిన 10శాతం వాటా కూడా చెల్లించకుండా ఈ రుణాలను అందిస్తాం. ముస్లింలలో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారు.' అని అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ రాష్ట్ర చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. బందరు రోడ్డులోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో మైనార్టీల కళాశాలలు, ఐటీఐ కళాశాలలు మూతవేశారని, కడపలో రూ.25కోట్లతో హజ్‌హౌస్ నిర్మిస్తే దానినీ వృథా చేశారన్నారు. యువగళం పాదయాత్రలో ముస్లిం సమస్యలు లోకేశ్ నోట్ చేసుకున్నారని దాని ఫలితంగానే నేడు సబ్సిడీ పథకాలు అందుబాటులోకి వచ్చాయన్నారు.



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ డైరెక్టర్ ఆర్‌జే విద్యుల్లత

పట్టణ ప్రణాళిక ఉద్యోగుల సంఘం

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

చిట్టినగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళిక ఉద్యోగుల సంఘం క్యాలెండర్, డైరీని శుక్రవారం మంగళగిరిలోని లిటిల్ విలేజ్ ఫంక్షన్ హాల్‌లో ఆ శాఖ డైరెక్టర్ ఆర్‌జే విద్యుల్లత ఆవిష్కరించారు. 35 సంవత్సరాలుగా నూతన అంశాలతో క్యాలెండర్, డైరీని ప్రచురించడం అభినందనీయమని ఆమె అన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం పనితీరులో కొత్తగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రణాళిక సిబ్బంది మార్పును స్వీకరించి, ప్రణాళిక విభాగం గౌరవాన్ని మరింత పెంచేలా కృషి చేయాలని ఆమె సూచించారు. అదనపు డైరెక్టర్ బి.శ్రీనివాసులు, డిప్యూటీ డైరెక్టర్లు కె.వి.రంగరాజు, కె.హరిదాసు, ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు, జనరల్ సెక్రెటరీ పి.మోహన్‌బాబు, విజయవాడ జోన్-2 అధ్యక్షుడు వసీంబేగ్, ఇతర సభ్యులు, డీటీసీపీ కార్యాలయ సిబ్బంది, వివిధ పురపాలక సంఘాల టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అదృశ్యం వెనుక..

(5వ పేజీ తరువాయి)

చెందిన యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైంది. గురువారం యువకుడిని కలిసేందుకు బెంగళూరు వెళ్తున్నానని తన ఇద్దరు స్నేహితురాళ్లకు చెప్పగా, వారు కూడా వస్తామని బయల్దేరారు. బెంగళూరులోని యువకుడిని ముగ్గురు బాలికలు సంప్రదించగా, తెనాలిలో తనకు ఇద్దరు స్నేహితులు ఉన్నారని వారిని కలిసి అందరూ రావాలని సూచించాడు. దీంతో ముగ్గురు బాలికలు తెనాలిలోని ఇద్దరు యువకులను కలిశారు. వారు.. ఆ ముగ్గురిని ఓ ఇంట్లో ఉంచి మరుసటి రోజు బెంగళూరు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఇన్‌స్టాగ్రామ్ ఐడీతో ముగ్గురు యువకుల బండి నెంబర్ల ఆధారంగా తెనాలి వెళ్లి ముగ్గురు బాలికలతో పాటు అలకుంట వేణు, కేతవత్ యువరాజ్‌నాయక్, పెద్ద వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకొచ్చారు. ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతాలు ఖాళీ

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నాయి. ఈ విషయాన్నే సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. తమ వద్ద ఉన్న జాబితాలోని ఫోన్ నెంబర్లకు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఎంతో కొంత మొత్తాన్ని ముందుగా పంపుతున్నారు. తర్వాత ఆ వ్యక్తులకు ఫోన్‌చేసి మరొకరికి పంపాల్సిన డబ్బు పొరపాటున తమకు వచ్చాయని మాయమాటలు చెబుతున్నారు. ఆ డబ్బు తిరిగి పంపేస్తామని ఇవతలి వ్యక్తులు చెప్పగానే, తాము ఒక లింకు పంపుతామని, దానికి సెండ్ చేయాలంటున్నారు. గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా ఈ లింకును వారికి పంపుతున్నారు. ఈ లింకు ద్వారా చెల్లింపులు చేసే సమయంలో మొత్తం వివరాలను సైబర్ నేరగాళ్లు లాగేసుకుంటున్నారు.

లింకు తెరిస్తే ఇరుక్కున్నట్టే..

ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లింపులు చేసేటప్పుడు ఏ బ్యాంకు ఖాతా నుంచి డబ్బు పంపుతున్నామో దాని పిన్ నమోదు చేయాలి. కొన్ని బ్యాంక్ ఖాతాలకు నాలుగు అంకెల పిన్, మరికొన్నింటికి ఆరు అంకెల పిన్ ఉంటాయి. సైబర్ నేరగాళ్లు పంపిన లింకును తెరిచి డబ్బు పంపే సమయంలో ఇవతలి వ్యక్తి పిన్ నమోదు చేయగానే.. ఆ మొత్తం సమాచారం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి చేరుతుంది. పిన్‌తోపాటు బ్యాంకు ఖాతాలో ఎంత నిల్వ ఉందో వారికి తెలిసిపోతుంది. డబ్బు పంపిన కాసేపటికే.. సైబర్ నేరగాళ్లు సదరు ఖాతాను మొత్తం ఊడ్చేస్తున్నారు. ఇప్పటివరకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ తరహా కేసు నమోదు కాలేదు. అయినప్పటికీ ఇలాంటి నేరాలకు అడ్డుకట్ట వేయడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

ఎలా?క్ట్రికల్

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారు. దీనికోసం విద్యుత్ శాఖకు హైటెన్షన్ పవర్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేశారు. ఈ డిపోలో విద్యుత్ చార్జింగ్ స్టేషన్లను కూడా ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేస్తారు. ఎలక్ట్రికల్ బస్సులకు ఇక్కడే చార్జింగ్ పెడతారు. మెయింటెనెన్స్ కూడా ఇక్కడే జరుగుతుంది. కోట్లాది రూపాయల విలువ చేసే ఎలక్ట్రికల్ బస్సులను విద్యాధరపురం బస్సు డిపోలో ఏర్పాటు చేయటం తగదని ఆర్టీసీ ఉద్యోగులు అంటున్నారు. ఈ డిపో ఉంది లోతట్టు ప్రాంతంలో. చిన్నపాటి వర్షం పడినా చెరువులా నిండిపోతుంది. ఆగస్టులో కురిసిన భారీ వర్షాలు, బుడమేరు వరదకు విద్యాధరపురం డిపోలోని బస్సులు సగానికి పైగా మునిగిపోయాయి. గతంలో ఈ డిపోలో సీఎన్‌జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వర్షాలు పడినపుడు సీఎన్‌జీ ప్లాంట్‌కు ఇబ్బందులు ఏర్పడేవి. అలాంటిది ఎలక్ట్రికల్ ప్లాంట్, చార్జింగ్ స్టేషన్లకు ఎంతమాత్రం ఈ డిపో అనువు కాదని అంటున్నారు.

విజయవాడ తూర్పు

రేపు మాంసం దుకాణాలకు సెలవు

చిట్టినగర్ : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం నగర పరిధిలోని మాంసం దుకాణాలకు సెలవు ప్రకటించినట్లు నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఇన్‌చార్జి డా.సురేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ పరిధిలో కబేళా, చేపల మార్కెట్లకు నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. ఈ నెల 26న నగరంలో ఉన్న కబేళాకు సెలవు ప్రకటించినట్లు, 25 రాత్రి నుంచి కబేళాలో జంతువులను వధించేందుకు అనుమతి లేదన్నారు. నగరంలో ఉన్న అన్ని చికెన్ , మటన్ షాపులు, చేపల మార్కెట్లు తెరిచేందుకు అనుమతి లేదని, ఎవరైనా జీవాలను వధించినా, షాపులను తెరిచినా , చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఓటర్ల, గణతంత్ర వేడుకల ఏర్పాట్లలో

ఎటువంటి లోపం లేకుండా చూడండి

నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్


అధికారులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ చంద్రశేఖర్

చిట్టినగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర, జాతీయ ఓటర్ల దినోత్సవం ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న ఓటర్ల దినోత్సవ కార్యక్రమం, ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న గణతంత్రదినోత్సవం ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ నెల 25న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం ఏర్పాట్లను, 26న ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే 76వ గణతంత్ర దినోత్సవం ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్ అధికారులను ఆదేశించారు.

వేడుకలకు వచ్చే ప్రజలకు తాగునీటి సరఫరాతోపాటు, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

భేదభావం లేకుండా పిల్లలను పెంచండి

మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ లతా కుమారి


స్టెల్లాలో మాట్లాడుతున్న ఏసీపీ లతా కుమారి, లయోలాలో మాట్లాడుతున్న డాక్టర్ పి.దీక్ష

పటమట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆడ, మగ అనే భేదభావం లేకుండా తల్లిదండ్రులు పిల్లలను పెంచాలని, సాంకేతికతను సక్రమంగా వినియోగించుకోవాలని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ కె.లతా కుమారి తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్టెల్లా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు అపరిచితులతో పరిచయాలు పెట్టుకోవద్దని, సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ లీనా క్వాడ్రస్ జాతీయ బాలికా దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వాసవి, బి.ఎస్ కోటేశ్వరరావు, జీవన్ కుమార్, ప్రజాగాయకుడు ఆర్.పిచ్చయ్య, అవర రమేష్, కోటిప్రకాష్ కుమార్, స్వరూపరాణి, డాక్టర్ శ్రీనివాసరావు, హరిక, రేక, ఇన్నాషియాలు పాల్గొన్నారు.

భారతీనగర్: ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో లయోలా కళాశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాసవ్య మహిళా మండలి ఎగ్జిక్యూటివ్ మెంబర్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పి.దీక్ష, లయోలా ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఆర్.క్యాండీ డి కున్హా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్ష మాట్లాడుతూ బాల్యవివాహాల వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. బాలికలు చదువుతోపాటు, స్కిల్స్ డెవలప్ చేసుకుంటే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకుంటారని అన్నారు. డాక్టర్ ఎస్ఆర్ క్యాండీ డి కున్హా మాట్లాడుతూ ఆడపిల్లలు సమాజంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఫాదర్ బి.జోజిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.రాజేష్, అధ్యాపకులు జి.రామానుజయ, బిటెక్ మొదటి సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనస్వాగతం


దావోస్ పర్యటన ముగించుకొని ఉండవల్లి నివాసానికి చేరుకున్న ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడికు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ (పటమట,ఆంధ్రజ్యోతి)

నలందలో ప్రాంగణ ఎంపికలు

లబ్బీపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నలంద డిగ్రీ కళాశాలలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్, బెంగళూరు సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ తెలిపారు. ఈ ఎంపికలలో కళాశాలకు చెందిన 49మంది ఉద్యోగార్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి 45రోజుల శిక్షణ బెంగళూరులో అందిస్తారని, అనంతరం ఏపీ, బెంగళూరు, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఉద్యోగం కల్పిస్తారని తెలిపారు. కమ్యూనికేటివ్ ఇంగ్లీషు టీచింగ్ ఆసక్తిగల విద్యార్థులకు ఐఎల్ఎం మంచి అవకాశాలు అందిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగార్హత సాధించిన విద్యార్థులను నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి పాల్గొన్నారు.

ఘనంగా బొప్పన భవకుమార్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

పటమట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ 62వ జన్మదిన వేడుకలను పటమట కార్యాలయంలో కమ్మిలి రంగా, వేగే వాణి ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. భవన కుమార్ ప్రజల మనిషి అని ఆయన రాజకీయాల్లో ఏ పార్టీలో ఉన్నా అన్ని వర్గాల వారికి ఆప్తుడే అన్నారు. త్వరలోనే ఉన్నత పదవి దక్కాలని ఆకాంక్షించారు. జనసేన నాయకుడు బి. శంకర్, కొమ్మారెడ్డి బ్రహ్మానంద రెడ్డి, యడమ చందు, పొట్లూరి రవి, అప్పసాని సందీప్, అమ్ములు, చిన్నబాబు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణల పురోగతికి ఒప్పందాల ఆవశ్యకతపై సదస్సు


జ్యోతి వెలిగిస్తున్న సదాశివరావు, అశోక్‌కుమార్, లక్ష్మి తంగవేలు తదితరులు

మొగల్రాజపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణల పురోగతికి ఒప్పందాల ఆవశ్యకతపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన వక్తలు కళాశాలకు యూనివర్సిటీ మధ్య సంబంధాలు ఎలా ఉండాలనే విషయమై మాట్లాడారు. పారిశ్రామికంగా భారత్ ఫార్మారంగం అభివృద్ధికి ఒప్పందాలు ఎంతో తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాట్కో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎన్. సదాశివరావు, మలేషియా సైబర్జియా యూనివర్సిటీ రీసర్చ్ విభాగం డైరెక్టర్ డాక్టర్ బి. అశోక్‌కుమార్, చెన్నై సునీత మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్‌లో విదేశీ వ్యవహారాల డీన్ డాక్టర్ లక్ష్మి తంగవేలు తదితరులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సునీత అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా పలు కళాశాలల నుంచి 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. తమ పరిశోధనలను ఈ పోస్టర్ రూపంలో ప్రదర్శించారు. బెస్ట్ పోస్టర్ రూపొందించిన విద్యార్థికి సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదరహిత జిల్లా కోసం పనిచేయాలి

● ఎన్జీవోలకు డీటీసీ మోహన్ పిలుపు


పోస్టరును ఆవిష్కరిస్తున్న డీటీసీ మోహన్

కృష్ణలంక, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదరహిత జిల్లా కోసం ఎన్జీవోలు పనిచేయాలని జిల్లా డీటీసీ మోహన్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసం సందర్భంగా రోడ్డు సేఫ్టీ ఎన్జీవో అధ్యక్షుడు బి.రామ్మోహనరావు అధ్వర్యంలో ఎన్జీవో కార్యాలయంలో జాతీయ రహదారి భద్రతా సూచనలతో కూడిన ఆడియో విడుదల చేశారు. వలంటీర్ల టీషర్టు కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ఎన్జీవో తరఫున విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నామన్నారు. జిల్లా అంతటా విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదరహి రాష్ట్రం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశంతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ ఎన్జీవో సభ్యులు శ్రీకాంత్, కళ్యాణ్, కృష్ణమూర్తి, కాటమరాజు, రాధాకృష్ణ, శివ పాల్గొన్నారు.

సృజనాత్మకతతోనే అద్భుతాలు సాధ్యం

సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి సువేందు శేఖర్


సువేందు శేఖర్‌ను సన్మానిస్తున్న పాలడుగు లక్ష్మణరావు, నిమ్మగడ్డ లలిత ప్రసాద్, విష్ణు

మొగల్రాజపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు కలిగి ఉంటే అద్భుతాలు సృష్టిస్తారని సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి సువేందు శేఖర్ చెప్పారు. కానూరులోని సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు రూపొందించిన కళాకృతులతో రెండు రోజులు పాటు జరిగే ఎగ్జిబిషన్‌ను శుక్రవారం మొగల్రాజపురం సిద్ధార్థ ఆడిటోరియంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారిలో అంతర్లీనంగా ఏదో ఒక ప్రతిభ ఉంటుందని దానిని గుర్తించి ఆ ప్రతిభను బయటకు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ, ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శులు నిమ్మగడ్డ లలిత ప్రసాద్, సూరెడ్డి విష్ణు, వైస్ ప్రిన్సిపాల్ వి.సాయికృష్ణ, చిత్రలేఖన, క్రాఫ్ట్, ఎంబ్రాయిడరీ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద సూర్య


మాట్లాడుతున్న వేమూరి ఆనంద్ సూర్య

లబ్బీపేట, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో అర్చక, పురోహి తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర బ్రహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద సూర్య అన్నారు. లబ్బీపేటలోని వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ బ్రహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవాసంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రైవేటు ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక, పురోహితులక బీమా కార్డులు జారీకి ప్రభుత్వంతో చర్చిస్తున్నామని, సమస్యలు, ఉపకారవేతనాలు, ఇతర అంశాలను పరిష్కారం చూపేలా చర్చిస్తానని తెలిపారు. మార్చి, ఏప్రిల్ నెలలో అర్చక పురోహిత శంఖారావం పేరుతో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు దుర్వాసుల రామశాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి మూలుగు కిరణ్‌కుమార్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందుకూరి కిరణ్ శర్మ, రాష్ట్ర ఉప కార్యదర్శి వేదుల కాశీప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

విజయవాడ సౌత్ ఏసీపీగా పవన్‌కుమార్ బాధ్యతలు

వన్‌టౌన్ : విజయవాడ సౌత్ ఏసీపీగా శుక్రవారం దేవినేని పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటిదాకా పనిచేసిన బంగార్రాజు స్థానంలో పవన్ కుమార్ నియామకం అయ్యారు. శాంతి భద్రతల అంశంలో తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

బాలుడిని అపహరించిన మైనర్

● 4 గంటల్లో ఛేదించిన పోలీసులు
● సిబ్బందిని అభినందించిన సీపీ రాజశేఖరబాబు


తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న సీపీ రాజశేఖరబాబు

వన్‌టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలుడి అపహరణ కేసును గవర్నరుపేట పోలీసులు నాలుగు గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఏలూరు ఇందిరా కాలనీకి చెందిన షేక్ ఫాతిమా, ఆమె భర్త మస్తాన్ (లారీడ్రైవర్) కిందటేడాది డిసెంబరు 25న డెలివరీ అయిన పాపకు చికిత్స నిమిత్తం ప్రభుత్వ పాత ఆసుపత్రికి వచ్చారు. ఫాతిమా, భర్త, ముగ్గురు పిల్లలతో వెయిటింగ్ హాలులో ఉంటున్నారు. కోడూరుకు చెందిన బాలిక కొద్దిరోజులుగా ఆసుపత్రికి వస్తోంది. వెయిటింగ్ హాలులో ఉంటున్న ఫాతిమాతోపాటు వారి పిల్లలతో చనువుగా ఉంటోంది. ఈనెల 23న సాయంత్రం చికిత్స పొందుతున్న పాపకు పాలు ఇవ్వడానికి ఫాతిమా వెళ్లింది. భర్త మస్తాన్ ఏలూరు వెళ్లగా ఇద్దరు పిల్లలు వెయిటింగ్ హాలులో ఉన్నారు. వారిలో రెండేళ్ల బాబును బాలిక అపహరించింది. బయటకు వచ్చిన ఫాతిమాకు బాలుడు కనిపించలేదు. గవర్నరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ తన సిబ్బందితో పాత ఆసుపత్రికి వచ్చి సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు తెలిపారు. సీపీ వెంటనే కేసును ఛేదించాలని ఆదేశించారు. సౌత్ ఏసీపీ బంగార్రాజు పర్యవేక్షణలో సీఐ నాగమురళి తన సిబ్బందితో దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో సీసీ కెమెరాలను పరిశీలించి అనుమానితురాలిని గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానంతో బాలిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. బాలికను అదుపులోకి తీసుకుని బాలుడిని సీపీ రాజశేఖరబాబు ద్వారా తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును ఛేదించినందుకు సీఐ నాగమురళి, ఎస్సై దుర్గారావు, ప్రశాంతిలను అభినందించారు.



ముగిసిన సిస్టమ్స్ ఇంజనీరింగ్ సమ్మిట్ 2025

విజయవాడ కల్చరల్: సిస్టమ్స్ ఇంజనీరింగ్ సమ్మిట్ 2025 విజయవంతంగా ముగిసింది. తాడేపల్లిలోని ఎఫ్‌ట్రానిక్స్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ సమ్మిట్‌లో పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలు, యువ ఇంజినీర్లు రెండు రోజులపాటు జ్ఞానాన్ని పంచుకుంటూ, కొత్త సాంకేతికతలపై చర్చిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం, ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఐఎన్‌సోస్ భాగస్వామ్యంతో నిర్వహించారు. సమ్మిట్‌లో సిస్టమ్స్ ఇంజినీరింగ్ ప్రాముఖ్యతను, ముఖ్యంగా ఫంక్షనల్ సేఫ్టీ దాని అనువర్తనాలను వివిధ రంగాల్లో ఎలా ఉపయోగించవచ్చు అనే విషయమై చర్చించారు. సిస్టమ్స్ థింకింగ్, లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై పేపర్లను ప్రజంట్ చేశారు.

ప్రేక్షకుల మనసుల్లో నిలిచిన మహానటి సావిత్రి

ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

విజయవాడ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : దక్షిణభారత చలనచిత్ర పరిశ్రమలో అసమానమైన నటనాపటిమ, అసాధారణ మానవీయ కోణం, అద్వితీయమైన వ్యక్తిత్వం కలిగిన ఏకైక నటిగా మహానటి సావిత్రి అజరామరంగా ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయారని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య, సాంస్కృతిక కళాపీఠం, సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి సంయుక్త అధ్వర్యంలో శుక్రవారం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన మహానటి సావిత్రి జాతీయ పురస్కార సభలో నిడుమోలు రమా సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సావిత్రి జ్ఞాపకాలను భద్రపరిచేందుకు ప్రభుత్వపరంగా సహకరించాలన్నారు. కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి మాట్లాడుతూ మహానటి సావిత్రికి పద్మ పురస్కారాలలో ప్రాధాన్యత కల్పించాలని, సావిత్రి పేరిట మ్యూజియం నిర్మించేందుకు అవసరమైన సహాయ సహ కారాలు కావాలని నిర్వాహకులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లడంతో పాటు అందుకు అవసరమైన కార్యాచరణ కూడా వేగంగా పూర్తిచేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రసూనా రామన్, చావా నర్సింహారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సంగీత విభావరిలో సావిత్రి నటించిన వివిధ చిత్రాలలోని గీతాలను గాయనీ, గాయకులు ఆలపించారు. కొప్పుల అశోక్ ఆనంద్ వ్యాఖ్యానంతో ఆహ్లాదంగా సాగింది.



సచివాలయ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఏడీ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా

ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఓటు: ఎంకే మీనా

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఓటు అని రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్) ముఖేశ్ కుమార్ మీనా అన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన ఉద్యోగులతో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ పౌరులుగా, ఓటరుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. గత ఎన్నికల్లో దేశంలోనే అత్యధికంగా రాష్ట్రంలో ఓటింగ్ శాతం 80కిపైగా నమోదు చేసి రికార్డు సృష్టించాం. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ ఓటర్లను, ఓటు హక్కు వినియోగ ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే వారినీ ప్రత్యేకంగా సత్కరించుకుంటున్నాం' అని మీనా పేర్కొన్నారు.

గణతంత్ర వేడుకలకు గిరిజన అతిథిగా గురునాథం

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర వేడుకలకు ప్రత్యేక గిరిజన అతిథిగా హాజరుకావాలని టీడీపీ నాయకుడు, మాదిగాని గురునాథంకు కేంద్రప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. గణతంత్ర వేడుకలకు హాజరుకావడానికి ఢిల్లీ చేరుకున్న ఆయన శుక్రవారం ప్రధాని మోదీని ఆయన నివాసంలో ఇతర గిరిజన అతిథులతో పాటు కలిశారు.

'విత్తన ధ్రువీకరణ' ఉన్నతాధికారులపై ఏసీబీకి ఫిర్యాదు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా లాంలోని రాష్ట్ర విత్తన ధ్రువీకరణ అథారిటీలోని ఇద్దరు ఉన్నతాధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదులు వెళ్లాయి. వీరు ఆదాయాన్ని మించి భారీగా ఆస్తులు కూడగట్టారని పలువురు ఏసీబీకి లేఖ రాసినట్లు తెలిసింది. విత్తన ధ్రువీకరణ అధికారులుగా పనిచేస్తున్న ముగ్గురికి పదోన్నతులు కల్పించినందుకు రూ.లక్షల్లో ముడుపులు పుచ్చుకున్నారని సమాచారం. 'విత్తన క్షేత్రాలు, విత్తన నాణ్యత, విత్తన, పరిశోధన ఫలితాల విషయంలో నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారు. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, కొత్త సిబ్బంది నియామకాల్లో ముడుపులు తీసుకుంటున్నారు. వాహనాల కొనుగోలు, కార్యాలయ నిర్వహణ వ్యయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీనిపై కౌంటర్ వేయకుండా, ముడుపులు పుచ్చుకుని, కొనసాగిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 25మందిలో ఐదుగురిని పర్మినెంట్ చేసే ప్రయత్నాలు చేయగా, బోర్డు మీటింగ్‌లో బెడిసికొట్టింది. సంస్థ వాహనాన్ని హైదరాబాద్‌లో కీలక అధికారి కుటుంబ సభ్యులు వాడుతుంటే, ఏపీలో ఉపయోగిస్తున్నట్లు లాగ్‌బుక్‌లో రాస్తున్నారు. మరో ఉన్నతాధికారి తాత్కాలిక ఉద్యోగిగా చేరి అంచెలంచెలుగా ఎదిగి, ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకుని, అక్రమాలకు పాల్పడుతున్నారు' అని ఏసీబీ డైరెక్టర్‌తోపాటు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

'ఫెర్రో'కు తగ్గించిన విద్యుత్ సుంకం కొనసాగింపు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ నుంచి యూనిట్‌కు ఆరు పైసలు చొప్పున వసూలు చేస్తున్న విద్యుత్ సుంకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వు జారీ చేసింది. గతంలో యూనిట్‌కు 10 పైసలు చొప్పున వసూలు చేస్తున్న సుంకాన్ని ఆరు పైసలకు తగ్గించారు. ఆ తగ్గింపు సుంకాన్నే మరో ఏడాది కొనసాగించాలన్న ఫెర్రో ఎల్లాయిస్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ పరిశ్రమపై 30,000 మంది ఉద్యోగులు వారి కుటుంబాలూ ఆధారపడి ఉన్నాయని ఉత్తర్వులో పేర్కొన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఉత్తర్వులో వివరించారు.





గణతంత్ర వేడుకలకు ముస్తాబైన సచివాలయ భవనాలు

గాడిలో గ్రామీణాభివృద్ధిశాఖ!

సంస్కరణల బాట పట్టించాలని నిర్ణయం

- పంచాయతీరాజ్ తరహాలో ప్రక్షాళన చేసే యోచన
- ఉద్యోగుల పదోన్నతులు, జీతాల వ్యత్యాసాలపై దృష్టి
- వేతనాలు పెంచేందుకు పక్కాగా మార్గదర్శకాలు
- ఎప్పటికప్పుడు సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు
- ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో కసరత్తు ప్రారంభించిన అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పంచాయతీరాజ్‌శాఖలో ప్రక్షాళన ప్రారంభించిన ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిశాఖలోనూ సంస్కరణలు తీసుకురావాలని యోచిస్తోంది. తొలుత ఉద్యోగుల పదోన్నతులు, జీతాల వ్యత్యాసాలపై దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. వేతనాలు పెంచేందుకు మార్గదర్శకాలు పక్కాగా రూపొందించాలని నిర్ణయించారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో గ్రామీణాభివృద్ధిశాఖను అస్తవ్యస్తం చేశారు. ప్రధానమైన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారు. వాటర్‌షెడ్ లాంటి పథకాల నిధులు ఏమయ్యాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నింటినీ గాడిలో పెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. సమస్యల పుట్టగా ఉన్న గ్రామీణాభివృద్ధిశాఖను కచ్చితంగా సంస్కరించాల్సిన అవసరముందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఆయన ఆదేశాలతో ఇప్పటికే కమిషనర్ కృష్ణతేజ ఉన్నతాధికారులతో సంప్రదించి గ్రామీణాభివృద్ధి శాఖలో సమస్యలపై ఒక కమిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఉన్నతస్థాయిలో దానిపై ప్రస్తావన జరిగినట్లు సమాచారం.



పెరగని జీతాలు, దక్కని పదోన్నతులు..

గ్రామీణాభివృద్ధిశాఖలో పథకాలన్నీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితోనే అమలు చేస్తున్నారు. అధికారులను డిప్యుటేషన్ ద్వారా తీసుకున్నారు. కేంద్ర పథకాలైన ఉపాధి, వాటర్‌షెడ్ తదితర వాటిల్లో రాష్ట్రంలో సుమారు 3 వేల మందికి పైగా మండల, జిల్లా స్థాయి సిబ్బంది ఏళ్ల తరబడి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి లోకేశ్ హయాంలో పెంచిన జీతాలు తప్ప గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వారికి జీతాలు పెంచలేదు. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలోనూ ఉద్యోగాలు భారంగానే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. 2016-17లో అప్పటి కమిషనర్ రామాంజనేయులు ఉపాధి సిబ్బందికి పదోన్నతుల ప్రక్రియ చేపట్టారు. ఆ తర్వాత ఆ ఊసే లేదు. గత టీడీపీ ప్రభుత్వం ఆఖరులో ఉపాధి సిబ్బందికి హెల్త్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.. ఆ తర్వాత వైసీపీ సర్కార్ దానిని పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో స్థానిక నేతల ఒత్తిడితో ఉపాధి హామీ పథకంలో జరిగిన అడ్డగోలు బదిలీలతో సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక గత ప్రభుత్వంలో చేసిన పనులకు సంబంధించి ఇప్పుడు సోషల్ ఆడిట్ నిర్వహిస్తుంటే దొంగలెక్కలన్నీ బయటపడుతున్నాయి. అప్పట్లో పనులు లేకుండా మస్టర్లు వేసినందుకు ఇప్పుడు రూ.లక్షలు రికవరీలు వస్తున్నాయి. కొన్ని చోట్ల సిబ్బందిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారు. లేని పనులకు అప్పట్లో ఒత్తిడి చేసి మస్టర్లు వేయించారని, ఇప్పుడు తమను కాపాడేవారు లేరని సిబ్బంది వాపోతున్నారు.

సంస్కరణలు చేపడితేనే పథకం ముందుకు..

గ్రామీణాభివృద్ధిశాఖలో సమూల సంస్కరణలు చేపడితేనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగుతాయని ఆ శాఖ ఉన్నతాధికారుల్లో చర్చ జరిగింది. ఈ సందర్భంగా వారు మరిన్ని అంశాలను ప్రస్తావించినట్లు తెలిసింది. "ఒక నిర్దిష్ట విధానంలో నియామకాలు చేపట్టడంతో పాటు బదిలీలకు కూడా కొత్త మార్గదర్శకాలు రూపొందించాలి. బదిలీల్లో వీలైనంత వరకు రాజకీయ జోక్యం లేకుండా చేయాలి. ఏటా జీతాలు పెంచడంతో పాటు పీఆర్సీకి అనుగుణంగా వేతనాలు మార్చాలి. సోషల్ ఆడిట్‌కు సంబంధించి సిబ్బందిని జవాబుదారీ చేయడంలో మరిన్ని మార్పులు తీసుకురావాలి. ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలోనూ మార్పులు చేయాలి. సిబ్బంది అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలి. ఒకే తరహా ఉద్యోగుల్లో ఉన్న వేతనాల వ్యత్యాసాన్ని సరిచేయాలి. సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పించాలి. రిటైర్మెంట్ వయసును 62కు పెంచాలి. గ్రాట్యుటీ లాంటి ఇతర ప్రయోజనాలను అందించాలి. సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇవ్వడం ద్వారా పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తవుతాయి" అని వారు పేర్కొన్నారు.



గణతంత్ర ఏర్పాట్లు.. బైక్‌లపై ఫీట్లు

గణతంత్ర వేడుకల నిర్వహణకు వాల్తేరు రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. వేడుకలకు నగరంలోని రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు (ఆర్పీఎఫ్) ముమ్మర సాధన చేస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం ద్విచక్ర వాహనాలపై ఆర్పీఎఫ్ సిబ్బంది విన్యాసాలు చేశారు.

-విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఆలయ పాలకవర్గాల నియామకంపై కసరత్తు

- టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో పల్లా టెలీ కాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు పాలకమండళ్ల నియామకంపై టీడీపీ కసరత్తు చేపట్టింది. అర్హతలకు అనుగుణంగా ఈ మండళ్లలో ధర్మకర్తల నియామకానికి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం సాయంత్రం ఈమేరకు ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కలిపి సుమారు 500 ఆలయాలకు పాలక మండళ్లను నియమించాల్సి ఉంది. వీటి భర్తీకి దేవదాయ శాఖ కొన్ని అర్హతలు నిర్దేశించింది. టెలీ కాన్ఫరెన్స్‌లో ఈ అర్హతలను అన్నింటినీ పల్లా శ్రీనివాసరావు చదివి వినిపించారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ఒకటి రెండు రోజుల్లో తమ ప్రతిపాదనలను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని ఆయన వారిని కోరారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల పాలక వర్గాలకు ఇంకా కొన్ని నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు అందకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ నియోజకవర్గాల జాబితాను ఆయన చదివి వినిపించారు. ఇవి సుమారుగా 50 వరకూ ఉన్నాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థలకు పాలక వర్గాల నియామకంపై కూడా ఇన్‌చార్జి మంత్రులతో ఎమ్మెల్యేలు చర్చించాలని, ఆలస్యం చేయవద్దని ఆయన వారికి సూచించారు.

చిత్రజ్యోతి

SINCE 1965

వేసవికి విడుదల



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'జాట్'. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మాతలు. ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ మేరకు నిర్మాతలు రిలీజ్ డేట్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో సన్నీ డియోల్ ఇంటెన్స్ యాక్షన్-ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. భుజంపై రాకెట్ లాంచర్‌తో ఆగ్రహంగా ముందుకు అడుగులేస్తున్న సన్నీ డియోల్ లుక్ అదిరిపోయింది. మొత్తానికి పోస్టర్‌లో ఈ చిత్రంలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కాసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలు, కొరియోగ్రఫీ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని నిర్మాతలు తెలిపారు.

బాలయ్య సరసన సంయుక్త



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'అఖండ 2.. తాండవం'. ఈ సినిమాలో కథానాయికగా సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట చెప్పారు. హీరోయిన్లను అద్భుతమైన పాత్రల్లో చూపించే బోయపాటి శ్రీను సంయుక్త కోసం ఓ కీలక పాత్ర సిద్ధం చేశారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. ఈ సినిమాకు ఎస్. థమన్ సంగీత దర్శకుడు. సి.రామ్ ప్రసాద్ ఛాయాగ్రాహకుడు. ఈ ఏడాది సెప్టెంబర్ 25న విజయదశమి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

దోమకొండ కోటలో ప్రియాంక చోప్రా



కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోటలో శుక్రవారం ప్రముఖ నటి ప్రియాంక చోప్రా సందడి చేశారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఆమె గడి కోటలో ఉన్నారు. ఈ సందర్భంగా అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోట తరఫున సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. కోట సీనియర్ మేనేజర్ బాబ్జి హీరోయిన్‌కు జ్ఞాపికను అందజేశారు. అద్దాల బంగ్లా, సొరంగ మార్గం, చుట్టూ కందకం, కోట చరిత్రను వివరించారు. ప్రియాంక చోప్రా గతంలో రాంచరణ్‌తో 'జంజీర్' సినిమాలో నటించారు. ఆయన శ్రీమతి ఉపాసన ఈ కోటకు వారసురాలు అనే విషయం తెలిసిందే. ప్రియాంక చోప్రా దోమకొండకు వచ్చిందన్న విషయం తెలుసుకున్న స్థానికులు ఉదయమే కోట వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆమెను చూసేందుకు ఎగబడ్డారు.

దోమకొండ (ఆంధ్రజ్యోతి)

యశ్ చిత్రంలో నయనతార



యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతా మోహన్ దాస్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'టాక్సిక్'. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు నటీనటుల గురించి ప్రకటించలేదు. కానీ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ ఇందులో నటిస్తున్నాడంటూ మేకర్స్ ఆ మధ్య ఓ పోస్టర్ వదిలారు. మరోవైపు 'టాక్సిక్' హీరోయిన్ ఈమె నంటూ సోషల్ మీడియాలో ఎంతో మంది కథానాయికల పేర్లు చక్కర్లు కొట్టాయి. అయితే ఈ ప్రాజెక్టులో నయనతార భాగమైనట్లు బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం తాను యశ్ సినిమా షూటింగ్‌లో ఉన్నానని, దీనిలో నయనతార కూడా నటిస్తున్నారని, ఇంతకు మించి నేనేమీ చెప్పలేనని, పూర్తి సమాచారాన్ని డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ ప్రకటిస్తారని అక్షయ్ ఒబెరాయ్ చెప్పారు. అయితే నయనతార ఏ పాత్రలో కనిపించనున్నారనే దానిపై ఆయన స్పష్టతనివ్వలేదు. కాగా ఈ చిత్రంలో బాలీవుడ్ కథానాయిక కియారా అద్వానీ ప్రత్యేక గీతంలో నర్తించనున్నారని సమాచారం.

లాస్ ఏంజెలెస్‌లో షూట్ చేస్తాం



'ఫాస్ట్ ఎక్స్ 2' చిత్రం మిగిలిన షూటింగ్‌ను లాస్ ఏంజెలెస్‌లో జరపనున్నట్లు హాలీవుడ్ హీరో విన్‌డీజిల్ ప్రకటించారు. లాస్ ఏంజెలెస్‌లోని పలు ప్రాంతాలను కార్చిచ్చు దహించివేసిన నేపథ్యంలో ఆ నగరం కోసం తనవంతుగా ఏదైనా చేయాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలిపారు. 'ఇప్పుడు లాస్ ఏంజెలెస్‌కు మన అవసరం మరింత ఉంది. 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' ఫ్రాంచైజీలో తొలి చిత్రం షూటింగ్ 25 ఏళ్ల క్రితం ఇక్కడే మొదలైంది. మళ్లీ ఇప్పుడు ఆ నగరంలో 'ఫాస్ట్ ఎక్స్ 2' సినిమా షూటింగ్ చేయబోతున్నందుకు ఆనందంగా ఉంది. నటి జోర్డానా సూచనతో ఈ నిర్ణయం తీసుకున్నాను. లాస్ ఏంజెలెస్‌లో పరిస్థితులు కుదుటపడ్డాక చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని తెలిపారు. ఈ ఫ్రాంచైజీలో వస్తున్న చివరి చిత్రం ఇదే. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. లూయిస్ లెటెర్రీర్ దర్శకత్వం వహిస్తున్నారు.

నాన్న మాటే నా జీవన మంత్రం

- షబానా



'సినిమా దర్శకులకు స్వేచ్ఛ ఉండాలి, అదే సమయంలో సామాజిక బాధ్యత కూడా చాలా ముఖ్యం' అని బాలీవుడ్ నటి షబానా ఆజ్మీ వ్యాఖ్యానించారు. అలా అని ప్రతి సినిమా సందేశాత్మకంగా ఉండాలి అన్న వాదన కూడా సరికాదన్నారు. చలనచిత్రానికి వినోద విలువలు కూడా అవసరం అన్నారు. షబానా ఆజ్మీ సినీ స్వర్ణోత్సవం సందర్భంగా హైదరాబాద్ సాహిత్య మహోత్సవం వేదికగా 'ఎ లైఫ్ ఇన్ సినిమా - షబానా ఆజ్మీ' అంశంపై అమితా దేశాయ్ ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఇక్కడే పుట్టి తొమ్మిదో ఏట వరకు ఉన్న తాను తర్వాత కాలంలోనూ వేసవి సెలవులకు నగరానికి వస్తుండేదాన్నని చెప్పారు. సమాజంలో మార్పు కోసం పనిచేస్తున్న క్రమంలో నిరాశ చెందకుండా, నిబద్ధతతో ముందుకెళ్లడాన్నే తాను విశ్వసిస్తానని షబానా చెప్పారు. మార్పు ఒక్క రోజులో వచ్చేది కాదు, కనుక మనం చేసే పని ఇప్పటికిప్పుడు ఫలితాలను ఇవ్వలేకపోవచ్చు. కానీ రేపటినాడు జరిగే మార్పునకు దోహదపడుతుందని తన తండ్రి కైఫీ ఆజ్మీ చెప్పిన మాటలే తనకు జీవిత సూత్రమని, వాటినే ఆచరిస్తూ ముందుకు సాగుతున్నానని షబానా ఆజ్మీ తెలిపారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

ఇక వెంకటలచ్చిమి అని పిలుస్తారేమో!

పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న చిత్రం 'వెంకటలచ్చిమి'. ముని దర్శకత్వంలో రాజా, ఎస్ఎస్ చౌదరి నిర్మించనున్న ఈ సినిమా శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ముని మాట్లాడుతూ 'కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిపోతారనిపించింది. పాన్ ఇండియా సినిమాగా తెలుగుతో పాటు హిందీ, పంజాబీ భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ఈ రివెంజ్ డ్రామా భారతీయ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించడం ఖాయం' అని అన్నారు. హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ "మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నాను. నచ్చక తిరస్కరించాను. ఈ సినిమా తర్వాత నా పేరు వెంకటలచ్చిమిగా స్థిరపడిపోతుందేమో అన్నంతగా బలమైన సబ్జెక్టు ఇది' అని అన్నారు.







వీరూ జోడీ విడిపోనుందా?

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ దంపతులు విడిపోనున్నారట. త్వరలో విడాకులు తీసుకోనున్నట్టు ఇరువురి సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ దంపతులు ఇప్పటికే వేర్వేరుగా నివసిస్తున్నట్టు సమాచారం. 2004లో సెహ్వాగ్-ఆర్తికి వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఆర్యవీర్, వేదాంత్ ఉన్నారు. గత దీపావళి వేడుకలకు సంబంధించిన ఫొటోలను సెహ్వాగ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అందులో వీరూ, అతడి తల్లి, ఇద్దరు కుమారులే ఉండడంతో..సెహ్వాగ్ దంపతులు విడిపోనున్నారన్న వార్తలొచ్చాయి.. దానికితోడు వీరూ, ఆర్తి ఇన్‌స్టాలో పరస్పరం అన్‌ఫాలో చేసుకోవడం..ఆ వార్తలకు బలం చేకూర్చింది.

ఐసీసీ టెస్ట్ డ్రీమ్ టీమ్‌లో.. బుమ్రా, జడేజా, జైస్వాల్

దుబాయ్: ఐసీసీ టెస్ట్ టీమ్ ఆఫ్ ద ఇయర్-2024లో ముగ్గురు భారత ఆటగాళ్లు బుమ్రా, జడేజా, యశస్వీ జైస్వాల్‌కు చోటు దక్కింది. ఆస్ట్రేలియా నుంచి కెప్టెన్‌గా కమిన్స్ ఒక్కడినే ఎంపిక చేయగా.. ఇంగ్లండ్ నుంచి నలుగురు, న్యూజిలాండ్ నుంచి ఇద్దరు, శ్రీలంక నుంచి ఒక్కరికి ఈ డ్రీమ్ టీమ్‌లో స్థానం లభించింది.

వన్డేల్లో మంధాన, దీప్తికి..: మహిళల వన్డే టీమ్ ఆఫ్ ద ఇయర్- 2024లో భారత ప్లేయర్లు స్మృతి మంధాన, దీప్తి శర్మలకు చోటు లభించింది. దక్షిణాఫ్రికా క్రీడాకారిణి లారా వోల్వార్ట్‌ను సారథిగా ఎంపిక చేశారు. ఇక పురుషుల వన్డే టీమ్ ఆఫ్ ద ఇయర్ ఎంపిక అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ డ్రీమ్ టీమ్‌లో భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్ల నుంచి ఒక్కరికి కూడా చోటు దక్కకపోవడం గమనార్హం. కానీ, ఉపఖండ జట్లు పాకిస్థాన్, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్ ఆటగాళ్లే 10 స్థానాలు దక్కించుకోవడం విశేషం.

చెపాక్‌లోనూ చెక్ పెట్టాలని..

ఆత్మవిశ్వాసంతో టీమిండియా
నేడు ఇంగ్లండ్‌తో రెండో టీ20

రాత్రి 7 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



హార్దిక్

చెన్నై: ఐదు టీ20ల సిరీస్‌కు అదిరే ఆరంభాన్నిచ్చిన భారత జట్టు ఇప్పుడు మరో విజయంపై దృష్టి సారించింది. చెన్నై వేదికగా శనివారం ఇంగ్లండ్‌తో రెండో టీ20 ఆడనుంది. ముందుగా బౌలింగ్. ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ చెలరేగిన భారత్ పర్యాటక ఇంగ్లండ్‌ను తొలి మ్యాచ్‌లో బెంబేలెత్తించింది. కెప్టెన్ జోస్ బట్లర్ మినహా మరెవరూ భారత బౌలర్లను దీటుగా ఆడలేకపోవడంతో 132 పరుగులకే పరిమితం కావాల్సి వచ్చింది. సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న భారత్ అదే జోరును చెపాక్‌లోనూ చూపాలనుకుంటోంది. మరోవైపు సిరీస్‌ను సమం చేసేందుకు బట్లర్ సేన సమాయత్తమవుతోంది. అందుకు వారి బ్యాటర్లు స్థాయికి తగ్గట్టు రాణించాల్సి ఉంది. స్థానిక మైదానంలో కేవలం రెండు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు జరగ్గా వాటిల్లోనూ చివరి బంతికే ఫలితాలు తేలడం విశేషం.



అభిషేక్

అభిషేక్ అనుమానమే: శుక్రవారంనాటి నెట్ ప్రాక్టీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ కుడి చీలమండ బెణకడంతో తీవ్రంగా ఇబ్బందిపడ్డాడు. నొప్పితో బయటికి వెళ్లిన అభిషేక్ మళ్లీ ప్రాక్టీస్‌కు రాలేదు. ఒకవేళ అభిషేక్ ఆడకపోతే సంజూకు తోడుగా తిలక్‌వర్మ లేదా ధ్రువ్ జురెల్ దిగే అవకాశముంది.

షమి పరిస్థితేంటి?: తొలి టీ20లో షమి కచ్చితంగా ఆడతాడని భావించినా అలా జరగలేదు. పిచ్ స్పిన్‌కు అనుకూలించనుందని షమిని పక్కనబెట్టారన్న కథనాలు వినిపించాయి. మరోవైపు టీమ్ మేనేజ్‌మెంట్ అతడి ఫిట్‌నెస్‌ను మరింత క్షుణ్ణంగా పరిశీలించాలనుకుని తొలి టీ20కి దూరంగా ఉంచిందని చెబుతున్నారు. అయితే చాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుని షమి మ్యాచ్ ఫిట్‌నెస్‌ను వీలైనంత త్వరగా పరీక్షించాల్సిన అవసరముంది. ఈనేపథ్యంలో చెపాక్‌లో అతడిని ఆడించే అవకాశాల్లేకపోలేదు. అయితే తొలి మ్యాచ్‌లో షమి లేకున్నా మరో పేసర్ అర్ష్‌దీప్, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఇంగ్లండ్‌ను దెబ్బతీశారు. బ్యాటింగ్‌లో అభిషేక్-శాంసన్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. షమి తుది జట్టులో ఉంటే నితీశ్ బెంచీకే పరిమితమవుతాడు. బ్యాటింగ్ బలంగా ఉండాలని భావిస్తే స్పిన్నర్ బిష్ణోయ్‌ను తప్పిస్తారు.

అట్కిన్సన్‌పై వేటు: భారత్‌తో రెండో టీ20కి ఇంగ్లండ్ 12 మంది ఆటగాళ్లను ప్రకటించింది. అట్కిన్సన్ స్థానంలో బ్రైడన్ కార్స్‌ను తీసుకున్నారు. అలాగే బేథెల్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బేథెల్ ఆడకపోతే జేమీ స్మిత్ టీ20ల్లో అరంగేట్రం చేయగలడు. పేసర్లు ఆర్చర్, ఉడ్, కార్స్ ఈసారి భారత్‌ను ఇబ్బందిపెట్టాలనుకుంటున్నారు.

జట్లు

భారత్ (అంచనా): అభిషేక్/జురెల్, శాంసన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, రింకూ సింగ్, అక్షర్, నితీశ్, అర్ష్‌దీప్, బిష్ణోయ్/షమి, వరుణ్ చక్రవర్తి.

ఇంగ్లండ్(తుది జట్టు): డకెట్, సాల్ట్, బట్లర్ (కెప్టెన్), బ్రూక్, లివింగ్‌స్టోన్, బెథెల్/స్మిత్, ఒవెర్టన్, కార్స్, ఆర్చర్, రషీద్, ఉడ్.

పిచ్..గతేడాది ఐపీఎల్‌లో ఈ వేదికపై తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 170. జరిగిన 9 మ్యాచ్‌ల్లో ఆరు సార్లు ఛేజింగ్ జట్లే నెగ్గాయి. ఇక్కడ మంచు ప్రభావం ఎక్కువే కాబట్టి టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ వైపు మొగ్గు చూపవచ్చు. అయితే 2024 లీగ్‌లో స్పిన్ కన్నా పేసర్లు ఎక్కువగా లాభపడడంతో రెండు జట్లు దీనికి తగ్గట్టుగానే బరిలోకి దిగే అవకాశం ఉంది.

ఖేలో ఇండియా గేమ్స్‌లో నయనకు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా శీతాకాల క్రీడల్లో హైదరాబాద్ స్కేటర్ తాళ్ళూరి నయన శ్రీ పసిడి పతకంతో మెరిసింది. శుక్రవారం లద్దాఖ్‌లో జరిగిన ఈ పోటీల్లో 15 ఏళ్ల నయన స్పీడ్ స్కేటింగ్ 500 మీటర్ల విభాగంలో 1 నిమిషం 1.35 సెకన్లలో రేసును పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది.



అయ్యో.. జొకో

- తిరగబెట్టిన గాయం
- సెమీస్‌నుంచి అర్ధాంతర నిష్క్రమణ
- ఫైనల్లో జ్వెరెవ్
- సిన్నర్‌తో అమీతుమీ

ఆస్ట్రేలియన్ ఓపెన్

ఎన్నాళ్లనుంచో ఊరిస్తున్న 25 గ్రాండ్‌స్లామ్‌ల అరుదైన రికార్డుకు చేరువయ్యాడు. మరో రెండు మ్యాచ్‌లు గెలిస్తే చరిత్ర సృష్టిస్తాడు. ఈసారి టోర్నమెంట్లో అద్భుతంగా ఆడాడు. ఈ క్రమంలో కొన్ని నాలుగు సెట్ల పోరాటాలూ చేశాడు. టైటిల్ హాట్ ఫేవరెట్, యువ సంచలనం కార్లోస్ అల్కారజ్‌ను చిత్తు చేయడంతో అతడిపై అంచనాలు రెట్టింపయ్యాయి. కానీ గాయం దెబ్బ కొట్టింది. సెమీఫైనల్ మధ్యలో వైదొలగాల్సిన పరిస్థితి కల్పించింది. దాంతో దిగ్గజ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ టెన్నిస్‌లో అరుదైన అధ్యాయాన్ని తన పేరిట లిఖించుకొనే అవకాశం కోసం మరికొంత సమయం వేచి చూడక తప్పదు.



సిన్నర్



జ్వెరెవ్

మెల్‌బోర్న్: అల్కారజ్‌తో క్వార్టర్‌ఫైనల్లో అయిన గాయం జొకోవిచ్‌కు చేటు చేసింది. ఆ గాయం వల్లే క్వార్టర్స్ తర్వాత జొకో ప్రాక్టీస్ చేయలేదు. దాంతో అతడు సెమీఫైనల్ ఆడతాడా..లేదా..అనే అనుమానాలూ రేకెత్తాయి. చివరకు అదే నిజమైంది. రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో శుక్రవారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో 6-7 (7)తో తొలి సెట్ కోల్పోయిన దశలో ఎడమ కాలి గాయంతో ఏడో సీడ్ జొకోవిచ్ మ్యాచ్ నుంచి వైదొలిగాడు. దాంతో ఫైనల్‌కు చేరిన జ్వెరెవ్ డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సిన్నర్‌తో టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. మరో సెమీఫైనల్లో టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ) 7-6 (2), 6-2, 6-2తో 21వ సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా)పై గెలుపొందాడు.

గాయం తీవ్రమై..

అల్కారజ్‌తో మంగళవారం జరిగిన నాలుగు సెట్ల క్వార్టర్‌ఫైనల్ సందర్భంగా 37 ఏళ్ల జొకో ఎడమ కాలికి గాయమైంది. తొలి సెట్ అనంతరం మెడికల్ టైమౌట్ తీసుకున్న నొవాక్ కాలికి పట్టీ వేసుకొని ఆటలో కొనసాగాడు. రెండో సెట్లో నొప్పితో బాగా ఇబ్బందిపడ్డాడు. ఇక.. జ్వెరేవ్‌తో సెమీస్ తొలి సెట్ 81 నిమిషాల పాటు పోటాపోటీగా సాగింది. ఫలితంగా సెట్ టైబ్రేకర్‌కు దారితీయగా.. అందులోనూ జొకో, జ్వెరేవ్ ఒక్కో పాయింట్ కోసం తీవ్రంగా పోరాడారు. ఎట్టకేలకు జ్వెరేవ్ సెట్‌ను దక్కించుకున్నాడు. ఈ సమయంలో నొప్పి భరించలేని స్థాయికి చేరడంతో మ్యాచ్ నుంచి విరమించుకుంటున్నట్టు రెఫరీకి జొకో తెలిపాడు. సెమీఫైనల్ నుంచి వైదొలగకుంటే కెరీర్‌లో 100వ టైటిల్‌ను ఈ గ్రాండ్‌స్లామ్‌లోనే సాధించే అవకాశం ఉండేది. టెన్నిస్ చరిత్రలో ఇప్పటి వరకు రోజర్ ఫెడరర్ (102) మాత్రమే సెంచరీ టైటిళ్ల ఫీట్ సాధించాడు.

సిన్నర్..తడబాటుకు లోనై..: రెండో సెమీఫైనల్లో సిన్నర్‌కు తొలిసెట్‌లో షెల్టన్ గట్టి పోటీ ఇచ్చాడు. 6-5తో షెల్టన్ సెట్ పాయింట్‌పై నిలిచిన వేళ..ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన సిన్నర్ సెట్‌ను టైబ్రేక్‌కు మళ్లించాడు. ఆ సెట్‌ను నెగ్గిన జానిక్ తదుపరి రెండు సెట్లను ఏకపక్షం చేసి మ్యాచ్ గెలుపొందాడు.

నేడు మహిళల ఫైనల్
సబలెంక × కీస్
(మ.2 గం.నుంచి) సోనీ నెట్‌వర్క్‌లో..



జడ్డూ హిట్.. రోహిత్ ఫ్లాప్

పంత్, జైస్వాల్ కూడా విఫలం ● రంజీ ట్రోఫీ



జడేజా (12 వికెట్లు)

ముంబై: రంజీల్లో బరిలోకి దిగిన టీమిండియా స్టార్ ప్లేయర్లలో జడేజా ఒక్కడే అంచనాలను అందుకొన్నాడు. రెండు ఇన్నింగ్స్‌లో కలిపి జడ్డూ (5/66, 7/38) మొత్తం 12 వికెట్లు పడగొట్టి సౌరాష్ట్ర విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఢిల్లీతో మ్యాచ్‌లో సౌరాష్ట్ర 10 వికెట్లతో విజయం సాధించింది. పంత్ (17)ను జడ్డూ అవుట్ చేశాడు. కాగా రోహిత్‌శర్మ మళ్లీ విఫలమయ్యాడు. రెండో ఇన్నింగ్స్‌లో హిట్‌మ్యాన్ 35 బంతుల్లో 28 పరుగులతో మెరుగ్గానే ఆరంభించాడు. గాడిలో పడుతున్నాడనుకొనేలోపే క్యాచవుటయ్యాడు. దీంతో ముంబై రెండోరోజు ఆట ఆఖరికి రెండో ఇన్నింగ్స్‌లో 274/7 స్కోరు చేసింది. జైస్వాల్ (26), శ్రేయాస్ అయ్యర్ (17) కూడా భారీ స్కోర్లు చేయలేక పోయారు. శార్దూర్ ఠాకూర్ (113 బ్యాటింగ్) అజేయ శతకంతో క్రీజులో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 120, జమ్మూ కశ్మీర్ 206 పరుగులు చేశాయి.

ఆంధ్ర 303
పుదుచ్చేరి 209/5

పుదుచ్చేరి: లోయరార్డర్ బ్యాటర్ శశికాంత్ (99 నాటౌట్) ఆదుకోవడంతో.. గ్రూప్-బిలో పుదుచ్చేరితో రంజీలో ఆంధ్ర మెరుగైన స్కోరు సాధించింది. ఆటకు రెండో రోజైన శుక్రవారం ఓవర్‌నైట్ స్కోరు 245/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 303 పరుగులకు ఆలౌటైంది. అంకిత్ శర్మ 4 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో పుదుచ్చేరి 209/5 స్కోరు చేసింది. అరుణ్ కార్తీక్ (54), అమన్ ఖాన్ (37) క్రీజులో ఉన్నారు. మోహిత్ కాలే (60) హాఫ్ సెంచరీ చేశాడు. పృథ్వీ రాజ్ 4 వికెట్లు పడగొట్టాడు.

బిజినెస్



ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్!

3 గిగావాట్ల సామర్థ్యం.. రూ.2.58 లక్షల కోట్ల పెట్టుబడులు
గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఏర్పాటుకు రిలయన్స్ ప్రణాళిక

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కృత్రిమ మేథ (ఏఐ) సామర్థ్యాలతో కూడిన మెగా డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు బ్లూంబర్గ్ కథనం పేర్కొంది. ప్రస్తుతం దేశంలోని డేటా సెంటర్ల మొత్తం సామర్థ్యం ఒక గిగావాట్ లోపే. రిలయన్స్ ఏకంగా 3 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు వ్యయం 2,000-3,000 కోట్ల డాలర్ల (రూ.1.72-2.58 లక్షల కోట్లు) స్థాయిలో ఉండవచ్చని అంచనా. అంతే కాదు, సామర్థ్యం పరంగా, ప్రపంచంలో ఇదే అతిపెద్ద డేటా సెంటర్ కానుంది. జామ్‌నగర్‌లో రిలయన్స్‌కు చెందిన ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్దది. త్వరలో ప్రాంతం మరో భారీ కేంద్రానికి వేదిక కాబోతోందన్నమాట.

ఎన్‌విడియా భాగస్వామ్యంతో ఏర్పాటు

రిలయన్స్ ఏర్పాటు చేయబోయే భారీ డేటా సెంటర్‌కు అమెరికన్ టెక్ దిగ్గజం ఎన్‌విడియా తన అత్యాధునిక బ్లాక్‌వెల్ ఏఐ చిప్‌లను సమకూర్చనుంది. ఇందుకోసం ఎన్‌విడియాతో ఆర్ఐఎల్ గత ఏడాది అక్టోబరులోనే ఒప్పందం కుదుర్చుకుంది.

బంగారం @ రూ.83,000

సరికొత్త రికార్డు స్థాయికి ధర.. వరుసగా 8వ రోజూ పైపైకి..

న్యూఢిల్లీ: పసిడి వరుసగా ఎనిమిదో రోజూ ఎగబాకి సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠానికి చేరుకుంది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం..ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర శుక్రవారం రూ.200 పెరిగి రూ.83,100కు చేరింది. బంగారం రూ.83,000 దాటడం ఇదే తొలి సారి. 99.5 స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.200 పెరుగుదలతో రూ.82,700కు ఎగబాకింది. వెండి సైతం కిలో రూ.500 పెరుగుదలతో రూ.94,000 ధర పలికింది. కాగా, ముంబై స్పాట్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.80,348, 99.5 శాతం ప్యూర్ గోల్డ్ రేటు రూ.80,026కు చేరింది. కిలో వెండి రూ.91,211గా నమోదైంది. హైదరాబాద్ మార్కెట్ విషయానికొస్తే, 24 క్యారెట్ల గోల్డ్ రూ.82,420కి, 22 క్యారెట్ల రేటు రూ.75,550కి పెరగగా.. కిలో వెండి రూ.1.05 లక్షలకు ఎగబాకింది.



అంతర్జాతీయ అనిశ్చితులే కారణం..

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు, వాణిజ్య విధానాల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో అనిశ్చితి పెరిగింది. ఇలాంటి అనిశ్చిత పరిస్థితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న పసిడికి మళ్లీ డిమాండ్ పెరిగిందని బులియన్ విశ్లేషకులు వెల్లడించారు. దాంతో దేశీయంగానూ ఈ విలువైన లోహం ధరలు కొండెక్కుతున్నాయని వారన్నారు. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి రేటు ఒక దశలో 15.50 డాలర్లు (0.56 శాతం) పెరిగి 2,780.50 డాలర్లకు చేరింది. వెండి సైతం 1.53 శాతం ఎగబాకి 31.32 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఈ ఏడాదిలో 3,000 డాలర్లకు ఔన్స్ గోల్డ్!

ప్రామాణిక వడ్డీ రేట్లపై అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ నిర్ణయంతో పాటు వచ్చే నెల 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ నిర్ణయాలు పసిడి ధరల భవిష్యత్ గమనాన్ని నిర్దేశించనున్నాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ, కరెన్సీ విభాగ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో వాణిజ్యపరమైన అనిశ్చితులు కొనసాగితే ఈ ఏడాదిలోనే ఔన్స్ గోల్డ్ 3,000 డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని బులియన్ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

ఆర్థిక శాఖలో హల్వా వేడుక

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2025-26 రూపకల్పన తుది దశకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ కార్యాలయం (నార్త్ బ్లాక్)లో బడ్జెట్ కాపీలను ముద్రించే బేస్‌మెంట్‌లో శుక్రవారం హల్వా వేడుక జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థిక కార్యదర్శి తుహిన్ కాంత పాండే, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	136
వరంగల్	120	గుంటూరు	127
కరీంనగర్	120	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	112
కర్నూలు	120	నెల్లూరు	117
విశాఖపట్నం	127	అనంతపురం	117
గోదావరి	136		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	82,420 ▲	75,550 ▲	1,05,000 ▲
విజయవాడ	83,000 ▲	78,500 ▲	93,700 ▲
విశాఖపట్నం	80,410 ▲	73,710 ▲	92,400 ▲
రాజమండ్రి	82,420 ▲	75,550 ▲	93,700 ▼
ప్రొద్దుటూరు	81,650 ▲	75,560 ▲	93,000 ▼
ముంబై	80,348 ▲	73,599 ▲	91,211 ▲

గ్రాన్యూల్స్ లాభంలో 6 శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో గ్రాన్యూల్స్ ఇండియా నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 6 శాతం క్షీణించి రూ.117.60 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.125.70 కోట్లుగా ఉంది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంతో పోల్చితే మాత్రం లాభం 21 శాతం వృద్ధి చెందింది. కాగా సమీక్షా త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.1,156 కోట్ల నుంచి రూ.1,138 కోట్లకు తగ్గింది.

లారస్ లాభంలో 300 శాతం వృద్ధి

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో లారస్ ల్యాబ్స్ లిమిటెడ్.. నికర లాభం ఏకంగా 300 శాతం వృద్ధితో రూ.23 కోట్ల నుంచి రూ.92 కోట్లకు చేరుకుంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ కూడా 18 శాతం పెరిగి రూ.1,195 కోట్ల నుంచి రూ.1,415 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో సీడీఎంఓ, ఎఫ్‌డీఎఫ్ డివిజన్ మంచి వృద్ధిని సాధించటం ఎంతగానో కలిసి వచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు.

రెండు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: వారాంతం ట్రేడింగ్‌లో ఆద్యంతం లాభ, నష్టాల మధ్య ఊగిసలాడిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు చివరికి నష్టాల్లో ముగిశాయి. దాంతో మార్కెట్లో రెండు రోజుల ర్యాలీకి తెరపడినట్లైంది. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఈక్విటీ ట్రేడర్లు రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, హెల్త్‌కేర్ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. శుక్రవారం మార్కెట్లో ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 329.92 పాయింట్లు కోల్పోయి 76,190.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 113.15 పాయింట్ల నష్టంతో 23,092.20 వద్దకు జారుకుంది.

అదానీకి శ్రీలంక సర్కారు షాక్!

విద్యుత్ కొనుగోలు ఒప్పందం రద్దు?

న్యూఢిల్లీ: విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారులకు భారీగా లంచాలు ముట్టజెప్పిందన్న ఆరోపణలపై అమెరికాలో దర్యాప్తు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్‌నకు తాజాగా మరో షాక్ తగిలింది. ఆ ఆరోపణల నేపథ్యంలో శ్రీలంక కూడా తమ దేశంలో అదానీ గ్రీన్ ఎనర్జీ నిర్మిస్తున్న పవన విద్యుత్ ప్రాజెక్టులపై దర్యాప్తు ప్రారంభించినట్లు అంతర్జాతీయ న్యూస్ ఏజెన్సీ ఏఎఫ్‌పీ కథనం పేర్కొంది. అంతేకాదు, గత ఏడాది మే నెలలో అదానీ గ్రీన్ ఎనర్జీతో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని శ్రీలంక ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని, ఆ దేశ విద్యుత్ శాఖ ఉన్నతాధికారి ఈ విషయాన్ని ధ్రువీకరించారని తన కథనంలో వెల్లడించింది. శ్రీలంక ఉత్తర ప్రాంతంలోని మన్నార్, పూణెరిన్‌లో మొత్తం 484 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన పవన విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు ఆ ప్రాజెక్టుల నుంచి ఉత్పత్తి చేసే విద్యుత్‌ను 20 ఏళ్ల పాటు కొనుగోలు చేసేందుకు ఆ దేశ మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.

అదంతా అవాస్తవం: అదానీ గ్రూప్ ఈ వార్తలను ఖండించింది. అవి పూర్తిగా తప్పుడు, పక్కదోవ పట్టించే కథనాలేనని తన ప్రకటనలో పేర్కొంది. "ప్రాజెక్టు పూర్తిగా రద్దు కాలేదు. సాధారణ సమీక్ష ప్రక్రియలో భాగంగా శ్రీలంక ప్రస్తుత ప్రభుత్వం గత సర్కారు హయాంలో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పంద చార్జీలను పునఃసమీక్షించాలని నిర్ణయించింది. శ్రీలంక పునరుత్పాదక రంగంలో 100 కోట్ల డాలర్ల (రూ.8,600 కోట్లు) పెట్టుబడులు పెట్టడంతో పాటు ఆ దేశ హరిత ఇంధన రంగం, ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించే విషయంలో తమ గ్రూప్ కట్టుబడి ఉంద"ని అదానీ గ్రూప్ అధికారిక ప్రతినిధి పేర్కొన్నారు.

ఏపీ, తెలంగాణలోని ఎస్‌ఎంఈలపై దృష్టి: సీఎస్‌బీ బ్యాంక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని చిన్న,మధ్య తరహా కంపెనీల (ఎస్‌ఎంఈ) రుణ అవసరాలపై సీఎస్‌బీ బ్యాంక్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం రెండు రాష్ట్రాల్లో ఆరు ప్రత్యేక శాఖలు పని చేస్తున్నట్టు బ్యాంక్ ఎస్‌ఎంఈ బిజినెస్ గ్రూప్ హెడ్ శ్యామ్ మణి చెప్పారు. ఇప్పటి వరకు ఈ రెండు రాష్ట్రాల్లోని ఎస్‌ఎంఈలకు సీఎస్‌బీ బ్యాంక్ రూ.400 కోట్ల వరకు రుణాలు మంజూరు చేసింది. హైదరాబాద్‌లో ఫార్మా ముఖ్యంగా బల్క్‌డ్రగ్స్ ఎస్‌ఎంఈలు, ఏపీలో ట్రేడ్, తయారీ, వ్యవసాయ ఆధారిత ప్రాసెసింగ్ ఎస్‌ఎంఈల రుణ అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు మణి చెప్పారు. క్రిసిల్ పరపతి రేటింగ్, ఎస్‌ఎంఈల బ్యాలెన్స్ షీట్స్, జీఎస్‌టీ రిటర్న్‌ల ఆదారంగా కనీసం రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు, గరిష్ఠంగా రూ.75 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు తమ రుణాలు ఉంటాయన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఏపీ, తెలంగాణల్లో 28 శాతంగా ఉన్న తమ ఎస్‌ఎంఈల రుణాల వృద్ధి రేటు ఈ ఆర్థిక సంవత్సరం 28 నుంచి 30 శాతం వరకు ఉంటుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

మార్కెట్లోకి ఒప్పో రెనో 13



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఒప్పో ఇండియా... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి ఒప్పో రెనో 13 సిరీస్ స్మార్ట్‌ఫోన్స్‌ను తీసుకువచ్చింది. ఒప్పో ఇండియా ప్రొడక్ట్ మార్కెటింగ్ మేనేజర్ అసీమ్ మాథుర్ ఈ ఫోన్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరికొత్త మీడియాటెక్ డైమెన్సిటీ 8350 చిప్‌సెట్, ఏఐ రెడీ కెమెరాతో ఈ స్మార్ట్‌ఫోన్‌ను తీసుకువచ్చినట్లు చెప్పారు. అండర్ వాటర్ ఫొటోగ్రఫీ, ఏరోస్పేస్ గ్రేడ్ అల్యూమినియం ఫ్రేమ్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ.. ఈ ఫోన్ ప్రత్యేకత అని తెలిపారు. రెండు వేరియంట్లలో రెనో 13 ప్రో 5జీ, రెనో 13 5జీతో ఈ ఫోన్ అందుబాటులో ఉండనుంది. ఇందులో రెనో 13 5జీ ఆఫర్లతో కలుపుకుని 8జీబీ+128 జీబీ (రూ.34,199), 8జీబీ+256 జీబీ (రూ.35,999)తో అందుబాటులో ఉండగా రెనో 13 ప్రో 5జీ.. 12 జీబీ+256 జీబీ (రూ.44,999), 12 జీబీ+512 జీబీ (రూ.49,499)తో అందుబాటులో ఉంటాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	490
వరంగల్	462	గోదావరి	485
చిత్తూరు	523	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	72

అన్నం కూడా ఔషధమే!

"అన్నం పరబ్రహ్మ స్వరూపం" అంటారు మన పూర్వీకులు. ప్రతి రోజూ తినే ఈ అన్నానికి అంత ప్రాముఖ్యత ఇవ్వటానికి కారణం దానిలో ఉన్న పౌష్టికాహార విలువలు. కేవలం పౌష్టికాహార విలువలు మాత్రమే కాకుండా అన్నానికి అనేక రకాల విశిష్టతలు కూడా ఉన్నాయి.

'భక్తము' అంటే అన్నం అని అర్థం. 'భక్తము'కు పంచబడేది, కేటాయించబడేది, నిర్దేశించబడేది అనే అర్థాలు కూడా ఉన్నాయి. ఈ నిర్వచన కోణం నుంచి చూస్తే ఇతరులకు పెట్టేది అన్నం. దీనిని ఎలా వండాలనే విషయాన్ని కూడా భోజన కుతూహలంలో వివరించారు. అన్నాన్ని వండటానికి బియ్యాన్ని చేటలో చెరగాలి. ఆ తర్వాత ఒక గిన్నెలో ఈ బియ్యపు కొలతకు ఐదు రెట్లు ఎక్కువగా నీళ్లు పోసి కాచాలి. ఇలా కాగిన నీటిని ఎసరు అంటారు. ఈ ఎసరులో బియ్యాన్ని పోసి సన్నటి సెగ మీద అన్నాన్ని ఉడకనివ్వాలి. ఈ సమయంలో నీరు దగ్గరపడుతూ ఉంటుంది. ఈ నీటిని గంజి అంటారు. సాధారణంగా ఈ గంజిని పారబోస్తారు. దీని వల్ల అన్నంలో అధికంగా ఉన్న పిండి పదార్థాలు కొట్టుకుపోతాయి.



పాకదర్పణం అనే గ్రంథం ప్రకారం- గంజి వార్చకుండా అన్నం వండితే దానిని 'అసృతాన్నదోషం' అంటారు. అంటే ఈ తరహా అన్నం తింటే అరుగుదల కష్టమవుతుంది. రుచిలో కూడా తేడా ఉంటుంది. కఫదోషం పెరుగుతుంది. ఇక గంజివార్చిన తర్వాత అన్నం మెతుకులు ఒక దానికి మరొకటి అంటుకోకూడదు. ఇలా ఉండటాన్ని విశదం అంటారు. ఇలాంటి అన్నం మన జాఠరాగ్నిని పెంచుతుంది. పోషకంగా పనిచేస్తుంది. ఇలా తినే అన్నం రక్తంలో ఒత్తిడి (బీపీ), స్థూలకాయం, తలతిరుగుడు మొదలైన వాటికి విరుగుడుగా పనిచేస్తుంది. భోజనకుతూహలంలో అన్నం గురించి మరిన్ని వివరాలు ఉన్నాయి. అవి..

- చల్లారిన అన్నం జఠరాగ్నిని మందగింపచేస్తుంది. ఉబ్బసం, నోట్లో నీళ్లూరటం లాంటి బాధలు కలుగుతాయి.
- చద్దన్నాన్ని పెరుగుతో కలిపి తింటే బీపీ తగ్గుతుంది చలవ చేస్తుంది. కానీ వాతాన్ని పెంచుతుంది. అందు వల్ల దీనిలో కూరగాయముక్కలను కలుపుకొని తినాలి.
- బియ్యం కొలతకు 15 రెట్లు ఎక్కువగా పోసి.. ఉడికించి.. దాని ద్వారా వచ్చిన గంజిని తాగితే జీర్ణశక్తి బాగా మెరుగుపడుతుంది. దీనిని మెట్టటి అన్నం అంటారు.
- బియ్యం కొలతలో నాలుగోవంతు పెసరపప్పు కలిపి వండే అన్నం ద్వారా వచ్చిన గంజిలో చాలా పోషకాలు ఉంటాయి.

● గంగరాజు అరుణాదేవి

తలలో పేలు తగ్గాలంటే..!


బడికి వెళ్లే పిల్లలకు తరచూ తలలో పేలు చేరుతుంటాయి. వీటివల్ల పిల్లల్లో రక్తహీనత, శిరోజాలు రాలిపోవడం, ఎదుగుదల ఆగిపోవడం వంటి సమస్యలు వస్తాయి. తలలో పేలు పడ్డాయని తెలిసిన వెంటనే వాటిని తొలగించేందుకు నిపుణులు చెబుతున్న చిట్కాలివి...

● తలలో పేల సమస్య పోవాలంటే శిరోజాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కుంకుడు కాయ లేదంటే శీకాయ పొడితో ప్రతిరోజూ తలస్నానం చేయాలి. దీనివల్ల వెంట్రుకలకు పట్టి ఉన్న ఈపు(పేల గుడ్లు) రాలిపోతుంది. వారం రోజుల్లో పేలు కూడా తగ్గుతాయి. ఒక గ్లాసు నీళ్లలో రెండు చెంచాల త్రిఫల చూర్ణం కలిపి ఆ నీటిని మాడుకు పట్టిస్తే పేలు రాలిపోతాయి.

● ఒక గిన్నెలో అయిదు చెంచాల కొబ్బరి నూనె వేసి కొద్దిగా వేడి చేయాలి. అందులో మూడు కర్పూరం బిళ్లలను వేళ్లతో చిదిమి పొడిలా చేసి కలపాలి. రాత్రి పడుకునే ముందు ఈ నూనెని మాడుకి, వెంట్రుకలకు పట్టించాలి. శిరోజాలను ముడిపెట్టి తలకు పలుచని వస్త్రాన్ని చుట్టాలి. ఉదయాన్నే మైల్డ్ షాంపూతో తలస్నానం చేస్తే పేలన్నీ పోతాయి.

● ఒక కప్పు పెరుగులో రెండు చెంచాల నిమ్మరసం పిండి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి పది నిమిషాల తరవాత తలస్నానం చేస్తే తలలో పేల సమస్య తీరిపోతుంది.

● గుప్పెడు వేపాకులు, కొన్ని తులసి ఆకులు తీసుకుని ముద్దలా నూరి అందులో చిటికెడు పసుపు, రెండు చెంచాల కొబ్బరి నూనె కలిపి ఈ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. పావు గంట తరవాత గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది



● ఒక గిన్నెలో మూడు చెంచాల కొబ్బరి నూనె, ఒక చెంచా యాపిల్ సైడర్ వెనిగర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని తలంతా రాయాలి. పది నిమిషాల తరవాత దువ్వెనతో కుదుళ్ల నుంచి వెంట్రుకల చివరి వరకు సున్నితంగా దువ్వితే పేలన్నీ రాలిపోతాయి.

● మూడు చెంచాల వేపనూనెని గిన్నెలో వేసి కొద్దిగా వేడిచేయాలి. ఈ నూనెని మాడు మీద, వెంట్రుకలకు పట్టించాలి. అరగంట తరవాత దువ్వెనతో వేగంగా దువ్వితే పేలన్నీ బయటికి వచ్చేస్తాయి.

● కుటుంబ సభ్యులందరూ ఒకే దువ్వెన వాడడం వల్ల పేలు ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. తలలో పేలు పడ్డాయని తెలిసిన వెంటనే పిల్లలకు వేరే దువ్వెన, దిండు ఏర్పాటు చేయాలి. వాటిని కూడా నిత్యం శుభ్రం చేస్తూ ఉంటే సమస్య పెరగకుండా ఉంటుంది.

వంటిల్లు



రుతువులు మారే క్రమంలో మన శరీరంపై అనేక రకాల బ్యాక్టీరియాలు దాడి చేస్తూ ఉంటాయి. వీటి దాడులను ఎదుర్కోవటానికి శరీరానికి రోగనిరోధక శక్తి అవసరం. ఈ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో మనం తినే ఆహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అలాంటి కొన్ని వంటలు ఎలా చేయాలో మనం తెలుసుకుందాం.

రోగనిరోధక శక్తి పెంచే రుచులివే!

ఓట్స్ ఫ్రూట్స్ సలాడ్

కావాల్సిన పదార్థాలు:
ఓట్స్- రెండు కప్పులు, దాల్చిన చెక్క పొడి- అర స్పూను, యాపిల్ ముక్కలు- ఒక కప్పు, అరటిపండు ముక్కలు- ఒక కప్పు, ద్రాక్ష పళ్లు- పది, తేనె- రెండు చెంచాలు, గుమ్మడి గింజలు- చెంచా, నీళ్లు- తగినన్ని.

తయారీ విధానం

● ఓట్స్‌ను ఒక గిన్నెలో తీసుకొని తగినన్ని నీళ్లు పోయాలి. ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు నాననివ్వాలి. ఒకవేళ త్వరగా కావాలనుకుంటే మామూలు నీళ్లకు బదులుగా వేడి నీళ్లు పోస్తే... మూడు గంటల్లో నానిపోతాయి.
● నానిన ఓట్స్‌లో ముందుగా యాపిల్ ముక్కలు, అరటిపండు ముక్కలు, ద్రాక్ష పళ్లు, తేనె, గుమ్మిడి గింజలు కలపాలి.
● ఆ మిశ్రమంపై దాల్చిన చెక్క పొడిని చల్లాలి.

జాగ్రత్తలు
● ఓట్స్‌లో నీళ్లకు బదులుగా పాలు కూడా పోయవచ్చు. దీని వల్ల రుచి మారుతుంది.
● కొందరు ఈ సలాడ్‌ను బాగా పలచగా చేస్తారు. అలాంటప్పుడు ఓట్స్‌లో ఎక్కువ నీళ్లు లేదా పాలు పోయాలి.
● గుమ్మిడి గింజలతో పాటుగా పొద్దు తిరుగుడు గింజలు, తులసి గింజలను కూడా కలుపుకోవచ్చు.





అల్లం తులసీ కిచిడీ

కావాల్సిన పదార్థాలు: బాగా కడిగిన తులసి ఆకులు- రెండు చెంచాలు, తురిమిన అల్లం ముక్కలు: అర చెంచా, బియ్యం- ఒక కప్పు, పెసరపప్పు- అర కప్పు, నెయ్యి- నాలుగు చెంచాలు, కరివేపాకు- రెండు చెంచాలు, జీలకర్ర- అర స్పూను, పసుపు- చిటికెడు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని.

తయారీ విధానం

● ఒక గిన్నెలో బియ్యం, పెసరపప్పు వేసి బాగా కడగాలి. దానిలో నాలుగు కప్పుల నీళ్లు పోయాలి.
● తులసి ఆకులు, పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని కుక్కర్‌లో నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.
● ఒక మూకుడులో నెయ్యిని వేడి చేయాలి. దీనిలో జీలకర్ర, అల్లం ముక్కలు, కరివేపాకు వేసి వేయించాలి.
● అన్నం, పెసరపప్పు మిశ్రమంలో వేయించిన జీలకర్ర, అల్లం ముక్కలు, కరివేపాకుతో పాటుగా ఉప్పు వేసి బాగా కలపాలి.

జాగ్రత్తలు
● తులసి ఆకులను వేయించకూడదు. అన్నంతో పాటుగా ఉడకనివ్వాలి. దీని వల్ల తులసి ఆకుల్లోని సారం అన్నంలో కలుస్తుంది.
దీని వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది.

కిమ్చి స్క్రాంబుల్డ్ ఎగ్స్



కావాల్సిన పదార్థాలు:
కిమ్చి తయారీకి: సన్నగా తరిగిన క్యాబేజీ- రెండు కప్పులు, ఉప్పు- తగినంత, కారం- చెంచా, వెల్లుల్లి రెబ్బలు- రెండు, అల్లం ముక్కలు- ఒక చెంచా, పంచదార- రెండు చెంచాలు
స్క్రాంబుల్డ్ ఎగ్స్ తయారీకి: కోడిగుడ్లు- రెండు, పాలు- పావుకప్పు, బ్రెడ్ ముక్కలు- పావు కప్పు, ఉల్లిపాయ ముక్కలు- రెండు స్పూన్లు, ఉప్పు- చిటికెడు, నూనె లేదా నెయ్యి- ఒక చెంచా.

కిమ్చి తయారీ విధానం:
సన్నగా తరిగిన క్యాబేజీలో ఉప్పు, కారం, వెల్లుల్లి రెబ్బలు, అల్లం ముక్కలు, పంచదార వేసి బాగా కలపాలి. దీనిని ఫ్రిజ్‌లో పెట్టాలి. బాగా ఊరిన తర్వాత బయటకు తీయాలి.

స్క్రాంబుల్డ్ ఎగ్స్ తయారీ విధానం
● ఒక గిన్నెలో గుడ్లలోని సొనను బాగా కలపాలి. దీనిలో పాలు వేసి మళ్లీ కలపాలి. తర్వాత బ్రెడ్, ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి మిశ్రమంలా చేయాలి.
● ఒక మూకుడులో నూనె లేదా నెయ్యిని వేసి వేడి చేయాలి.
దానిలో ఈ మిశ్రమాన్ని వేయాలి. అది వేడికి దగ్గరపడిన తర్వాత ఒక గరిటెతో చిన్న చిన్న ముక్కలుగా చేయాలి. దానిని ఒక గిన్నెలోకి తీసుకోవాలి.
● ఆ గిన్నెలోనే కిమ్చి వేసి కలపాలి.

జాగ్రత్తలు
● సొనలో పాలు పోస్తే అదనపు రుచి వస్తుంది. పాలు వేయకపోయినా పర్వాలేదు.
● కిమ్చిలో ఎక్కువ పంచదార వేయకూడదు. దీని వల్ల తీపి పెరిగిపోతుంది.

సంకల్పం

ఉన్నత చదువు... దానికి తగిన కొలువు... జీవితం సాఫీగా సాగిపోతోంది. కానీ ఆమె అంతటితో సరిపెట్టుకోలేదు. సమాజానికి తనవంతుగా తిరిగివ్వాలన్న సంకల్పం ఆమెను కుదురుగా కూర్చోనివ్వలేదు. అందుకే కోరి తెచ్చుకున్న ఉద్యోగం వదిలేసి... అట్టడుగు వర్గాల పిల్లలకు అండగా నిలబడ్డారు. రోబోటిక్స్, కోడింగ్, ఏఐ వంటివి నేర్పించి... వారి భవితకు బంగారు బాట వేస్తున్నారు. దాని కోసమే 'ది ఇన్నోవేషన్ స్టోరీ' నెలకొల్పి... చదువు అవ్వగానే ఉపాధి అవకాశాలు అందుకొనేలా పిల్లలను తీర్చిదిద్దుతున్న 53 ఏళ్ల మీనల్ మజుందార్ కథ ఇది.



సాంకేతికత వైపు నడిపిస్తున్నారు

"రాకెట్ వేగంతో దూసుకుపోతున్న నేటి ప్రపంచంలో సాంకేతికత అన్ని రంగాలకూ విస్తరించింది. పాఠశాల దశ నుంచే పిల్లలకు ఆ దిశగా బలమైన పునాదులు పడాలి. లేదంటే భవిష్యత్తులో కెరీర్ పరంగా ఎంతో నష్టపోతారు. దీన్ని దృష్టిలో ఉంచుకొనే నేను 'ది ఇన్నోవేషన్ స్టోరీ' (టీఐఎస్) ప్రారంభించాను. వెనుకబడిన వర్గాల పిల్లలకు 'స్టెమ్' (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్)ను ఒక ప్రాజెక్టుగా తీసుకొని బోధించడం దీని ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా రోబోటిక్స్, కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజన్స్ వంటివి చిన్న వయసులోనే పరిచయం చేస్తున్నాం. ఫలితంగా చదువు పూర్తవుతూనే వారికి మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. పేదరికం నుంచి అభివృద్ధిపథం వైపు అడుగులు వేయడానికి ఆ కుటుంబాలకు నేను చేస్తున్న చిరు సాయంగా దీన్ని భావిస్తున్నాను.

మా అమ్మాయివల్ల...

బ్యాంకులో మంచి ఉద్యోగం వదిలేసి ఇటువైపు రావడానికి ప్రధాన కారణం మా అమ్మాయి. ఆ కారణం ఏంటో తెలియాలంటే నా గురించి చెప్పాలి. నేను పుట్టి పెరిగిందంతా ముంబయిలోనే. బాగా చదువుకొని, ఉన్నత స్థానంలో ఉండాలనేది నా చిన్ననాటి ఆకాంక్ష. దాని కోసం కష్టపడి చదివాను. ఇంజనీరింగ్ తరువాత ఎంబీఏ చేద్దామనుకున్నాను. కోల్‌కతా ఐఐఎంలో సీటు వచ్చింది. ఎంబీఏ పూర్తయ్యాక ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌లో ఉద్యోగం వచ్చింది. కొద్ది కాలంలోనే సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ హోదాకు వెళ్లాను. జీవితాంతం బ్యాంకర్‌గానే ఉండాలనేది అప్పటి నా ఆలోచన. ఆ ఉద్యోగం నాకు బాగా నచ్చింది. కానీ అక్కడే నా జీవితం అనుకోని మలుపు తిరిగింది. మా అమ్మాయి అప్పుడు ఎనిమిదో తరగతి చదువుతోంది. తను స్కూలు రోబోటిక్స్ టీమ్‌లో భాగస్వామి కావాలనుకుంది. నేను సరే అనడంతో టీమ్‌లో చేరింది. నలభై మంది టీమ్‌లో తను ఒక్కతే అమ్మాయి కావడంతో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. తనను బయటి వ్యక్తిలా చూసేవారు. అవన్నీ భరించలేక, అక్కడ ఏమీ నేర్చుకోలేక ఇబ్బందులు పడింది. నాది ఇంజనీరింగ్ నేపథ్యం కావడంతో ఇంటి దగ్గర నేనే రోబోటిక్స్ నేర్పించాను. టెక్నాలజీకి సంబంధించి ప్రతి విషయంలో తనకు మార్గదర్శిగా ఉన్నాను. అప్పుడు నాకు అర్థమైంది ఏంటంటే... తరగతి గదుల్లో ఎంత బోధించినా పెద్దగా ఫలితం ఇవ్వదని. దానికి బదులు పిల్లలను నిజమైన ప్రాజెక్టుల్లో భాగస్వాములను చేస్తే వారి ఆలోచనాశక్తి పెరుగుతుందని... సమస్య ఉత్పన్నమైనప్పుడు సొంతంగా పరిష్కరించుకోగలిగే సామర్థ్యం అలవడుతుంది.! అంటే అనుభవపూర్వకంగా అభ్యాసం అనమాట.

వారిని చూశాక...

కొవిడ్ సమయంలో విద్యా సంస్థలన్నీ మూతపడ్డాయి. ఆన్‌లైన్ బోధన మొదలైంది. కానీ పేద వర్గాలకు చెందిన అనేకమంది విద్యార్థులు మొబైల్, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌ల వంటి సౌకర్యాలు లేక తరగతులకు దూరమయ్యారు. ఇది నన్ను కలచివేసింది. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే 'సలామ్ బాంబే ఫౌండేషన్'తో కలిసి పని చేశాను. ముఖ్యంగా కొవిడ్ సమయంలో 18 లక్షల రూపాయలు సేకరించి, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు కొని ఇచ్చాను. కోల్‌కతా ఐఐఎంలో చదివినప్పుడు ఒక బలమైన బృందాన్ని నిర్మించాను. కొవిడ్ సమయంలో ఆ బృందం నా సేవా కార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించింది. అయితే కొద్దిమంది పిల్లలకు మాత్రమే ల్యాప్‌టాప్‌లు ఇవ్వగలిగాను. మరి మిగిలినవారి పరిస్థితి ఏంటి? వారి చదువు కొనసాగేదెట్లా? ల్యాప్‌టాప్‌లు ఇచ్చినంతమాత్రాన సమస్య పరిష్కారం కాదని అప్పుడు గ్రహించాను. పాఠ్యపుస్తకాల్లో విద్య మాత్రమే కాకుండా ప్రపంచంతో పోటీపడాలంటే విద్యార్థి దశ నుంచే రోబోటిక్స్, ఏఐ లాంటి సబ్జెక్టులు కూడా అవసరమని భావించాను.



'టీఐఎస్'కు శ్రీకారం...

నేను అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేయాలంటే పూర్తి సమయం దానికి కేటాయించాలి. అప్పుడే న్యాయం చేయగలుగుతానని అనిపించింది. వెంటనే నా ఉద్యోగానికి రాజీనామా చేశాను. బ్యాంకింగ్ రంగంలో పద్నాలుగేళ్ల నా ప్రస్థానం ముగిసింది. 2021లో 'టీఐఎస్'కు అంకురార్పణ జరిగింది. పేద, ప్రభుత్వ పాఠశాలల పిల్లలతో పాటు ఆసక్తిగల ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులకు కూడా ఏఐ, రోబోటిక్స్, వెబ్‌డెవలప్‌మెంట్, 3డీ క్యాడ్ వంటివి నేర్పిస్తున్నాం. మొదటి ఏడాది 250 మందికి శిక్షణ ఇచ్చాం. దీనికోసం ప్రతిష్ఠాత్మక సంస్థలైన ఐఐటీ- ఢిల్లీ, ఐఐఎస్‌సీ- బెంగళూరు, అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్, క్యాప్‌జెమినీ, టాటా క్యాపిటల్‌తో కలిసి పని చేస్తున్నాం. మా దగ్గర శిక్షణ తీసుకున్న విద్యార్థులు పలు జాతీయ, అంతర్జాతీయ రోబోటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. వారిలో అధిక శాతం అట్టడుగు వర్గాల పిల్లలే. ఇది నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. దీని ద్వారా ఇప్పటివరకు పది వేలమందికి పైగా విద్యార్థులు ప్రయోజనం పొందారు. రాబోయే ఐదేళ్లలో పది లక్షల మందికి మా సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. అది నెరవేరుతుందని ఆశిస్తున్నాను."

మేకప్

ల్యూబ్ మిలమిలలు శాశ్వతమా?

ముఖాన్ని మిలమిలా మెరిపించడం కోసం తాజాగా ల్యూబ్ ట్రెండ్ వాడుకలోకొచ్చింది. ప్రధానంగా సామాజిక మాధ్యమాల ఇన్‌ఫ్లూయెన్సర్లు ఇష్టారాజ్యంగా వాడుకుంటున్న లూబ్రికెంట్ల ధోరణితో ఒరిగే లాభనష్టాలు, ప్రత్యామ్నాయాల గురించి తెలుసుకుందాం!

ముఖం ఎంతగా మెరుపులు వెదజల్లితే అంత ఎక్కువ మంది ఫాలోవర్లను సొంతం చేసుకోవచ్చనే ఆలోచనతో అందుబాటులో ఉన్న ఉపాయాలన్నీ అనుసరిస్తూ ఉంటారు ఇన్‌ఫ్లూయెన్సర్లు. సన్నిహిత ప్రదేశాల కోసం ఉద్దేశించిన ల్యూబ్స్‌ను ముఖం మెరుపుకు ఉపయోగించే ధోరణి ఊపందుకుంటోంది. జారుడుగా ఉండి, తాత్కాలికంగా ముఖానికి బిగుతును, మెరుపునూ పెంచే ల్యూబ్‌లు, మేకప్‌లో కీలకమైన ప్రైమర్ల స్థానాన్ని భర్తీ చేయడం మొదలుపెట్టాయి. ముఖాన్ని నునుపుగా మార్చి, చర్మ రంధ్రాలను కనిపించకుండా చేసి, మేకప్‌కు ముఖాన్ని సిద్ధం చేసే సాధనాలు ప్రైమర్లు. అంతకు మించిన ఫలితాన్ని అందిస్తున్నాయనే కొన్ని ల్యూబ్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఈ పాశ్చాత్య సంస్కృతి మన దేశంలో కూడా విస్తరించింది. అయితే ల్యూబ్‌లను ప్రైమర్లుగా వాడడం వల్ల కొన్ని దుష్ప్రభావాలుంటాయి. అవేంటంటే....

- సిలికాన్ లేదా నీటి ఆధారిత ల్యూబ్‌లు కొన్ని వాణిజ్య ప్రైమర్లను మరిపించినప్పటికీ అవి ముఖ సౌందర్యానికి తగ్గట్టు తయారైనవి కావు
- సిలికాన్ ఆధారిత ల్యూబ్‌లు దీర్ఘకాల వినియోగానికి ఉద్దేశించి తయారైనవి కావు
- సన్నిహిత సందర్భాల కోసం తయారైన లూబ్రికెంట్స్‌లో ముఖ చర్మానికి హాని చేసే కారకాలుంటాయి
- బిగుతును పెంచే ల్యూబ్స్ వల్ల, కళ్ల దిగువన, పెదవుల చుట్టూరా సన్నని గీతలు ఏర్పడతాయి
- ల్యూబ్స్‌తో చర్మం రంధ్రాలు పూడుకుపోయే ప్రమాదం ఉంది
- ల్యూబ్ వాడకంతో ముఖానికి అంటుకున్న జిడ్డును తొలగించడం కష్టమవుతుంది.

ప్రత్యామ్నాయాలు ఇవే

ముఖానికి మెరుపు కోసం చవకగా దొరికే ల్యూబ్స్ ఉపయోగించి, చర్మ సమస్యలను కొని తెచ్చుకునే బదులు, చర్మ తత్వానికి నప్పే ప్రైమర్లను ఎంచుకోవడం అన్ని విధాలా సురక్షితం. వాటిని ఎలా ఎంచుకోవాలంటే...

- పొడి చర్మం కలిగినవాళ్లు హైడ్రేటింగ్ ప్రైమర్లను ఎంచుకోవాలి
- చర్మ రంధ్రాలు పెద్దవిగా ఉన్నవాళ్లు వాటిని కప్పేసే, పోర్ ఫిల్లింగ్ ప్రైమర్లను ఎంచుకోవాలి
- జిడ్డు చర్మం కలిగినవాళ్లు, మాటిఫైయింగ్ ప్రైమర్లు ? వాడుకోవాలి.



పట్టు చీరలు ఇలా పదిలం...

పట్టుచీరలు చాలా సున్నితంగా ఉంటాయి. వీటిని సరైన విధానంలో సంరక్షించుకోకుంటే మెరుపు కోల్పోయి పాతగా కనిపిస్తాయి. పట్టుచీరలు ఎక్కువకాలం మన్నికగా ఉండాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం!

- పట్టుచీరని ఒకసారి కట్టుకుని విడిచిన తరవాత దానికి బాగా గాలి తగిలేలా ఆరేయాలి. తేమ, చల్లదనం లేకుండా పొడిగా ఆరిన తరవాతనే మడత పెట్టి భద్రపరచాలి. నాలుగైదుసార్లు కట్టుకున్న తరవాత చీరని డ్రైక్లీనింగ్ చేయించవచ్చు. దీనివల్ల పట్టు చీర మెరుపు పోకుండా ఉంటుంది.
- చీర మీద చిన్న మరకలు లేదా మురికి అంటితే అక్కడ మాత్రమే..... నీళ్లతో తడిపిన దూదితో తుడవాలి. కొద్దిగా గ్లిజరిన్ రాసి పలుచని బట్టతో తుడిచినా మరకలు పోతాయి.
- పట్టు చీరని శుభ్రం చేయాలనుకుంటే మొదటిసారి మాత్రం డ్రైక్లీనింగ్ చేయించాలి. తరవాత తగిన జాగ్రత్తలు తీసుకుంటూ నీళ్లలో ముంచి ఉతకవచ్చు. నీళ్లలో కొద్ది మోతాదులో బేబీ షాంపూని మాత్రమే కలపాలి. డిటర్జెంట్, సర్ఫ్ కలపకూడదు. చీరని నీళ్లలో ఎక్కువసేపు నాననివ్వకూడదు. చేతులతో గట్టిగా పిండకూడదు.
- చీర కొనను నీళ్లలో ముంచి వేళ్లతో పిండి రంగు పోతున్నదీ లేనిదీ పరిశీలించాలి. రంగు వదులుతున్నట్లయితే ఒక బకెట్ నీళ్లలో పది చుక్కల నిమ్మరసం కలిపి అందులో చీర ముంచి వెంటనే తీసి నీడలో ఆరవేయాలి.
- చీరని ఇస్త్రీ చేసేముందు దానిపై కొన్ని నీటి చుక్కలు చల్లితే ముడతలు తొందరగా పోతాయి. పట్టుచీరని నేరుగా ఇస్త్రీ చేయకూడదు. చీరపై నూలు దుపట్టా లేదా పరిశుభ్రమైన తువాలు పరిచి దానిమీద ఇస్త్రీ చేయాలి. దీనివల్ల ఇస్త్రీ పెట్టె వేడికి జరీ నల్లబడకుండా ఉంటుంది.
- పట్టుచీరని చక్కగా మడతపెట్టి సన్నని నూలు వస్త్రం లేదా తెల్లని కాగితంలో చుట్టి అలమరాలో పెట్టుకోవాలి. కనీసం మూడు నెలలకు ఒకసారైనా చీర మడతలను మార్చాలి. లేకుంటే మడతలపై చిరుగులు వస్తాయి.
- పట్టుచీరలను అలమరాలో సర్దిన తరవాత వాటి మధ్యలో కలరా ఉండలు లేదంటే ఫ్యాబ్రిక్ ఫ్రెషనర్స్‌ను ఉంచాలి. దీనివల్ల పురుగులు చేరకుండా ఉంటాయి. గంధపు చెక్కను పలుచని గుడ్డలో చుట్టి పెడితే చీరలకు తేమ చేరకుండా ఉంటుంది. వాటికి మంచి సువాసన కూడా పడుతుంది.
- పట్టుచీర మీద దగ్గరనుంచి పెర్ఫ్యూమ్‌ని స్ప్రే చేయకూడదు. దానిలోని రసాయనాల వల్ల జరీ పోగులు పాడయ్యే అవకాశం ఉంది. కాబట్టి ఒక అడుగు దూరంలో ఉండి స్ప్రే చేయడం మంచిది.





జ్యోతి ప్రజ్వలన చేసి మహాసభలను ప్రారంభిస్తున్న ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీరేంద్రసింగ్ సోలంకి. పక్కన మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, కలిదిండి రఘు తదితరులు

స్టార్టప్‌లను ప్రోత్సహించాలి

- ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సోలంకి పిలుపు

మద్దిలపాలెం(విశాఖపట్నం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): యువతలో స్వావలంబనను పెంపొందించడానికి స్టార్టప్‌లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీరేంద్రసింగ్ సోలంకి అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) 43వ రాష్ట్ర మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భారతదేశ సంప్రదాయ విజ్ఞాన వ్యవస్థలు, సాంస్కృతిక విలువలను సంరక్షించడం నేడు చాలా అవసరమని తెలిపారు. సాంకేతిక, ఆవిష్కరణల రంగాల్లో యువత ప్రముఖ పాత్ర పోషించాలని, సమృద్ధ భారత్, వికసిత భారత్, విశ్వగురువుగా భారత్‌ను తీర్చిదిద్దడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సోలంకి పిలుపునిచ్చారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా వెంకట గోపి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు, కాంటినెంటల్ కాఫీ సంస్థ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్, మహాసభల స్వాగత కమిటీ అధ్యక్షుడు కలిదిండి రఘు, ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ దారుణ హత్య

- ఉద్యోగానికి రాజీనామా చేయాలని ఒత్తిడి
- టీడీపీ నాయకులే చంపించారు.. బాధితుల ఆరోపణ



ఈరన్న (ఫైల్)

ఆలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆలూరు మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బండారి ఈరన్న హత్యకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు విధులకు బైక్‌పై వెళ్తున్న ఆయనను దుండగులు వెంబడించి, కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేసి పరయ్యారు. ఉద్యోగం విషయంలో నెలకొన్న వివాదాల కారణంగా టీడీపీ నేతలే ఈరన్నను హత్యచేయించారని బాధితులు ఆరోపిస్తున్నారు. వారి కథనం ప్రకారం.. ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా బండారి ఈరన్న(50) గత ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ స్థానిక నాయకులు ఈరన్నను ఉద్యోగం వదిలేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. దీనిపై పలుమార్లు పంచాయితీలు కూడా జరిగాయి. రాజీనామా చేయకపోతే అంతు చూస్తామని అధికార పార్టీకి చెందిన కొందరు ఇటీవల బెదిరించారు. మాట వినకపోవడంతో చివరకు ఆయనను కడతేర్చారని బాధితులు ఆరోపించారు. ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, ఆయన కుమారుడే ఈరన్నను హత్యచేయించారని భార్య నాగలక్ష్మి, మామ మల్లయ్య ఆరోపించారు. కాగా, డీఎస్పీ వెంకటరామయ్య ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితులను ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి పరామర్శించారు.



రాష్ట్రంలో పశు ఆవాసాలకు ఉపాధి నిధులు కేటాయించడంతో వాటి నిర్మాణాలకు పాడి రైతులు ఎగబడుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీని పాడి రైతులకు అందించడంతో ఆ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు రైతులు ముందుకొస్తున్నారు. సొంత స్థలమున్న వారు కేవలం 10 శాతం వ్యయంతో పశువులకు రేకులు షెడ్లు నిర్మాణాలు చేసే అవకాశం రావడంతో ఈ పథకాన్ని వినియోగిస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంక్రాంతి రోజున 11 వేలకు పైగా మినీ గోకులాలను ప్రారంభించారు. రైతుల్లో ఈ డిమాండ్‌ను గమనించిన సర్కార్ మరో 20 వేల షెడ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది.

మినీ గోకులాలకు జై!

నిర్మాణాలపై పాడిరైతుల ఆసక్తి.. ఉపాధి నిధులతో 23 వేలకు పైగా షెడ్లు

- మరో 20 వేలకు పైగా మంజూరుకు నిర్ణయం
- 90 శాతం సబ్సిడీతో..
- హౌసింగ్ ఇళ్లకంటే మెరుగైన ప్రయోజనం
- పేద పాడిరైతులకు ఊరటనిస్తున్న పశు ఆవాసాలు
- పాల ఉత్పత్తి పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా పాడిరైతుల ప్రయోజనార్థం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సరికొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అవే మినీ గోకులాలు. పాడి ఉన్న రైతులకు వీటిని మంజూరు చేయడం ద్వారా పాల ఉత్పత్తి పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. 90 శాతం ఉపాధి మెటీరియల్ నిధులతో ఒక్కో షెడ్ నిర్మాణానికి గరిష్ఠంగా రూ.2.30 లక్షలను మంజూరు చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా మినీ గోకులాలు నిర్మించేందుకు పాడి రైతులు విపరీతంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఒక్క నెలలోనే సుమారు 23 వేల షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయడంతో ఈ పథకానికి విపరీతమైన ఆదరణ లభించింది. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఈ పథకానికి శ్రీకారం చుట్టినప్పటికీ అప్పట్లో రైతులు పరిమితంగా షెడ్లు నిర్మించుకున్నారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటికి బిల్లులు నిలిపేసి రైతులను ఇబ్బంది పెట్టడంతో కూటమి సర్కార్ వచ్చిన తర్వాత రైతులకు బిల్లులు చెల్లించారు.

ఒక్కో షెడ్‌కు రూ.2.30 లక్షల వరకు..

ఉపాధి హామీ పథకంలో పశువుల షెడ్లను నిర్మించేందుకు అనుమతి ఉండటంతో ప్రభుత్వం ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. మొదటగా రాష్ట్ర వ్యాప్తంగా 23 వేల షెడ్లు నిర్మాణాలకు అన్ని జిల్లాల కలెక్టర్లు పరిపాలన ఆమోదం ఇచ్చారు. రెండు పశువులు కలిగిన పాడి రైతులకు రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు కలిగిన వారికి రూ.1.85 లక్షలు, 6 పశువులు కలిగిన వారికి రూ.2.30 లక్షల ఉపాధి మెటీరియల్ నిధులు మంజూరుచేశారు. పశువులతో పాటు 20 మేకలకు షెడ్లు వేసుకునే వారికి రూ.1.30 లక్షలు, 50 మేకలు కలిగిన వారికి రూ.2.30 లక్షలు అందించనున్నారు. అదే విధంగా కోళ్ల ఫారాలకు.. 100 కోళ్లు పెట్టుకున్న వారికి షెడ్డు నిర్మాణానికి రూ.87 వేలు, 200 కోళ్లు పెంచుకునే వారికి రూ.1.32 లక్షలు మంజూరుచేశారు. ఇందులో 10 శాతం రైతులు భరిస్తే, మిగిలిన 90 శాతం ఉపాధి మెటీరియల్ నిధుల నుంచి అందిస్తారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 10 శాతం రైతులు డిపాజిట్ చేస్తేనే పనులు మంజూరు చేసేవారు. అయితే ఈ దఫా ముందుగా పనులు మంజూరుచేసి, రైతులు చెల్లించాల్సిన 10 శాతం వాటా నిర్మాణ ఖర్చులకు వాడుకునేలా వారికే వెసులుబాటు కల్పించారు. ఇందులో కూలీలు చేసే పనులకు ఉపాధి మార్గదర్శకాల ప్రకారం మస్టర్లు నమోదు చేస్తారు.



పిఠాపురం మండలంలో మినీ గోకులాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ (ఫైల్)

బిల్లులు ఆలస్యం చేయకుండా..

పేద కుటుంబాలు ఇళ్లు నిర్మించుకోవాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.1.80 లక్షలే అందిస్తున్నాయి. అయితే ఆరు పశువులు కలిగిన పాడి రైతులకు పశువుల షెడ్ మినీగోకులం నిర్మించేందుకు ఉపాధి హామీ పథకం రూ.2.30 లక్షలు అందిస్తుండడం విశేషం. పైగా వాటి నిర్మాణాలకు బిల్లులు ఆలస్యం చేయకుండా ప్రతి గురువారం గ్రామీణాభివృద్ధిశాఖ చెల్లింపులు చేపడుతోంది. రైతులు తమకు నచ్చిన రీతిలో వారి స్థల అనుకూలతను బట్టి సొంత నిధులతో మరింత పెద్ద షెడ్లను నిర్మించుకునే వెసులుబాటు కూడా కల్పించారు.

పశుగ్రాసం సాగుకూ మెటీరియల్ నిధులు

రాష్ట్రంలో తక్కువ విస్తీర్ణం కలిగిన చిన్న కమతాలే ఎక్కువ. ఈ కమతాల్లో వ్యవసాయం లాభసాటిగా లేదు. దీంతో గ్రామాల్లో ఇలాంటి రైతులు ఎక్కువగా పాడిని నమ్ముకుంటున్నారు. అయితే ఈ పాల ఉత్పత్తి, ఆదాయం కూడా అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలో మినీ గోకులాలు ఊరటనిస్తున్నాయి. పాడి పశువులను ఎండా వానల్లో కాకుండా షెడ్లలో ఉంచి పెంచడం ద్వారా మరింత పాల ఉత్పత్తి పెరిగే అవకాశం పశుసంవర్థక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో పాటు పశుగ్రాసం కోసం మెటీరియల్ నిధులు మంజూరు చేస్తున్నారు. 10 సెంట్ల నుంచి 50 సెంట్ల దాకా సొంత పొలం ఉన్న పాడి రైతులకు మేత పెంచుకునేందుకు ఉపాధి మెటీరియల్ నిధులు మంజూరు చేస్తారు. ఒక్కో రైతు మేత పెంచుకునేందుకు రూ.30 వేల నుంచి 1.30 లక్షల దాకా ఉపాధి నిధులు పొందవచ్చు.

దిల్‌రాజు సహా మరికొందరి వాంగ్మూలాలు నమోదు

- వరుసగా నాలుగోరోజు కొనసాగిన ఐటీ సోదాలు

హైదరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు నివాసంలో ఐటీ అధికారుల సోదాలు వరుసగా నాలుగోరోజు కొనసాగాయి. గత మంగళవారం తెల్లవారుజాము నుంచి సినీ ప్రముఖుల నివాసాలు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. సుకుమార్‌తోపాటు మిగతా వారికి సంబంధించి ఇళ్లు, కార్యాలయాల్లో గురువారం సోదాలు ముగిసినా దిల్‌రాజు నివాసం, కార్యాలయాలు, వ్యాపార భాగస్వాముల నివాసాల్లో ఐటీ ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. శుక్రవారం సోదాల అనంతరం దిల్‌రాజును శ్రీ వెంకటేశ్వరా క్రియేషన్స్ కార్యాలయానికి తీసుకెళ్లారు. ప్రొడక్షన్ కార్యాలయాల్లోనూ సోదాలు నిర్వహించారు. డాకు మహారాజ్ సినిమాకు దిల్‌రాజు డిస్ట్రిబ్యూటర్‌గా ఉండటంతో ఆ సినిమా కలెక్షన్‌లపైనా కొన్ని వివరాలు ఐటీ అధికారులు సేకరించారు. దిల్‌రాజుతోపాటు ఎస్‌వీసీ ఆడిటర్, అకౌంటెండ్ స్టేట్‌మెంట్లను రికార్డు చేసినట్లు సమాచారం. వరుసగా నాలుగు రోజులు జరిగిన తనిఖీల్లో ఆర్థిక లావాదేవీలు, పన్ను చెల్లింపునకు సంబంధించిన పలు పత్రాల్ని స్వాధీనం చేసుకున్నారు.

తెలంగాణలో సినిమా బెనిఫిట్‌షోలు రద్దు

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 24: రాష్ట్రంలో బెనిఫిట్ షోలను రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు, ఏమైనా సినిమాల బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చి ఉంటే వాటిని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. సినిమాటోగ్రఫీ చట్టం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 నుంచి ఉదయం 8.40 వరకూ సినిమాలు ప్రదర్శించటానికి వీల్లేదని హైకోర్టు గుర్తు చేసింది.

పిట్టలోళ్ల గుడిసెలు దగ్ధం

- భైరవపట్నం సమీపంలో ప్రత్తిపాడు స్టేజీ వద్ద ఘటన
- పది మందికి గాయాలు.. అందులో ఆరుగురి పరిస్థితి విషమం

మండవల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా మండవల్లి మండలం భైరవపట్నం సమీపంలోని ప్రత్తిపాడు స్టేజీ వద్ద నివాసముంటున్న పిట్టలోళ్ల గుడిసెలు ప్రమాదవశాత్తు సుమారు 20 చిన్నపాటి గుడిసెలు శుక్రవారం రాత్రి దగ్ధమయ్యాయి. దీంతో చేపల చెరువుపై పిట్టలు వాలకుండా కాపలాకు పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 25 కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. గుడిసెలలో దోమల నివారణకు వెలిగించిన నిప్పు ప్రమాదానికి కారణమైందని భావిస్తున్నారు. సుమారు పది మంది వరకు గాయాలతో కైకలూరు ఆసుపత్రికి తరలించారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. గుడిసెల్లో నిద్రపోతున్న వారు రోడ్డుపైకి పరుగులు తీసుకుంటూ వచ్చేశారు.

స్వామిత్వలో సర్వేయర్ల చేతివాటం

- ప్రాపర్టీ కార్డులకు భారీగా లంచం డిమాండ్
- గోదావరి, కృష్ణా జిల్లాల్లో పెద్దమొత్తంలో వసూళ్ల పర్వం
- అందినంత దండుకుంటున్న సిబ్బంది
- కేంద్ర పథకానికి తూట్లు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దేశంలో గ్రామీణ పౌరులకు సంబంధించిన ఆస్తుల విలువను ధ్రువీకరించి వారికి మేలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ స్ఫూర్తికి రాష్ట్రంలో కొంతమంది సర్వేయర్లు తూట్లు పొడుస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆస్తులకు వెలకట్టడకపోవడం, ఆస్తులు కలిగి ఉన్నా సరైన రికార్డులు లేకపోవడం వంటి కారణాలతో బ్యాంకుల నుంచి రుణాలు పొందలేని పరిస్థితి ఉంది. ఈ కారణాలతోనే గ్రామాల్లో భూ వివాదాలు పెరుగుతున్నాయని కేంద్రం గుర్తించింది. అందుకే ప్రభుత్వమే గ్రామాల్లో ఉన్న ప్రతి ఆస్తిని గుర్తించి, దాని విలువను లెక్కించి దాని యజమానికి హక్కులు కల్పించేందుకు స్వామిత్వ (సర్వే ఆఫ్ విలేజెస్ ఆబాది అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) పథకం ప్రవేశపెట్టింది. ఆ పథకం ద్వారా ప్రాపర్టీ కార్డును జారీచేయాలని నిర్ణయించింది. ఇందుకోసం అధునాతమైన డ్రోన్ టెక్నాలజీని వినియోగించి భూములను సర్వే చేసి, మ్యాపింగ్ చేస్తారు. ఈ కార్డుల ఆధారంగా ప్రజలు బ్యాంకు రుణాలు పొందేలా చర్యలు తీసుకుంటారు. ప్రజల ఆస్తులే కాకుండా గ్రామాల్లో ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఆస్తులను కూడా గుర్తిస్తారు.



ప్రభుత్వ భూముల్లోనూ దోపిడీ

కొన్నిచోట్ల పంచాయతీ, గ్రామకంఠం భూములను సర్వేయర్లు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతూ వారినుంచి భారీగా దండుకుంటున్నారు. స్వామిత్వ ద్వారా పంచాయతీల ఆస్తులకు రక్షణ కలుగుతుందని భావిస్తుంటే.. సర్వేయర్ల నిర్వాకంతో వాటికి ముప్పు ఏర్పడిందని పంచాయతీల సిబ్బంది చెబుతున్నారు. కృష్ణా జిల్లాలోని కొన్ని గ్రామాల్లో కొంతమంది ప్రభుత్వ అధికారుల నుంచి కూడా ఈ సర్వేయర్లు లంచం వసూలు చేశారు. ప్రభుత్వం ఇకనైనా సర్వేయర్ల లంచాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



సర్వేయర్ల బెదిరింపు

రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్‌శాఖ స్వామిత్వ పథకాన్ని నిర్వహిస్తున్నప్పటికీ గ్రామాల్లో సర్వేయర్లు పెత్తనం ఎక్కువగా ఉంది. వారిని నియంత్రించేందుకు పంచాయతీ రాజ్‌శాఖ అధికారులకు నేరుగా అధికారం లేకపోవడంతో సర్వేయర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే భూముల ధ్రువీకరణలో గ్రామాల్లో సర్వేయర్లు రైతులు, ప్రజలపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. తాము కోరినంత ముట్టజెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. డబ్బులివ్వకపోతే ఆ భూమి ప్రభుత్వానిదేనని రికార్డుల్లో చూపిస్తామని బెదిరిస్తున్నారు. సర్వేయర్ల ఆగడాలకు గ్రామీణులు బెంబేలెత్తుతున్నారు. ఏళ్ల తరబడి తమ ఆధీనంలో ఉన్న ఆస్తులు పోగొట్టుకోలేక అప్పో సొప్పో చేసి లంచం ముట్టచెప్పి తమకు అనుకూలంగా స్వామిత్వ పత్రాలను పొందే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాల్లోని గ్రామాల్లో స్థలాల విలువ అధికంగా ఉండటంతో అక్కడ సర్వేయర్లు భారీగా క్యాష్ చేసుకుంటున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చే సంస్కరణలు, పథకాలు పేదలకు ఉపయోగకరంగా ఉండాలని, కానీ ప్రతి పనికీ రేట్ నిర్ణయించే కొంత మంది ఉద్యోగుల వల్ల పథకం నీరుగారిపోతోందని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నామినేటెడ్ పదవులపై కసరత్తు

పార్టీ కార్యాలయానికి చేరిన ప్రతిపాదనలు

> జాబితాల వడపోతలో అధినాయకత్వం
>
> 2,200 వ్యవసాయ సహకార ప్రాథమిక సొసైటీలు, 600 మార్కెట్ కమిటీలకు పాలక మండళ్ల నియామకాలు
>
> ఫిబ్రవరి మొదటి వారంలో వెలువడే అవకాశం
>
> పదవుల్లో టీడీపీకి 80, జనసేనకు 15, బీజేపీకి 5 శాతం
>
> జిల్లా, రాష్ట్ర స్థాయి పదవులకు జోరుగా లాబీయింగ్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాథమిక సహకార సొసైటీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలక వర్గాల నియామకంపై ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. సంక్రాంతిలోపే ఈ నియామకాలు పూర్తవుతాయని పార్టీ వర్గాలు ఆశించినా అనుకోని కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ నెలాఖరుకు ఇవి వెలువడవచ్చని టీడీపీ కేంద్ర కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో సహకార సొసైటీల పాలకవర్గాల పదవీకాలం కొన్ని సంవత్సరాల క్రితమే పూర్తయింది. వైసీపీ ప్రభుత్వం వీటికి ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక వర్గాలతో నడిపించింది. వీటిలో కొన్ని సంస్కరణలు చేపట్టాలన్న యోచనలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా ప్రస్తుతానికి వీటికి నామినేటెడ్ పాలక మండళ్లు నియమించాలని నిర్ణయించింది. ప్రతి సొసైటీకి ముగ్గురు సభ్యుల పాలక మండలిని నియమిస్తారు. ఇందులో ఒకరు చైర్మన్‌గా ఉంటారు. రాష్ట్రంలో వ్యవసాయ సహకార ప్రాథమిక సొసైటీలు 2,200 ఉన్నాయి. ఇవిగాక మత్స్యకార సొసైటీలు, చేనేత సొసైటీలు వంటి వాటికి కూడా పాలక మండళ్లను నియమించాల్సి ఉంది. వీటికి ఎగువన జిల్లా స్థాయిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్, జిల్లా మార్కెటింగ్ సొసైటీలు, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర సహకార బ్యాంక్ వంటి వాటికి కూడా పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. గ్రామ స్థాయిలో నియమించాల్సిన వాటిపై ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులకు పార్టీ నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పదవుల్లో 80 శాతం టీడీపీ, 15 శాతం జనసేన, 5 శాతం బీజేపీకి ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అధిక శాతం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఇప్పటికే ఈ పేర్లు పంపారు. వీటిపై పార్టీ కేంద్ర కార్యాలయం పరిశీలన జరుపుతోంది. పార్టీ కార్యాలయం పరిశీలన పూర్తయితే ఈ నియామకాలపై జీవోలు వెలువడే అవకాశం ఉంది. ఈ నియామకాల కోసం కింది స్థాయిలో పార్టీ నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కింది స్థాయిలో నియామకాలు పూర్తయిన తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయి సహకార సంస్థల పాలక మండళ్లు నియమిస్తారు. వీటికి ఇప్పటికే ఆశావహులు ముమ్మరంగా లాబీయింగ్ చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక మండళ్ల నియామకానికి కూడా ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 600 మార్కెట్ కమిటీలకు పాలక మండళ్లను నియమించాల్సి ఉంది. వీటికి అధ్యక్షుడు, మరి కొందరు డైరెక్టర్లు ఉంటారు. ఈ నియామకాల్లో రిజర్వేషన్ అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఏ మార్కెట్ కమిటీ ఏ రిజర్వేషన్ పరిధిలోకి వస్తుందో ఇప్పటికే ఖరారు చేశారు. దానికి అనుగుణంగా పేర్లు పంపాలని ఎమ్మెల్యేలకు కేంద్ర కార్యాలయం సూచించింది. కొందరు ఎమ్మెల్యేలు ఇప్పటికే పంపారు. మిగిలిన వాటి కోసం కేంద్ర కార్యాలయంలో ఎదురు చూస్తోంది. ఈ ప్రతిపాదనలు అందిన తర్వాత వాటిపై కూడా పార్టీపరంగా పరిశీలన జరుపుతారు. ఆ తర్వాత నియామక ఉత్తర్వులు వెలువడుతాయి. ఫిబ్రవరి మొదటి వారంలో వీటి నియామకాలు జరిగే అవకాశం ఉంది.





పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పార్టీ నాయకులు నన్నపనేని రాజకుమారి తదితరులు

బోగస్ పత్రాలతో స్థలం అమ్మిన కానిస్టేబుల్

- శ్రీశైలంలో దుకాణాలు ఇప్పిస్తానని మోసం.. టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదులు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల భూ దందాలపై టీడీపీ గ్రీవెన్స్‌కు ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి రామనారాయణరెడ్డి, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప అర్జీలు స్వీకరించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడు గవాస్కర్ అండతో శ్రీనివాసరెడ్డి అనేవ్యక్తి బోగస్ డాక్యుమెంట్లతో తమ స్థలాన్ని కబ్జా చేసి, తమపైనే తప్పుడు కేసు పెట్టారని విజయవాడకు చెందిన రిటైర్డ్ టీచర్ అరవింద వాపోయారు. మైదుకూరు వైసీపీ నేత ఉపేంద్ర పట్టాభి తమ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడని, న్యాయం చేయాలని కడప జిల్లా కేఎన్ కొట్టాలకు చెందిన కృష్ణకుమార్ కోరారు. నున్నిపెంటకు చెందిన వైసీపీ నాయకుడు సయ్యద్ నూరుబాష శ్రీశైలం దేవస్థానంలో దుకాణాలు ఇప్పిస్తానని రూ.10లక్షలు తీసుకుని మోసంచేశాడని రామయ్య ఫిర్యాదు చేశారు. జగనన్న కాలనీకి తీసుకున్న తన భూమికి పరిహారం ఇప్పించాలని తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన ఆనంద్‌బాబు కోరారు. రంగయ్య అనే కానిస్టేబుల్ బోగస్ పత్రాలతో తన స్థలాన్ని అమ్మి, డబ్బులు కాజేశాడని నంద్యాల జిల్లా గడివేములకు చెందిన రామకృష్ణారావు వాపోయారు.

రూ.12.39 కోట్ల నకిలీ సిగరెట్లు దహనం



నకిలీ సిగరెట్లను దహనం చేస్తున్న అధికారులు

కస్టమ్స్, సెంట్రల్ జీఎస్టీ అధికారులు వివిధ సోదాల్లో స్వాధీనం చేసుకున్న సిగరెట్లు, గంజాయి, గార్లిక్‌ను శుక్రవారం దహనం చేశారు. డ్రగ్స్ నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలంలోని జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌లోని ఇన్సినరేటర్‌లో ఈ సరుకును బూడిద చేశారు. రూ.6.50 కోట్లు విలువ గల ప్యారిస్ బ్రాండ్ సిగరెట్లు, పన్నులు చెల్లించని విదేశీ, స్వదేశీ నకిలీ సిగరెట్లు, గంజాయి, చైనీస్ గార్లిక్‌ను దహనం చేశారు. రూ.2.73 కోట్ల పన్ను చెల్లించని స్వదేశీ సిగరెట్లు, రూ.2.96 కోట్ల విలువగల 2420 కిలోల గంజాయిని కాల్చేశారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

'టెర్మినల్' నిర్మాణ పనుల్లో అపశ్రుతి

- జారిపడిన ఇనుప స్తంభాలు.. ఇద్దరు కార్మికులకు స్వల్ప గాయాలు
- రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఘటన



నిర్మాణంలో ఉన్న టెర్మినల్ భవనం నుంచి జారి పడిన ఇనుప స్తంభాలు

కోరుకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీప మధురపూడి విమానాశ్రయంలో జరుగుతున్న నూతన టెర్మినల్ భవనం పనుల్లో శుక్రవారం అపశ్రుతి చోటు చేసుకుంది. యంత్రాల సాయంతో ఇనుప స్తంభాలు అమర్చే క్రమంలో కొన్ని బోల్టులు లూజు అయిపోయాయి. దీంతో కొన్ని స్తంభాలు జారి కింద అమర్చిన మరికొన్ని స్తంభాలపై పడి ఒరిగిపోయాయి. ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న ఇద్దరు కార్మికులకు బోల్టులు తగిలి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సుమారు రూ.350కోట్లతో ఈ విమానాశ్రయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అయితే, హైలెవెల్ ఇంజినీరింగ్ పర్యవేక్షణలో జరగాల్సిన నూతన టెర్మినల్ భవనం పనుల్లో, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఘటనపై ఉన్నత స్థాయి కమిటీ లోతుగా అధ్యయనం చేయాలని పలువురు సూచిస్తున్నారు.



అక్షయపాత్ర ఫౌండేషన్‌లో బియ్యం శుభ్రపరిచే యంత్రాన్ని ప్రారంభించిన నారా భువనేశ్వరి

తలసేమియా బాధితులకు బాసట

» 15న విజయవాడలో తమన్ మ్యూజికల్ నైట్: భువనేశ్వరి

విజయవాడ, మంగళగిరి సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు వైద్యం అందించడానికి రాష్ట్రంలో ఐదు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు నారా భువనేశ్వరి వెల్లడించారు. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.60 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. దీనికి విరాళాలు సేకరించేందుకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చే నెల 15న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో సంగీత దర్శకుడు తమన్‌తో మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆ ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మ్యూజికల్ నైట్ టికెట్ల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులను తలసేమియాతో బాధపడే వారి సహాయార్థం అందజేస్తామన్నారు. స్టేడియంలో మ్యూజికల్ నైట్ ఏర్పాట్ల గురించి పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును అడిగి తెలుసుకున్నారు.

'అక్షయపాత్ర'లో బియ్యం శుభ్రపరిచే యంత్రం ప్రారంభం

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలోని అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రీకృత వంటశాలను నారా భువనేశ్వరి శుక్రవారం సందర్శించారు. నూతనంగా ఏర్పాటు చేసిన బియ్యం శుభ్రపరిచే యంత్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుచేస్తున్న 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం' ద్వారా దాదాపు 25 వాహనాల్లో ప్రతిరోజూ ఇక్కడి నుంచి 30 వేల మంది పిల్లలకు భోజనం సరఫరా చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అక్షయపాత్ర మంగళగిరి అధ్యక్షుడు వంశీధర దాస, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, విలాస విగ్రహ దాస, రఘునందన్ దాస, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ ధర్మకర్త తమ్మిశెట్టి జానకీదేవి పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ నిధుల మళ్లింపు..

» తెలంగాణ పోలీసుల అదుపులో ఇద్దరు ఏపీ వాసులు

అమలాపురం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ నిధుల మళ్లింపు వ్యవహారంలో రాష్ట్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరిని తెలంగాణలోని నిజామాబాద్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్ సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆ వివరాలు వెల్లడించారు. రూ.48లక్షల మేర నగదు లావాదేవీలు జరిపిన వ్యవహారంపై తొలుత గుజరాత్ పోలీసులు అమలాపురంలోని వస్త్ర వ్యాపారి తిలక్‌కుమార్‌కు గతంలోనే నోటీసులు జారీ చేశారు. అప్పట్లో ఆయన స్పందించలేదు. అయితే సైబర్ క్రైమ్ లింకులు నిజామాబాద్‌కు కూడా ఉండడంతో సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం అమలాపురం చేరుకుంది. స్థానిక వస్త్ర వ్యాపారి తిలక్‌కుమార్‌కు చెందిన బ్యాంకు ఖాతాను ఆ షాపులో పనిచేస్తున్న ఓ మహిళ రాజోలుకు చెందిన సురేశ్ కుమార్‌కు అప్పగించింది. ఇటీవల ఆ ఖాతాకు రూ.48లక్షల మేర నగదు లావాదేవీలు జరగడం, వాటిని ఇతర ఖాతాలకు మళ్లించడంలో సురేశ్ కుమార్‌ను కీలక పాత్రధారిగా భావిస్తున్నారు. గుజరాత్ కేంద్రంగా సైబర్ క్రైమ్ నిర్వాహకులతో సురేశ్ కుమార్‌కున్న సంబంధాలపై సైబర్‌క్రైమ్ పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ క్రమంలో అమలాపురం చేరుకున్న నిజామాబాద్ పోలీసులు తిలక్‌కుమార్, సురేశ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు.

మంచి ప్రభుత్వాన్ని మార్చేస్తే నష్టం!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను నేను కలిశాను. ప్రభుత్వాలకు కొనసాగింపు ఉన్న రాష్ట్రాలు అభివృద్ధిలో ఎలా ఉన్నాయో... మారిపోతున్న చోట అభివృద్ధి ఎలా ఉందో పోల్చుతూ ఒక రిపోర్ట్ కార్డ్ తయారు చేయాలని నేను ఆమెను కోరాను. దీనివల్ల ప్రజలకు కూడా కొంత అవగాహన వస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో మనం పదేళ్లు ఉండటం వల్ల మంచి ప్రగతి చూపించగలిగాం. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో మనకు అటువంటి అవకాశం దొరకలేదు. ఒక్క మన రాష్ట్రం అని కాకుండా మొత్తం దేశం అంతా ఎలా ఉందో కేంద్ర ప్రభుత్వం ఒక విశ్లేషణ తయారు చేస్తే ప్రజలకు బాగా అర్థం అవుతుంది. ఇటువంటి విషయాలపై ప్రజలకు అవగాహన కలిగించడం అవసరం" అని ఆయన అన్నారు. దావోస్ సమావేశాలు బాగా జరిగాయని, రాష్ట్రాన్ని బాగా మార్కెటింగ్ చేయగలిగామని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనేక పెద్ద సంస్థల్లో భారతీయులు ప్రముఖ స్థానాల్లో ఉండటం తనకు కనిపించిందని, అమెరికా, యూరప్‌ల్లో అక్కడి పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మలుచుకొని పెద్ద పెద్ద కంపెనీల్లో భారతీయులు బాగా ఎదుగుతున్నారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కింది స్థాయిలో ఉన్నవారు ఆర్థికంగా ఎదగడానికి అవకాశాలు ఎలా సృష్టించాలన్న దానిపై తాను దృష్టి పెట్టానని, ఇప్పటికే బాగా ఎదిగినవారిని ప్రోత్సహించి వారి ద్వారా కొంత మందికైనా అవకాశాలు కల్పిస్తే మార్పు త్వరగా వస్తుందని ఆయన చెప్పారు. పార్టీ సభ్యుల్లో ఆర్థికంగా దిగువన ఉన్నవారు, డ్వాక్రా సంఘాల సభ్యులు, యువతకు అవకాశాలు కల్పించాల్సి ఉందని, చిన్న తరహా పరిశ్రమలు... వ్యాపారాలను అభివృద్ధి చేయడానికి అవకాశాలు బాగా ఉన్నాయన్నారు. కాగా, తెలంగాణకు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ దావోస్‌లో బాగా కలిసి వస్తే, ఏపీకి చంద్రబాబు ఇమేజీ ఉపయోగపడుతోందని పార్టీ ఎమ్మెల్యేలు అన్నారు. దావోస్‌లో మిగిలిన వారంతా భారీ కోట్లు, స్వెట్టర్లు వేసుకొని తిరుగుతుంటే ఒక్క చంద్రబాబు మాత్రమే తన డ్రెస్ కోడ్ మార్చకుండా ఉండగలిగారని, ఆయన ఎంత గట్టి మనిషో దీనిని బట్టి అందరికీ తెలిసిపోయిందని ఒక నేత ప్రశంసించారు. ఈ సమావేశంలో పాల్గొన్నవారిలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, నక్కా ఆనందబాబు, తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య, శ్రావణ్ కుమార్, రామాంజనేయులు, భాష్యం ప్రవీణ్ తదితరులు ఉన్నారు. అంతకుముందు దావోస్ పర్యటన ముగించుకొని వచ్చిన ముఖ్యమంత్రికి ఉండవల్లి నివాసం వద్ద పార్టీ నేతలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత అధికారులతో ముఖ్యమంత్రి విడిగా సమావేశం అయ్యారు. దావోస్‌లో తాము జరిపిన చర్చల్లో రాష్ట్రానికి రావడానికి ఆసక్తి చూపిన సంస్థలతో తదుపరి చర్చలు ఎలా కొనసాగించాలో ఆయన వారికి కొన్ని సూచనలు చేశారు.



దావోస్ పర్యటనపై సీఎస్ విజయానంద్, సీఎంవో అధికారులతో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు

పాలనాదక్షతకు అదే ప్రమాణం

» సమస్యల నివృత్తే మా లక్ష్యం: బాబు

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే పాలనా దక్షతకు నిదర్శనమని సీఎం చంద్రబాబు అన్నారు. దావోస్ సదస్సు సందర్భంగా ఒక జాతీయ మీడియా ప్రతినిధి వేసిన ప్రశ్నకు ఆయన ఇలా స్పందించారు. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారాం. ఐటీ నుంచి ఏఐకి వేగంగా వచ్చాం. రియల్ టైమ్‌లో ప్రజల నుంచి సమస్యలను విని, సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నాం. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించడంపై దృష్టి సారించాలని పాలనా యాంత్రాంగాన్ని ఆదేశిస్తున్నాం"అని చంద్రబాబు తెలిపారు. తన పాలనా దక్షతపై నమ్మకం ఉంచి కంపెనీలు పెట్టుబడులతో ఏపీకి వస్తాయన్న ధీమాను ఆయన వ్యక్తంచేశారు.

'కంపెనీల ప్రతినిధులు వస్తారు... సిద్ధంగా ఉండండి'

"పలు దేశాల ప్రతినిధులు, అనేక కంపెనీల సీఈవోలు, కొన్ని దేశాల మంత్రుల బృందాలు రాష్ట్రంలో పర్యటించబోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు దీనికి సన్నద్ధంగా ఉండాలి. మౌలిక సదుపాయాలు, మారిటైం హబ్, ఏఐ యూనివర్సిటీ, గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు, డేటా కేంద్రాలు, ఆహార శుద్ధి రంగం, కోర్ ఇంజనీరింగ్, తయారీ రంగం, ఔషధ రంగం, పునరుత్పాదక ఇంధనం, ఇ-కామర్స్, పరిశోధన, విద్యా రంగానికి సంబంధించిన కంపెనీల అధికారులతో నేను దావోస్‌లో చర్చలు జరిపాను. వచ్చే ఆరు నెలల కాలంలో ఇవి సాకారం కావడానికి మనం పట్టుదలతో పనిచేయాలి" అని అధికారులకు ఆయన తెలిపారు. ఈ దిశగా చేపట్టాల్సిన చర్యలపై కొన్ని సూచనలు చేశారు. దిగ్గజ కంపెనీల సీఈవోలు, ఇతర ప్రముఖులతో జరిగిన చర్చల తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కంపెనీలతో నిరంతరం సంబంధాలు నిర్వహిస్తూ వాటి అవసరాలు ఏమిటో తెలుసుకొని తదనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని, పెట్టుబడుల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేవరకూ పట్టువీడవద్దని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం విజయానంద్ తన నివాసంలో తన కార్యాలయ అధికారులతో సమావేశం నిర్వహించారు.

'విశాఖ ఉక్కు' ప్యాకేజీకి థ్యాంక్స్

» కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలతో చంద్రబాబు భేటీ

» కేంద్ర బడ్జెట్‌లో పోలవరం, అమరావతికి నిధులు కేటాయించాలని వినతి

» దావోస్ నుంచి సీఎం నేరుగా ఢిల్లీకి మాజీ రాష్ట్రపతి కోవింద్‌తోనూ సమావేశం

న్యూఢిల్లీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం పునరుజ్జీవానికి రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇవ్వడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతితో పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఇతోధికంగా నిధులు కేటాయించాలని కోరారు. దావోస్ నుంచి నేరుగా గురువారం అర్ధరాత్రి ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు.. శుక్రవారం తొలుత నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. విశాఖ ఉక్కుకు అందించిన సహాయంపై కృతజ్ఞతలు తెలిపానని.. పోలవరం, అమరావతి, ఏపీ అభివృద్ధిపై చర్చించానని ఆ తర్వాత ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. తర్వాత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఆయన కలుసుకున్నారు. జమిలి ఎన్నికలపై కేంద్రం నియమించిన అత్యున్నత స్థాయి కమిటీకి ఆయన చైర్మన్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఆ కమిటీ కేంద్రానికి సమర్పించిన నివేదికపై కోవింద్‌తో సీఎం చర్చించారని టీడీపీ వర్గాలు తెలిపాయి. చంద్రబాబుకు ఈ సందర్భంగా కోవింద్ తన భార్య, కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. ఈ భేటీల్లో ఆయన వెంట కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ, టీడీపీ ఎంపీ సానా సతీశ్, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు ఉన్నారు. కాగా.. విశాఖ ఉక్కుకు రూ. 11,440 కోట్ల ప్యాకేజీని అందించినందుకు నిర్మలా సీతారామన్‌ను సీఎంతోపాటు కలిసి తాను కూడా కృతజ్ఞతలు చెప్పానని మంత్రి శ్రీనివాస వర్మ విలేకరులకు తెలిపారు. రానున్న బడ్జెట్‌లో పోలవరం, అమరావతితో పాటు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులకు, కొత్త ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు.

ఇండోనేషియా ఆర్థిక మంత్రితో బాబు భేటీ

ఇండోనేషియా ఆర్థిక మంత్రి బుడి సాదికిన్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. జ్యూరిచ్ నుంచి ఢిల్లీ చేరుకున్న ఆయన.. విమానాశ్రయ ప్రాంగణంలోనే మంత్రితో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు.



దావోస్ నుంచి రాష్ట్రానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు గన్నవరం విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్

పాపాలన్నీ చేసి... రాజకీయాల నుంచి తప్పుకొంటావా?

» విజయసాయిరెడ్డి ప్రకటనపై సోమిరెడ్డి వ్యాఖ్యలు



అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'చేసిన పాపాలకు కేసుల భయంతో రాజీనామా నిర్ణయం తీసుకున్నావా? లేక నీ అల్లుడి కంపెనీ అరబిందోను కాపాడుకోవడానికా? ఈ రాజీనామాల పరంపర ఒక్క సాయిరెడ్డితో ఆగేట్టు లేదు. రాత్రికో.. రేపు రాత్రి లోపలో మరో ఒకరిద్దరు కూడా రాజీనామా చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామా ప్రకటనపై ఆయన శుక్రవారం స్పందించారు. 'చేయకూడని పాపాలన్నీ చేసేసి, ఇప్పుడు రాజీనామాతో రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించడం విచిత్రంగా ఉంది. వ్యవసాయం చేస్తానంటున్నావ్.. దోచేసిన నల్ల డబ్బుతో చేస్తావా? ఇప్పుడు సేద్యంలోకి దిగితే రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ఎవరు పూడుస్తారు? 2004 నుంచి మొన్నటి వరకూ జగన్‌రెడ్డితో కలిసి దోచుకొన్న రూ.లక్షల కోట్ల ప్రజల సొత్తు... ఎక్కడుందో చెప్పు' అని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు.

బ్రాండ్ ఏపీ పునరుద్ధరణే లక్ష్యంగా..!

» ముగిసిన లోకేశ్ దావోస్ పర్యటన

» 30 మందికిపైగా పారిశ్రామికవేత్తలతో భేటీలు

» 8 రౌండ్‌టేబుల్ సమావేశాలు

» 9 మంది అంతర్జాతీయ నిపుణులతో చర్చలు

» ఆ ఐదేళ్లూ పునరావృతం కావు!

» ఏఐ, క్లీన్ ఎనర్జీ మా ప్రాధాన్యాలు

» ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా ఆంధ్ర అంతరంగాన్ని ఆవిష్కరించిన యువనేత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల జగన్ అరాచక పాలనలో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్ పునరుద్ధరణే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవవనరుల శాఖల మంత్రి లోకేశ్ దావోస్ పర్యటన సాగింది. గడచిన ఐదేళ్ల నాటి పరిస్థితులు పునరావృతం కావని హామీ ఇస్తూనే.. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలకు వివరించడంలో లోకేశ్ సఫలీకృతలయ్యారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రకటించిన పెట్టుబడిదారుల సానుకూల విధానాలు, అమలు చేస్తున్న ప్రోత్సహకాలు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, కృత్రిమ మేధ (ఏఐ), క్లీన్ ఎనర్జీ వంటి రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలను స్పష్టంగా వివరించారు. దావోస్ పర్యటన పూర్తిచేసుకున్న లోకేశ్ శుక్రవారం రాష్ట్రానికి తిరుగుపయనమయ్యారు. నాలుగు రోజులపాటు అక్కడ జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో 30 మందికిపైగా అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలతో ఆయన ముఖాముఖి భేటీ అయ్యారు. తొలి రోజున స్విట్జర్లాండ్ పారిశ్రామికవేత్తలు, తెలుగు ఇండస్ట్రియలిస్టుల సమావేశాల్లో పాల్గొని.. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు వివిధ అంశాలపై జరిగిన 8 రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరయ్యారు. ఆయా రంగాల్లో ప్రభుత్వ విధానాలను విశదీకరించారు. వివిధ రంగాలకు చెందిన 9 మంది అంతర్జాతీయ నిపుణులతో సమావేశమై ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించారు. తమ సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధిపథంలో పయనిస్తుందో ప్రత్యక్షంగా వివరించారు. చంద్రబాబుతోపాటు మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్, మిట్టల్ గ్రూప్ అధినేత లక్ష్మీమిట్టల్ వంటి దిగ్గజ పారిశ్రామికవేత్తలను కూడా లోకేశ్ కలిశారు. పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ దృక్కోణాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఇదే సమయంలో ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులతో ఇంటరాక్టివ్ సెషన్స్‌లో కూడా ఆయన పాల్గొన్నారు. అంతర్జాతీయంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఏపీ విద్యారంగంలో తెస్తున్న సంస్కరణలు, ఔషధ, ఆరోగ్య, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించారు.



దావోస్‌లో కురుస్తున్న మంచులోనే నడుచుకుంటూ వెళ్తున్న మంత్రి లోకేశ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ తదితరులు

'మంగళగిరి' కానుకలు


దావోస్‌లో అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలతో సమావేశమైన సందర్భాల్లోనూ లోకేశ్ తన నియోజకవర్గమైన మంగళగిరిపై తన ప్రేమను.. మంగళగిరి చేనేతలపై తన అభిమానాన్ని చాటుకున్నారు. బిల్ గేట్స్, లక్ష్మీ మిట్టల్‌ను మంగళగిరి శాలువాలతోనే సీఎం చేతుల మీదుగా సత్కరించారు. తాను కలిసిన పారిశ్రామికవేత్తలను కూడా వాటితోనే సన్మానించారు. దావోస్ వెళ్లే ముందు మంగళగిరి చేనేత శాలువాలను ప్రత్యేకంగా ఆర్డర్ చేసి సిద్ధం చేసుకుని మరీ వెళ్లారు.

జగన్ హయాంలో ఆంధ్రా విలవిల!

(మొదటి పేజీ తరువాయి)

సొంత వనరుల పెరుగుదల శాతం 2018-19లో 17.1 శాతం కాగా.. 2022-23 నాటికి కేవలం 9.8 శాతానికి తగ్గిపోయింది. గత ఐదేళ్లలో రాష్ట్రం నిరంతరం ఆర్థిక లోటు, రెవెన్యూ లోటు ఎదుర్కొంది. తరచూ ఎఫ్ఆర్‌బీఎం లక్ష్యాలను సాధించాలని హెచ్చరించాల్సి వచ్చింది. ప్రభుత్వ రుణం గత ఐదేళ్లలో సగటున 16.5 శాతం మేరకు పెరుగుతూ వచ్చింది. 2022-23లో వడ్డీ చెల్లింపులు 15 శాతం పెరిగాయి. రెవెన్యూ వసూళ్లకు వడ్డీ చెల్లింపులు కూడా పెరుగుతూ వచ్చాయి' అని తెలిపింది. 2022-23లో ఆరోగ్య సౌకర్యాలు, సమస్యల పరంగా ఏపీ అత్యంత దయనీయస్థితిలో ఉందని వెల్లడించింది. ఏపీ, హరియాణా, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్ గట్టి ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నాయన్న నీతి ఆయోగ్.. ఈ రాష్ట్రాలకు పెద్దఎత్తున చేయూత ఇవ్వాలని పేర్కొంది. ఆర్థికంగా బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఒడిశా మొదటి ర్యాంకు సాధించగా.. తెలంగాణకు ఎనిమిదో స్థానం, ఆంధ్రప్రదేశ్‌కు 17వ స్థానం దక్కాయి. జీడీపీలో వాటా, జనాభా, మొత్తం ప్రభుత్వ వ్యయం, ఆదాయాలు, ఆర్థిక సుస్థిరత ఆధారంగా నీతిఆయోగ్ ఈ సూచికను రూపొందించింది. అతితక్కువ ఆర్థిక లోటు, వనరుల సమీకరణ, అతితక్కువ రుణాలు, సగటుకు మించి మూలధన వ్యయం.. ఇలా అన్ని అంశాల్లో ఒడిశా మెరుగైన ఫలితాలు సాధించింది. ఆ రాష్ట్రంతో పాటు మధ్యప్రదేశ్, గోవా, కర్ణాటక, యూపీ.. మొత్తం అభివృద్ధి వ్యయంలో 27 శాతం మేర మూల ధన వ్యయానికి కేటాయిస్తే.. ఆంధ్ర కేవలం 3.5 శాతం కేటాయించిందని.. అప్పుల్లోనూ మూలధన వ్యయానికి 4.4 శాతమే ఖర్చుచేసిందని నీతి ఆయోగ్ నివేదిక తెలిపింది. ఒడిశా ఆర్థిక ఆరోగ్య సూచిక స్కోరు 67.8 కాగా.. ఛత్తీస్‌గఢ్-55.2, గోవా-53.6, జార్ఖండ్-51.6, గుజరాత్-50.5, మహారాష్ట్ర-50.3, యూపీ-45.9, తెలంగాణ 43.6 స్కోరును సాధించాయి. ఆంధ్ర స్కోరు 20.9 మాత్రమే. ద్రవ్యలోటులో ఏపీ అగ్రస్థానంలో ఉండడం నాటి రాష్ట్ర ఆర్థిక దుస్థితికి నిదర్శనం. 2022-23లో రెవెన్యూ సమీకరణలో ఏపీ 22.1 పాయింట్లు సాధించగా.. అప్పుల సూచీలో 37.8, అప్పుల చెల్లింపు సామర్థ్యంలో సున్నా పాయింట్లు వచ్చాయి. నాణ్యమైన ఖర్చుల్లో 15వ ర్యాంకు, ఆదాయ సమీకరణలో 16వ ర్యాంకు, నమ్మకమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో 16వ ర్యాంకు, అప్పులు తేవడంలో 12వ ర్యాంకు వచ్చాయి.

రాజకీయాలకు సాయిరెడ్డి సెలవు!



(మొదటి పేజీ తరువాయి)

డబ్బులో ఆశించి రాజీనామా చేయడం లేదు. ఈ నిర్ణయం పూర్తిగా నా వ్యక్తిగతం. ఎలాంటి ఒత్తిళ్లు లేవు. ఎవరూ ప్రభావితం చేయలేదు" అని ఆయన తెలిపారు.

కలకలం... సంచలనం!

ఎన్నికల్లో ఘోర పరాజయంతో వైసీపీ పూర్తిగా డీలా పడిపోయింది. పరాజయ భారం నుంచి పార్టీ అధ్యక్షుడు జగన్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు! ఇలాంటి పరిస్థితుల్లో... వైఎస్ కుటుంబానికి నాలుగు దశాబ్దాలుగా నమ్మినబంటులా ఉన్న విజయ సాయిరెడ్డి చేసిన 'రాజీనామా' ప్రకటన వైసీపీలో పెను సంచలనం సృష్టిస్తోంది. అక్రమాస్తుల కేసుల్లో అరెస్టు అనంతరం జగన్‌కు సాయిరెడ్డి మరింత సన్నిహితుడయ్యారు. వైసీపీ కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పాల్గొంటూ వచ్చారు. 2009 నుంచి 2019 దాకా పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండగా... తెలుగుదేశంపై దూకుడుగా వ్యవహరించారు. మరీముఖ్యంగా... 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు, లోకేశ్‌లపై వ్యక్తిగత విమర్శలతో విరుచుకుపడ్డారు. ఒకరకంగా చెప్పాలంటే.. తన స్థాయికి, హుందాకు తగని వ్యాఖ్యలు చేస్తూ 'వివాదాస్పదుడి'గా ముద్ర వేయించుకున్నారు. అక్రమాస్తుల కేసులో ఏ2గానే కాదు... వైసీపీలోనూ సుదీర్ఘకాలం నంబర్ 2గా సాయిరెడ్డి కొనసాగారు. పార్టీలో సజ్జల రామకృష్ణా రెడ్డి క్రియాశీలం అయ్యాక సాయిరెడ్డి పరిస్థితి మారిపోయింది. ఆయనను జగన్ కొన్నాళ్లు దూరం ఉంచడం, కొన్నాళ్లు బుజ్జగించడం... ఇలా వైసీపీలో సాయిరెడ్డి పరిస్థితి గజిబిజిగా తయారైంది. ఒక దశలో ఆయన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తగా చక్రం తిప్పారు. ఆ తర్వాత సాయిరెడ్డిని తప్పించి... జగన్ తన బాబాయి వైవీ సుబ్బారెడ్డికి ఉత్తరాంధ్ర బాధ్యతలు అప్పగించారు. జగన్‌పై తాను అలిగినా, తనపై జగన్ ఆగ్రహించినా సాయిరెడ్డి మాత్రం ఆయనను అంటిపెట్టుకునే ఉన్నారు.

బాబు, బాలయ్యతో మాట్లాడారని...

నారా లోకేశ్ పాదయాత్రను ప్రారంభించే సమయంలో నటుడు నందమూరి తారకరత్న గుండెపోటుకు గురయ్యారు. ఆయన భార్య సాయిరెడ్డికి సన్నిహిత బంధువు. దీంతో... తారకరత్నకు వైద్య సేవలు అందించే సమయంలో సాయిరెడ్డి తరచూ ఆస్పత్రికి వచ్చి వెళ్లారు. అదే సమయంలో... బాలకృష్ణ, చంద్రబాబుతో పలుమార్లు మాట్లాడారు. ఇది .. జగన్‌కు ఆగ్రహం తెప్పించిందని అంటారు. ఆ తర్వాత కాలంలో మళ్లీ దగ్గరైనా అంతకుముందున్న 'పరస్పర విశ్వాసం' సన్నగిల్లిందని చెబుతారు. వైఎస్ కుటుంబ ఆస్తుల పంపకాల వివాదంలో ఆయన జగన్ పక్షానే నిలిచారు. వైఎస్ విజయలక్ష్మి, షర్మిలపై విమర్శలు గుప్పించి... వారికీ చెడ్డయ్యారు.

'పోర్టు' వివాదంలో మునిగి...

ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జగన్‌తోపాటు సాయిరెడ్డిపై కేసుల కత్తి వేలాడుతూనే ఉంది. దీనికి తోడు... తాజాగా కాకినాడ డీప్‌సీ పోర్టు వివాదంలో సాయిరెడ్డి నిండా మునిగిపోయారు. బెదిరించి, భయపెట్టి పోర్టులో వాటాలు లాక్కున్నారన్న ఫిర్యాదు మేరకు సీఐడీ నమోదు చేసిన కేసులో సాయిరెడ్డి కూడా నిందితుడే. దీనిని ఆధారంగా చేసుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా రంగంలోకి దిగింది. సాయిరెడ్డిని పిలిచి ప్రశ్నించింది కూడా! అదే సమయంలో అనూహ్యంగా సండూర్ పవర్‌లో పెట్టుబడులపైనా ప్రశ్నలు సంధించింది. ఈ క్రమంలో... కాకినాడ డీప్‌పోర్టులో వాటాలను 'అరబిందో' వదిలేసుకుంది. అయినా... కేసు మాత్రం అలాగే ఉంది! వీటన్నింటి నేపథ్యంలోనే సాయిరెడ్డి 'రాజీనామా' ప్రకటన వెలువడటం గమనార్హం.

ఫిబ్రవరి 10న విదేశాలకు...

రాజీనామా చేసిన ప్రకటన రోజునే... విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలంటూ సాయిరెడ్డి నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టును కోరారు. ఫిబ్రవరి 10 నుంచి మార్చి 10వ తేదీ వరకు నార్వే, ఫ్రాన్స్‌లో పర్యటించేందుకు అనుమతించాలని పిటిషన్ వేశారు. దీనిపై న్యాయస్థానం సీబీఐ స్పందన కోరుతూ విచారణను 27వ తేదీకి వాయిదా వేసింది.

'అయోధ్య'దీ అదే దారి!?

వైసీపీకే చెందిన మరో రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి కూడా త్వరలోనే వైసీపీకి గుడ్‌బై చెప్పి... తన పదవికి రాజీనామా చేసే అవకాశముందని తెలుస్తోంది. రాజకీయ భవిష్యత్తుపై మరింత స్పష్టత కోసం ఆయన వేచి చూస్తున్నారని... అది రాగానే రాజీనామా ప్రకటన చేస్తారని చెబుతున్నారు.

ఇదీ సాయిరెడ్డి ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాను. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన జగన్ గారికి, నన్ను ఇంతటి ఉన్నత స్థాయికి తీసుకువెళ్లిన భారతమ్మగారికి సదా కృతజ్ఞుడిని. జగన్ గారికి మంచి జరగాలని కోరుకుంటున్నా. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, రాజ్యసభలో ఫ్లోర్ లీడర్‌గా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా... పార్టీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో, శక్తివంచన లేకుండా కృషి చేశా. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వారధిలా పనిచేశా. దాదాపు తొమ్మిది సంవత్సరాలు ప్రోత్సహించి కొండంత బలాన్ని, మనోధైర్యాన్నిచ్చి తెలుగు రాష్ట్రాల్లో నాకు గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీ గారికి, హోం మంత్రి అమిత్‌షా గారికి ప్రత్యేక ధన్యవాదాలు. టీడీపీతో రాజకీయంగా విభేదించాను. చంద్రబాబుగారి కుటుంబంతో వ్యక్తిగతంగా విభేదాలు లేవు. పవన్ కల్యాణ్‌గారితో చిరకాల స్నేహం ఉంది. నా భవిష్యత్తు వ్యవసాయం. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆదరించిన నా రాష్ట్ర ప్రజలకు, మిత్రులకు, సహచరులకు, పార్టీ కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను."

ఐఓఏ మార్గదర్శకాలను విధిగా పాటించాలి

» శాప్, వివిధ అసోసియేషన్లకు హైకోర్టు స్పష్టీకరణ



అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ వేదికగా ఈ ఏడాది జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరగనున్న 38వ జాతీయ క్రీడలకు రాష్ట్రం నుంచి క్రీడాకారులను పంపే విషయంలో ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ జారీ చేసిన మార్గదర్శకాలను తూ.చ.తప్పకుండా పాటించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్), ఏపీ ఆర్చరీ, ఏపీ అథ్లెటిక్, ఏపీ జూడో, ఏపీ ఖోఖో, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్లకు హైకోర్టు ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం దాఖలు చేసిన పిటిషన్ మేరకు ఈ ఆదేశాలిచ్చింది. జాతీయ క్రీడలకు ఏపీ నుంచి క్రీడా బృందాలను పంపే అధికార పరిధి పిటిషనర్‌కు (ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్) ఉందని స్పష్టం చేసింది. క్రీడాకారుల ఎంపిక విషయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ జారీ చేసిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించడంలేదని పేర్కొంది. జాతీయ క్రీడలకు క్రీడా బృందాలను పంపేవిషయంలో రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యతలను పిటిషనర్ అసోసియేషన్ నిర్వహించడమే సముచితమని అభిప్రాయపడింది. ఈ మేరకు హైకోర్టు సింగిల్ జడ్జి శుక్రవారం తీర్పు ఇచ్చారు.

తురకా కిశోర్ మళ్లీ జైలుకు

» 14 రోజుల రిమాండ్.. నెల్లూరు జిల్లా జైలుకు తరలింపు

మాచర్లటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్, వైసీపీ నేత తురకా కిశోర్‌కు మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రిమాండ్ విధించింది. గత మే 13వ తేదీ సాధారణ ఎన్నికల రోజున మాచర్ల పీడబ్ల్యూడీ కాలనీలోని టీడీపీ నేత యెనుముల కేశవ రెడ్డి గృహంపై జరిగిన దాడిలో తురకా కిశోర్, అతడి సోదరుడు శ్రీకాంత్ ఏ 15, ఏ 16 నిందితులుగా ఉన్నారు. మాచర్ల పోలీసులు ఇరువురు నిందితులనూ శుక్రవారం కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి పల్లె పోగు ప్రశాంత్ 14 రోజులు రిమాండ్ విధించగా నెల్లూరు జిల్లా జైలుకు తరలించారు. 2022 డిసెంబరు 16న మాచర్లలో టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డి 'ఇదేం కర్మ రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహిస్తుండగా జరిగిన దాడి కేసులో సోదరులిద్దరికీ మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇప్పటికే రిమాండ్ విధించింది. హైకోర్టు నుంచి బెయిల్ పొందిన వీరిపై మాచర్ల పోలీసులు పీటీ వారెంట్ వేయడంతో పీడబ్ల్యూడీ కాలనీలో జరిగిన దాడి కేసులో కిశోర్, అతని సోదరుడు మళ్లీ జైలుకు వెళ్లక తప్పలేదు.

కోడికత్తి కేసు ఫిబ్రవరి 21కి వాయిదా

» కోర్టుకు హాజరుకానివారిపై చర్యలు తీసుకోవాలి: విదసం

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయంలో ఐదేళ్ల క్రితం వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిపై కోడి కత్తితో దాడి చేసిన కేసు విచారణ వాయిదా పడింది. ఇక్కడి ఎన్ఐఏ కోర్టులో ఈ కేసు శుక్రవారం విచారణకు రాగా నిందితుడు జనిపల్లి శ్రీనివాస్, న్యాయవాది అబ్దుల్ సలీమ్‌తో కలిసి హాజరయ్యారు. ఫిర్యాదీ, బాధితుడు అయిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి కోర్టుకు హాజరు కానందున కేసు విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేశారు. ఈ సందర్భంగా కోర్టు బయట విదసం కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ నిందితుడు శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరై ఏడాది కావస్తున్నదని, సాక్ష్యం చెప్పడానికి జగన్మోహన్‌రెడ్డి మూడేళ్లుగా కోర్టుకు రావడం లేదని అన్నారు. ఇలా వందల సార్లు కోర్టు వాయిదాకు గైర్హాజరయ్యే వారిపై కోర్టు ధిక్కార నేరం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజయవాడ నగరంపై మంచు దుప్పటి!





శుక్రవారం తెల్లవారుజామున విజయవాడ నగరాన్ని కమ్మేసిన పొగమంచు

రాష్ట్రాన్ని కమ్మేసిన పొగమంచు!

» అమరావతిలో విజిబిలిటీ 'సున్నా'

» గ్రామీణ ప్రాంతాల్లో 100 మీటర్ల లోపే

» విశాఖ, బెజవాడల్లో విమానాల రాకపోకలకు అంతరాయం

» నేడు, రేపు పొగమంచు ప్రభావం

విశాఖపట్నం, గన్నవరం, రాజమహేంద్రవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పొగమంచు కప్పేసింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకూ అన్ని ప్రాంతాల్లో మంచు దట్టంగా కురవడంతో వాహనాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విజిబిలిటీ బాగా తగ్గిపోవడంతో 100 మీటర్ల దూరంలో ఉన్న మనుషులు కూడా కనిపించలేదు. పొగమంచు ప్రభావంతో ఉదయం విశాఖపట్నం, విజయవాడల్లో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విశాఖ ఎయిర్‌పోర్టులో ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు విజిబిలిటీ 500 మీటర్లకు పడిపోయింది. శివారు ప్రాంతాల్లో 100 మీటర్ల కంటే తక్కువగా ఉంటుందని అంచనా వేశారు. అమరావతిలో విజిబిలిటీ 'సున్నా'గా నమోదైనట్టు భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఉదయం 8గంటల వరకు అమరావతి పరిసరాల్లో పొగమంచు దట్టంగా కురవడంతో ఈ పరిస్థితి నెలకొందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇదిలావుండగా గాలులు నిశ్చలంగా ఉండడం (వేగం మందగించడం), ఆకాశం నిర్మలంగా ఉండడం, తెలంగాణ, కోస్తా, ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో అధికపీడనం కొనసాగడంతో పొగమంచు దట్టంగా కురిసిందని వాతావరణ అధికారి ఎస్.జగన్నాథకుమార్ పేర్కొన్నారు. రానున్న రెండు రోజులు పొగమంచు ప్రభావం ఉంటుందని, వాహనాలు నడిపేవారు జాగ్రత్తగా ఉండాలని కోరారు.



విశాఖలో గగనతలంపై మంచులో విమానాలు

నాలుగు విమానాలు ఆలస్యం

దట్టమైన మంచు కారణంగా ఉదయం విశాఖపట్నం రావలసిన, ఇక్కడి నుంచి వెళ్లాల్సిన పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి. మంచువల్ల పైలట్లకు రన్‌వే సరిగ్గా కనిపించకపోవడం, ఇనుస్ట్రుమెంటల్ ల్యాండింగ్ సిస్టమ్ ప్రస్తుతం అందుబాటులో లేని కారణంగా ఆలస్యమయ్యాయి. విశాఖ నుంచి ఉదయం 8.40 గంటలకు హైదరాబాద్ బయలురాల్సిన విమానం గంటన్నర ఆలస్యంగా వెళ్లింది. హైదరాబాద్‌కు 8.45 గంటలకు వెళ్లాల్సిన మరో విమానం 2.45 గంటలు ఆలస్యంగా వెళ్లింది. విశాఖ నుంచి 8.55 గంటలకు విజయవాడ బయలురాల్సిన విమానం 3.05 గంటలు ఆలస్యంగా వెళ్లింది. విశాఖ నుంచి ఉదయం 8.25 గంటలకు చెన్నై బయలుదేరాల్సిన విమానం 1.50 గంటలు ఆలస్యంగా వెళ్లిందని విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు.

విజయవాడ విమానం.. రాజమండ్రికి..

పొగమంచు కారణంగా విజయవాడ నుంచి విమానాలు ఆలస్యంగా నడిచాయి. శుక్రవారం ఉదయం 7.05కు హైదరాబాద్ నుంచి గన్నవరం రావాల్సిన ఇండిగో విమానం అదే సమయానికి వచ్చినప్పటికి విజిబిలిటీ లేక గాలిలో చక్కర్లు కొడుతూ నూజివీడు వరకూ వెళ్లింది. ఆ సమయానికి ఫ్యూయల్ తక్కువగా ఉండటంతో రాజమండ్రి విమానాశ్రయానికి వెళ్లి 8.30కు ల్యాండ్ అయ్యింది. సుమారు 45 నిమిషాల పాటు ఈ ఇండిగో విమానం రన్‌వే పైనే ఉంది. తిరిగి 10.30కి గన్నవరంలో ల్యాండింగ్ అయ్యింది. అలాగే, మరో మూడు విమానాలను ముందుగానే బెంగళూరు, చెన్నైలో నిలిచిపోయి మంచు తగ్గిన తర్వాత వచ్చాయి. విమానాల ఆలస్యం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా హరిహరనాథశర్మ, లక్ష్మణరావు ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

వారి నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జారీ చేసిన నియామక ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(ఎఫ్ఏసీ) వి.శ్రీనివాస శివరామ్ చదివి వినిపించారు. న్యాయాధికారులు అవధానం హరిహరనాథశర్మ, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావులను ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా ఈ నెల 11న సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. వీరి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆమోదముద్ర వేయడంతో సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. ఏపీ హైకోర్టులో 37 మంది జడ్జీల నియామకానికి ఆమోదం ఉండగా ఈ సంఖ్య 28గా ఉంది. తాజాగా ఇద్దరు అదనపు న్యాయమూర్తుల చేరికతో సంఖ్య 30కి చేరింది. కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గంగారావు, ప్రమాణం చేసిన న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, హైకోర్టు రిజిస్ట్రార్‌లు, న్యాయవాదులు, అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం న్యాయమూర్తులు అవధానం హరిహరనాథశర్మ, డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు వేర్వేరుగా సింగిల్ బెంచ్‌లో కేసులు విచారించారు.

కొలిక్కివచ్చిన 'దేవదాయ' పంచాయితీ

» కమిషనర్‌గా రామచంద్రమోహన్ బాధ్యతలు

» కొత్త కార్యదర్శి వినయ్‌చంద్‌తో కలిసి మంత్రితో భేటీ

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ కమిషనర్ పంచాయితీ ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. కమిషనర్ ఎస్.సత్యనారాయణను ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఆ శాఖ చరిత్రలో తొలిసారి నాన్-ఐఏఎస్ అధికారి కె.రామచంద్రమోహన్‌ను కమిషనర్‌గా నియమించింది. దీనిపై కొంత వ్యతిరేకత వ్యక్తమైంది. హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలైంది. దేవదాయ కమిషనర్‌గానే కొనసాగేందుకు సత్యనారాయణ సైతం ప్రయత్నాలు చేశారు. ఆయన్నే ఉంచాలని కొందరు ఆధ్యాత్మికవేత్తలూ ప్రభుత్వానికి లేఖలు రాశారు. అయితే సర్కారు మాత్రం రామచంద్రమోహన్‌వైపే మొగ్గు చూపింది. ఉత్తర్వులు అమలు కావలసిందేనని సీఎంవో నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. దీంతో సత్యనారాయణ శుక్రవారం మధ్యాహ్నం రిలీవయ్యారు. అటు హైకోర్టులో ఈ వ్యవహారం విచారణకు రాగా.. సర్వీసు వ్యవహారాలు చూసే ధర్మాసనానికి పిటిషన్ బదిలీ అయింది. దరిమిలా రామచంద్రమోహన్‌కు మార్గం సుగమమైంది. సాయంత్రం ఐదు గంటలకు ఆయన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇంకోవైపు.. దేవదాయ శాఖ కొత్త కార్యదర్శిగా వి.వినయ్‌చంద్ శుక్రవారమే సచివాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం రామచంద్రమోహన్‌తో పాటు దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వినయ్‌చంద్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పన, ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులపై చర్చించారు.

రామచంద్రమోహన్ బాధ్యతలు చేపట్టకుండా హైకోర్టులో రిట్

దేవదాయ శాఖ అదనపు కమిషనర్ రామచంద్రమోహన్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ పూర్తయ్యేవరకు ఆయన్ను ఆ శాఖలో కొనసాగించవద్దంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మచిలీపట్నానికి చెందిన వీవీ రమణమూర్తి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కమిషనర్‌గా ఆయనకు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ జారీచేసిన ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని కోరారు. ఈ వ్యాజ్యం శుక్రవారం సింగిల్ జడ్జి ముందు విచారణకు రాగా.. ఉద్యోగుల సర్వీసు అంశాలపై విచారణ జరిపే ధర్మాసనానికి బదిలీ చేశారు.

పోలీసు కస్టడీకి తులసిబాబు

ఒంగోలుక్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితుడిగా ఉన్న బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం రాంకూరుకు చెందిన కామేపల్లి తులసిబాబును ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం నుంచి 29 మధ్యాహ్నం వరకు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ గుంటూరు సీఐడీ కోర్టు మెజిస్ట్రేట్ శైలజ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో తులసిబాబు అరెస్టై ప్రస్తుతం గుంటూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నెల 8న తులసిబాబును జిల్లా పోలీసు కార్యాలయంలో విచారించిన ఎస్పీ ఏఆర్ దామోదర్, అతడిని అరెస్టు చేశారు. ఆ తర్వాత పోలీసు కస్టడీకి కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, న్యాయమూర్తి అనుమతి మంజూరు చేశారు.

వైసీపీ నేత గౌతంరెడ్డికి ముందస్తు బెయిల్

» విచారణకు సహకరించాలని సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, ఫైబర్ నెట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గౌతంరెడ్డికి సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది. పోలీసు విచారణకు సహకరించాలని ఆదేశించింది. విజయవాడలోని సత్యనారాయణపురం శివాలయం వీధికి చెందిన ఉమామహేశ్వరశాస్త్రి స్థలాన్ని గౌతంరెడ్డి ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉమామహేశ్వరశాస్త్రిపై హత్యాయత్నం జరిగింది. ఈ ఘటనలో గౌతంరెడ్డి సహా మరో 9 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని గౌతంరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం తిరస్కరించింది. గతేడాది డిసెంబరు 18న హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపిస్తూ... ఉద్దేశపూర్వంగా కేసు పెట్టారని, కేసులో సహ నిందితులందరూ బెయిల్ పైనే ఉన్నారని, గౌతంరెడ్డికి ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఏపీ ప్రభుత్వం తరఫున సిద్ధార్థ లూథ్రా అభ్యంతరం తెలిపారు. గౌతంరెడ్డికి బెయిల్ మంజూరు చేస్తే కేసును ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. ఇరువాదనలు విన్న ధర్మాసనం, గౌతంరెడ్డి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. పోలీసు విచారణకు సహకరించాలని, ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లాలని, సాక్షులను ప్రభావితం చేయొద్దని ఆదేశించింది.

దేశంలోనే అత్యంత ఖరీదైన

రిఫైనరీ ఏపీలో

(మొదటి పేజీ తరువాయి)

ప్రాథమికంగా అంచనా వేసింది. శుక్రవారం బీపీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) వెస్టా రామకృష్ణ గుప్తా ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏటా తొమ్మిది మిలియన్ టన్నుల సామర్థ్యం గల ఆయిల్ రిఫైనరీ కం పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. దేశంలోని ఆయిల్, పెట్రో కెమికల్ రిఫైనరీల్లో ఇదే అత్యంత ఖరీదైన ప్రాజెక్టుగా నిలుస్తుందన్నారు. 2014లో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మహారాష్ట్రలోని రత్నగిరిలో రూ.3 లక్షల కోట్ల అంచనా వ్యయంతో 60 మిలియన్ టన్నుల మెగా ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని భావించామని, కానీ భూసేకరణ సమస్య వల్ల ముందుకు సాగలేదని వివరించారు. ఏపీలో ఏర్పాటు చేయబోయే ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కోసం భూసేకరణ, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్), ఫీడ్ బ్యాక్ అధ్యయనాల కోసం ప్రీ ప్రాజెక్టు కార్యక్రమాల కింద రూ.6,100 కోట్లు ఖర్చు చేయడానికి బీపీసీఎల్ బోర్డు ఆమోదం



తెలిపిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి ఏపీ ప్రభుత్వం మూలధన రాయితీలు అందిస్తుందన్నారు. అయితే ఆర్థిక మద్దతుకు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఎటువంటి సంకేతాలు ఇవ్వలేదని వెల్లడించారు. డీపీఆర్, ఫీడ్‌బ్యాక్ అధ్యయన నివేదికలకు ఆరు నుంచి తొమ్మిది నెలల సమయం పడుతుందని తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ప్రాజెక్టు ఖర్చు రూ.95 వేలకోట్లు ఉంటుందన్నారు. నివేదికలు వచ్చిన తర్వాత మొత్తం ప్రాజెక్టు ఖర్చు ఎంత ఉంటుందో అంచనాకు రావొచ్చని వివరించారు. జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా చేపట్టాలని చూస్తున్నామని చెప్పారు. మొత్తం ఎంత వ్యయం అవుతుందనే అంచనాకు వచ్చిన తర్వాత 48 నెలల్లో ప్రాజెక్టు పూర్తవుతుందని, వినియోగంలోకి వస్తుందన్నారు. కోస్తా తీర ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నామని, భూమి కూడా గుర్తించామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు 6,000 ఎకరాల భూమి అవసరమని, భూసేకరణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఏటా 3-3.5 మిలియన్ టన్నులు పెట్రోల్, డీజిల్.. 3.8-4 మిలియన్ టన్నులు పెట్రో కెమికల్స్ ఫీడ్ స్టాక్ ఉత్పత్తి సామర్థ్యం ఉంటుందని వివరించారు. ఈ ప్రాజెక్టు 2040 వరకు భారతదేశ ఇంధన డిమాండ్‌ను తీర్చడానికి సరిపోతుందని అభిప్రాయపడ్డారు. దేశంలో ఇప్పటికే మూడు (ముంబై, కొచ్చి, మధ్యప్రదేశ్‌లోని బీనాల్లో) రిఫైనరీలను ఏర్పాటు చేశామని, ఏపీలో నాలుగోది ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు.

రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ రిఫైనరీ

రాజస్థాన్‌లోని బర్మార్‌లో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) పెట్రో కెమికల్ రిఫైనరీ త్వరలో వినియోగంలోకి రానుందని వెస్టా రామకృష్ణ గుప్తా వెల్లడించారు. బర్మార్ రిఫైనరీ ఏర్పాటు కోసం హెచ్‌పీసీఎల్ రూ.71,814 కోట్లు ఖర్చు చేసిందన్నారు.



కవాతుకు సిద్ధమైన సీపీఎం ఎర్ర సేన

నెల్లూరులో సీపీఎం రాష్ట్ర మహాసభలు

» 1 నుంచి మూడు రోజులు నిర్వహణ

నెల్లూరు వైద్యం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1 నుంచి మూడు రోజులపాటు నెల్లూరులో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం నగరంలోని వీఆర్‌సీ క్రీడా మైదానంలో డప్పు వాయించి మహాసభల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఎరుపు రంగు చొక్కాలు ధరించిన వలంటీర్ల దండు నగరంలోని ప్రధాన కేంద్రాలగుండా ప్రదర్శనగా సాగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, అనేక ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిన సింహపురి గడ్డపై నుంచే భవిష్యత్తు పోరాటాలకు మహాసభలలో రూపకల్పన చేస్తామన్నారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభల ముగింపు రోజు 3వ తేదీన నగరంలో భారీ ప్రదర్శన, వీఆర్‌సీ మైదానంలో బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో నేతలు రమాదేవి, మూలం రమేశ్, షేక్ మస్తాన్‌బీ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు నేడు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు మెలకువలు నేర్పేందుకు ఏపీ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం గుంటూరులో రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి, ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ చైర్మన్ జస్టిస్ ఆర్.రఘునందనరావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పెద్దఎత్తున న్యాయవాదులు హాజరుకానున్నారని న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి బబిత తెలిపారు.

మావోయిస్టు నేత చలపతి అంత్యక్రియలు పూర్తి

» అత్తగారి ఊరు శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడులో నిర్వహణ

» ప్రజాసంఘ నాయకుల నివాళి

పలాస/పలాస రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాపరెడ్డి అలియాస్ చలపతి అంత్యక్రియలు ఆయన అత్తగారి గ్రామం శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడులో విప్లవ అభిమానులు, సానుభూతిపరులు, ప్రజా సంఘాల సమక్షంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగాయి. ఇటీవల ఛత్తీస్‌గఢ్ - ఒడిశా సరిహద్దు ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటరులో చలపతి సహా 16మంది మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే. బొడ్డపాడుతో చలపతికి ఉద్యమ బంధం ఉంది. సెరీ కల్చర్ ఉద్యోగిగా విజయనగరం వచ్చి అక్కడే నక్సలిజానికి ఆకర్షితుడై చలపతి ఉద్యమబాట పట్టారు. ఆయన ఉద్యమ ప్రస్థానం బొడ్డపాడులోనే మొదలైంది. ఈ ప్రాంతంలో సుధ అని ఆయనను పిలుస్తారు. ఆయన మృతదేహం శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఇక్కడకు చేరుకుంది. బొడ్డపాడు అమరవీరుల స్మారకమందిరం వద్ద ఉంచిన ఆయన మృతదేహం వద్ద ప్రజాసంఘాల నాయకులు, కళాకారులు నివాళులు అర్పించారు. అనంతరం ఊరేగింపుగా చలపతి మృతదేహాన్ని తీసుకుని వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున స్థానికులతోపాటు అమరుల బంధుమిత్రుల సంఘం, పౌరహక్కులసంఘం, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడులో చలపతి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న విప్లవ అభిమానులు

సహచరి అరుణ... బాటలోనే..

చలపతి భార్య పోతనపల్లి రుక్మిణి అలియాస్ అరుణది బొడ్డపాడు. ఆమె 18 ఏళ్లకే ఉద్యమంలో తుపాకీ పట్టారు. ఆ తర్వాత ఏడేళ్లకు చలపతితో వివాహం అయింది. వీరికి పిల్లలు లేరు. రుక్మిణి తల్లి సాయమ్మ వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ తన తమ్ముళ్ల ఇంటివద్ద ఉంటోంది. ఆమెకు రుక్మిణి ఒక్కరే కుమార్తె. ఇప్పుడు అల్లుడు కూడా చనిపోవడం ఆమెను కుంగదీసింది. రుక్మిణి మరణానంతరం చలపతి ఉద్యమంలోనే విశాఖకు చెందిన మరో యువతిని పెళ్లి చేసుకున్నారు. కాగా, చలపతి అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో నిర్వహించాల్సి ఉంది. అయితే, ఛత్తీస్‌గఢ్ నుంచి మృతదేహాన్ని చిత్తూరుకు తరలించడం కష్టంగా మారింది. దీంతో అంత్యక్రియల కోసం బొడ్డపాడును ప్రజాసంఘాలు ఎంపిక చేశాయి. తన అంత్యక్రియలు బొడ్డపాడులోనే చేయాలని చలపతి అనేవారని స్థానికులు గుర్తుచేసుకున్నారు.

నక్సల్ యాక్షన్ టీమ్ కమాండర్ ముఖేశ్ అరెస్టు

పాడేరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో మావోయిస్టు పార్టీ యాక్షన్ టీమ్ కమాండర్‌గా పనిచేస్తున్న కొవ్వాడ సొమడ అలియాస్ ముఖేశ్‌ను (33) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లేరు అటవీ ప్రాంతంలో అతడిని అరెస్టు చేసినట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ శుక్రవారం తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం.. ముఖేశ్‌ది ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పరిధిలోని గొంపాడ్ గ్రామం. 19 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో ఒడిశాలోని కుంట ఏరియా కమిటీలో యాక్షన్ టీమ్ కమాండర్‌గా బాధ్యతలు తీసుకున్నాడు. అతనిపై 17 క్రిమినల్ కేసులున్నాయి. ముఖేశ్ వద్ద నుంచి పేలుడు పదార్థాలు కలిగిన క్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



అల్లిగూడెంలో విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్న సీఆర్‌పీఎఫ్ నేతృత్వంలో నిర్మించిన రామమందిరం

మావోయిస్టుల గ్రామంలో రాములోరి గుడి

చింతూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం అల్లిగూడెంలో సీఆర్‌పీఎఫ్ నేతృత్వంలో రామమందిరం నిర్మించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దును ఆనుకొని ఉన్న అల్లిగూడెం మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో ఒకటి. ఇటీవల మావోయిస్టు ప్రభావాన్ని నియంత్రించే క్రమంలో అక్కడ సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఏర్పాటు చేశారు. కాగా ఇదే గ్రామంలో సీఆర్‌పీఎఫ్ నిధులతో రామమందిరం కూడా నిర్మించారు. శుక్రవారం సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ రితేష్ ఠాకూర్ పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించి మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అధికారి హేమంత్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.